PRAJASAKTI Regd.No. 15795/68 సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 15 | విజయవాడ, మంగళవారం 15 ఆగస్టు 2023 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Tuesday 15 August 2023 | Rs

వర్ష బీభత్సం

హిమాచల్ ప్రదేశ్‌లో 51 మంది మృతి

- ఒక్క సిమ్లాలోనే కొండ చరియలు విరిగిపడి 14 మంది దుర్మరణం
- కొట్టుకుపోయిన రైల్వే లైన్లు



సిమ్లాలో జాతీయ రహదారిపై విరిగిపడిన కొండ చరియలు

షిమ్లా : భారీ వర్షాలు, వరదలు హిమాచల్ ప్రదేశ్‌లో బీభత్సం సృష్టిస్తున్నాయి. కొండ చరియలు ఎక్కడికక్కడ కూలుతున్నాయి. నదులు, వాగులు పొంగుతుండటంతో పలు ప్రాంతాల్లో రైల్వే లైన్లు కొట్టుకుపోయాయి. అధికారిక సమాచారం ప్రకారం సోమవారం సాయంత్రానికి వర్షాలు, వరదలు బారిన పడి 51 మంది మరణించారు. ఇరవై మంది ఆచూకీ తెలియలేదు. మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉంది. వర్ష బీభత్సం నేపథ్యంలో స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా మంగళవారం నాడు ఎటువంటి సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించకూడదని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. రాజధాని నగరం సిమ్లాలోని సమ్మర్‌హిల్ వద్ద సోమవారం ఉదయం శివాలయం ఒకటి కూలిపోయింది. ఈ ఆలయ శిధిలాల్లోంచి సాయంత్రానికి తొమ్మిది మంది మృత దేహాలను వెలికి తీశారు. మరికొందరు శిధిలాల కింద ఉండే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఫాగ్లి ప్రాంతంలోని రబల్ వద్ద మరో ఆలయం కూడా కూలిపోయింది. ఈ శిధిలాల కింద మిగతా 6లో

అభివృద్ధే లక్ష్యం

- మహిళా సాధికారతకు పట్టం
- వాతావరణ మార్పులపై అత్యవసర దృష్టి
- స్వాతంత్ర్య దినోత్సవ సందేశంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



న్యూఢిల్లీ : కల్లోలిత సమయాల్లో కూడా భారత్, ప్రతికూల పరిస్థితులను ధృఢంగా ఎదుర్కొని అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగిందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. 77వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం రాత్రి దేశ ప్రజల నుద్దేశించి ఆమె ప్రసంగించారు. 2047 సంవత్సరానికల్లా అభివృద్ధి చెందిన దేశాల సరసన భారత్ కూడా నిలవాలన్న ఆకాంక్షను ఆమె వ్యక్తం చేశారు. ఈ లక్ష్య సాధన దిశలో దేశ ప్రజలందరు ఐక్యంగా ముందుకు సాగాలన్నారు. అనేక రంగాల్లో దేశం ముందుకెళుతోందని అన్నారు. తనకు ఎదురైన సవాళ్ళను అవకాశాలుగా మలుచుకుని అప్రతిహతంగా ముందుకు మిగతా 6లో

ఎపిలో 29 మందికి పోలీస్ మెడల్స్

- దేశవ్యాప్తంగా 954 మందికి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

77వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర హోంమంత్రిత్వశాఖ ప్రకటించిన పతకాలు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 29 మంది పోలీస్ అధికారులను వరించాయి. దేశవ్యాప్తంగా 954 మందికి సైనిక, పోలీసు అధికారులకు వివిధ పతకాలను మంత్రిత్వశాఖ సోమవారం ప్రకటించింది. 229 మందికి పోలీస్ మెడల్ ఫర్ గ్యాలంట్రీ (పిఎంజి), 82 మందికి రాష్ట్రపతి విశిష్ట సేవా పతకాలు (పిపిఎం), 642 మందికి పోలీస్ విశిష్ట సేవా మిగతా 6లో

ఉపాధ్యాయుల సర్దుబాటు 18లోపు పూర్తికావాలి

- పాఠశాల విద్యాశాఖ కమిషనరు సురేష్‌కుమార్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని ఉపాధ్యాయుల సర్దుబాటు ఈ నెల 18లోపు పూర్తిచేయాలని పాఠశాల విద్యాశాఖ కమిషనరు ఎస్ సురేష్‌కుమార్ ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ, జెపిపి, ఎంపిపి, మున్సిపల్ పాఠశాలల్లో మిగులు టీచర్లు, అవసరమైన టీచర్ల జాబితాను జులై 31వ తేదీ విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ ఆధారంగా జిల్లా విద్యాశాఖ అందించాలని తెలిపారు. 84, 85, 117, 128, 47, 60 జిఓల ఆధారంగా ఉపాధ్యాయుల సర్దుబాటు ఉండాలని సూచించారు. ఉపాధ్యాయులు అవసరమైన పాఠశాలల్లో సర్దుబాటు చేసేందుకు మిగతా 6లో

విద్యా బోధనలో అంతర్జాతీయ ప్రమాణాలు

- కీలకంగా ఎఐ వినియోగం
- సమీక్షలో సిఎం ఆదేశం



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విద్యాబోధనలో అంతర్జాతీయ ప్రమాణాలు అందుకోవాలని, దీనికోసం ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్(ఎఐ)ను సమర్ధవంతంగా వినియోగించుకోవాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. విద్యాశాఖపై సోమవారం ఉదయం క్యాంపు కార్యాలయంలో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎఐలో మరిన్ని అంశాలను నేర్చుకునేందుకు వీలుగా ఇంటర్నేషనల్ అకడమిక్ కమ్యూనిటీలో ప్రసిద్ధ సంస్థలను భాగస్వామ్యం చేయాలన్నారు. ఎఐలో క్రియేటర్లుగా మారడం ఎలా అన్నది మరొక ప్రధాన అంశమని పేర్కొన్నారు. అందుబాటులో ఉన్న ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌ను వాడుకుని బోధన, సబ్జెక్టు పరిజ్ఞానాన్ని పెంచుకోవాలన్నారు. ఉన్న సబ్జెక్టులనూ మెరుగ్గా నేర్చుకోవడంలో ఎఐని ఎలా వినియోగించుకోవాలో మిగతా 6లో

ఉద్ధృతంగా బిజెపి వ్యతిరేక పోరాటాలు

- గుజ్జుల యల్లమందారెడ్డి శత జయంతి సభలో వక్తలు

• లోపలి పేజీలో.. •

బోనులో చిక్కిన చిరుత

- కాలినడక మార్గంలో వచ్చే వారికి సెక్యూరిటీ గార్డుల రక్షణ
- ప్రతిఒక్కరికీ చేతి కర్ర
- అవసరమైతే డ్రోన్ల వినియోగం : టిటిడి చైర్మన్ కరుణాకర్‌రెడ్డి

• లోపలి పేజీలో.. •

వలంటీర్లకు పేపర్ బిల్లుపై విచారణ వాయిదా

- కౌంటర్ దాఖలుకు ఎపి ప్రభుత్వానికి ఆదేశం

దేశ నిర్మాణానికి పునరంకితమవుదాం : గవర్నరు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

స్వాతంత్ర్య దినోత్సవం సంస్మరణలతోపాటు అంకిత భావంతో కూడుకున్న రోజని, ఈ పవిత్రమైన రోజున ప్రతిఒక్కరూ దేశ నిర్మాణానికి పునరంకితం అవుదామని ప్రతిజ్ఞ చేద్దామని గవర్నరు ఎస్ అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. ఈ మేరకు స్వాతంత్ర్య దినోత్సవం శుభాకాంక్షలు తెలుపుతూ సోమవారం సందేశాన్ని విడుదల చేశారు. స్వాతంత్ర్యం కోసం మన జాతీయ పోరాటాన్ని ప్రేరేపించిన సత్యం, అహింస, శాంతి, ఐకమత్యం వంటి గొప్ప ఆదర్శాలకు పునరంకితం చేసే రోజని పేర్కొన్నారు.

నలుగురు ఐఎఎస్‌ల బదిలీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో నలుగురు ఐఎఎస్ అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ మేరకు జిఒ ఆర్‌టి నెంబరు 1626ను ఆదివారం విడుదల చేసింది. యూత్ అడ్వాన్స్‌మెంట్, టూరిజం అండ్ కల్చరల్ డిపార్టుమెంట్ కమిషనరు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి వాణీమోహన్‌ను ఆర్కియాలజీ అండ్ మ్యూజియం కమిషనరుగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పజెప్పింది. రవాణా, రోడ్లు, భవనాలశాఖ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పిఎస్ ప్రద్యుమ్నను యూత్ అడ్వాన్స్‌మెంట్, టూరిజం కల్చరల్ డిపార్టుమెంట్ కమిషనరుగా అదనపు బాధ్యతలు అప్పజెప్పింది. స్పోర్ట్స్ అథారిటీ విసి అండ్ ఎమ్‌డి కె హర్షవర్ధన్‌ను ఎపి స్టేట్ ఎన్‌సిసి కమిషన్ కార్యదర్శిగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పజెప్పింది. గ్రామ, వార్డు సచివాలయశాఖ అడిషనల్ డైరెక్టరు హెచ్‌ఎం ధ్యానచంద్రకు స్పోర్ట్స్ అథారిటీ విసి అండ్ ఎమ్‌డిగా అదనపు బాధ్యతలు అప్పజెబుతూ సిఎస్ కెఎస్ జవహర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్‌లో దోపిడీ

- చార్మినార్ ఎక్స్‌ప్రెస్‌పై రాళ్లదాడి

ప్రజాశక్తి-సింగరాయకొండ (ప్రకాశం)

హైదరాబాద్, చార్మినార్ ఎక్స్‌ప్రెస్ రైళ్లలో దొంగలు హల్‌చల్ చేశారు. ఆదివారం అర్ధరాత్రి ఒక రైలులో దోపిడీ, మరో రైలులో దోపిడీయత్నం జరగడంతో ప్రయాణికులు ఆందోళనకు గురయ్యారు. ఈ సంఘటన నెల్లూరు, ప్రకాశం జిల్లాల పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు, ప్రయాణికులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాదు నుంచి చెన్నై వెళ్తున్న హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్ రైలును ఉలవపాడు మండలం వీరేపల్లి తిప్పల వద్ద ఎనిమిది మంది దుండగులు చైన్‌లాగి నిలిపివేశారు. దొంగలు ఎస్2, ఎస్3, ఎస్4, ఎస్5, ఎస్6, ఎస్7 బోగీల్లోకి ప్రవేశించి కత్తులు చూపించి ప్రయాణికుల నుంచి బంగారం, నగదు, సెల్‌ఫోన్లు దోచుకుని పరారయ్యారు. ఇది జరిగిన గంట వ్యవధిలోనే మరో రైలులో దోపిడీకి ప్రయత్నించారు. సికింద్రబాద్ నుంచి చెన్నై వెళ్తున్న చార్మినార్ ఎక్స్‌ప్రెస్ రైలును గుడ్లూరు మండలం వీరేపల్లి వద్ద ఉన్న సిగ్నల్‌కు గుడ్డ కట్టి రైలును నిలుపుదల చేశారు. ఆ రైలులో ఉన్న పోలీసులు అప్రమత్తమై వారిని ఎదుర్కొన్నారు. దీంతో వారిపై రాళ్ల రువ్వి దోపిడీ దొంగలు పరారయ్యారు. రెండు బోగీలపై రాళ్లతో దాడులు చేయడంతో అందులో ఉన్న ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. ఈ ఘటనలపై ప్రయాణికులు తెట్టు, కావలి రైల్వే పోలీస్ స్టేషన్‌లలో ఫిర్యాదులు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వివేకా హత్య కేసు విచారణ వాయిదా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసు విచారణను సెప్టెంబర్ ఒకటో తేదీకి సిబిఐ కోర్టు వాయిదా వేసింది. సిబిఐ కోర్టులో సోమవారం ఈ కేసు విచారణ జరిగింది. ఈ కేసులో నిందితుడుగా ఉన్న ఎంపి వైఎస్ అవినాష్ రెడ్డి ముందుగా కోర్టుకు హాజరయ్యారు. నిందితులు భాస్కర్‌రెడ్డి, దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డి, ఎర్ర గంగిరెడ్డి, ఉదయ్‌కుమార్‌రెడ్డి, ఉమాశంకర్‌రెడ్డి, సునీల్‌కుమార్ యాదవ్‌లను చంచల్‌గూడ జైలు అధికారులు ఆలస్యంగా కోర్టులో హాజరుపర్చారు. వారు వచ్చిన తర్వాత విచారణ చేపట్టిన న్యాయమూర్తి తదుపరి విచారణను సెప్టెంబర్ ఒకటికి వాయిదావేశారు. దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డి గత వారం దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను కోర్టు విచారించి కౌంటర్ దాఖలు చేయాలని సిబిఐని ఆదేశించింది.

ఉధృతంగా బిజెపి వ్యతిరేక పోరాటాలు

- గుజ్జుల యల్లమందారెడ్డి శత జయంతి సభలో వక్తలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

బిజెపి వ్యతిరేక పోరాటాలను మరింత ఉధృతం చేయాలని స్వాతంత్ర్య సమరయోధులు, కమ్యూనిస్టు నేత గుజ్జుల యల్లమందారెడ్డి శత జయంతి సభలో పాల్గొన్న పలువురు వక్తలు పిలుపునిచ్చారు. సిపిఐ ఎపి రాష్ట్ర సమితి, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన విజయవాడలోని దాసరి భవన్‌లో సోమవారం ఈ కార్యక్రమం జరిగింది. ప్రజల కోసం పోరాడి, ప్రజాక్షేత్రంలో పనిచేసే వారికి పదవులు తృణప్రాయమనడానికి సిపిఐ జాతీయ మాజీ కార్యదర్శి గుజ్జుల యల్లమందారెడ్డి జీవితం నిదర్శనమని వక్తలు పేర్కొన్నారు. దేశంలో నెలకొన్న ఫాసిజం పోకడలను అంతం చేయడానికి విస్తృత పోరాటాలు చేయాల్సి ఉందన్నారు. మాజీ డిప్యూటీ స్పీకర్ మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ పీడిత, తాడిత ప్రజల కోసం పనిచేసే వారు చట్టసభల్లో ఉండాల్సిన అవసరం ఉందన్నారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు కోసం ఎమ్‌పి పదవికి యల్లమందారెడ్డి రాజీనామా చేశారని గుర్తు చేశారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ బిజెపి వ్యతిరేక పోరాటాలను మరింత బలోపేతం చేయాల్సి ఉందని, అప్పుడే కార్మిక, కర్షక, పేదలకు న్యాయం జరుగుతుందని తెలిపారు. మణిపూర్‌లో జరిగేది విద్వేషంతో కూడిన హింస అని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో బిజెపికి ఎదురు నిలబడింది కమ్యూనిస్టులే అని అన్నారు. వచ్చే ఎన్నికల్లో కేంద్రంలో బిజెపి అధికారంలోకి వస్తే తొలుత దాడులు జరిగేది కమ్యూనిస్టులపైనేనని హెచ్చరించారు. ఫాసిస్టు విధానాలను అనుసరిస్తున్న మోడీ పాలనకు అనర్హుడని తెలిపారు. గుజ్జుల యలమందారెడ్డి స్ఫూర్తితో కమ్యూనిస్టు ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయాలని అన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ అన్యాయాన్ని ప్రశ్నించడం చేతకాని ప్రజాప్రతినిధులు రాష్ట్రంలో ఉన్నారన్నారు. నిజాన్ని నిర్భయంగా ఎందుకు మాట్లాడలేకపోతున్నారని ప్రశ్నించారు. బికెఎంయు జాతీయ కార్యదర్శి వి.రామూర్తి మాట్లాడుతూ దేశంలో ఫాసిజం నెలకొందన్నారు. యల్లమందారెడ్డి స్ఫూర్తితో ఉద్యమించి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలన్నారు. సభకు అధ్యక్షత వహించిన వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ మాట్లాడుతూ జాతీయ సంపదలో ఎవరి వాటా వారికి దక్కాలని పోరాడిన నేత గుజ్జుల యల్లమందారెడ్డి అన్నారు. ఎఐసిసి నాయకులు కొలనుకండ శివాజి మాట్లాడుతూ మోడీ అధికారంలోకి వచ్చిన తరువాత పార్లమెంట్‌లో చర్చలు జరగడం లేదన్నారు. గుజ్జుల యల్లమందారెడ్డి కుమారుడు, జర్మనీ పార్లమెంట్ మాజీ సభ్యులు గుజ్జుల రవీంద్ర మాట్లాడుతూ జర్మనీలో మేయర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన సందర్భంలో తన తండ్రి ఎంతో సంతోషించారని చెప్పారు. భారతదేశంలో పర్యటిస్తున్న సందర్భంలో తన తల్లిదండ్రులు చేసిన పోరాటాలు తెలుసుకుని ఎంతో ప్రేరణ పొందుతున్నానని భావోద్వేగానికి గురయ్యారు. బిజెపిని ఎదుర్కోవడానికి వామపక్షాల ఐక్యత అవసరమని అన్నారు. ఎన్నికల సంస్కరణలు కూడా చేయాల్సి ఉందన్నారు. తొలుత గుజ్జుల యల్లమందారెడ్డి చిత్రపటానికి సిపిఎం, సిపిఐ రాష్ట్ర కార్యదర్శులు వి.శ్రీనివాసరావు, కె.రామకృష్ణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోటేశ్వరరావు, బుడ్డిగ జమిందార్ పాల్గొన్నారు. సిపిఐ విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు అతిథులకు స్వాగతం పలికారు. ఆవుల శేఖర్ వందన సమర్పణ చేశారు.



జయంతి సభలో మాట్లాడుతున్న వివిఎస్ఆర్

స్ఫూర్తిదాయకం యల్లమందారెడ్డి జీవితం

కమ్యూనిస్టు పార్టీ అగ్రనాయకుల్లో ఒకరైన గుజ్జుల యల్లమందారెడ్డి జీవితం ఆదర్శప్రాయం. 1923 నుండి 1997 మధ్యకాలంలో అనేక భూ పోరాటాలు నిర్వహించారు. వెంకటగిరి జమిందారీ వ్యతిరేక పోరాటం చేపట్టారు. ప్రజాప్రతినిధిగా ప్రకాశం జిల్లాలో చెరగని ముద్ర వేసుకున్నారు. 1962లోనే మార్కాపురం నుండి లోక్‌సభకు ఎన్నికయ్యారు. అప్పటి నెల్లూరు జిల్లా ప్రస్తుత ప్రకాశం జిల్లా కనిగిరి తాలూకా నేరేడుపల్లిలో గుజ్జుల యల్లమందారెడ్డి జన్మించారు. హైస్కూలు దశలోనే విద్యార్థి పోరాటాల వైపు మళ్లారు. విఆర్ కళాశాలలో విద్యాభ్యాసం చేశారు. ఎస్‌వి యూనివర్సిటీ సెనెట్ సభ్యులుగానూ పనిచేశారు. 1952లో రహస్య జీవితం అనుభవించారు. బయటకు రాగానే పోలీసులు అరెస్టు చేశారు. జైలు నుండే పోటీచేసి కనిగిరి ఎమ్మెల్యేగా గెలుపొందారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు సాధనలో ఆందోళన కొనసాగించారు. 1959-1962 మధ్యలో సిపిఐ శాసనసభాపక్షనేతగా వ్యవహరించారు. 1966లో విశాఖ ఉక్కుకోసం లోక్‌సభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. వ్యవసాయ కార్మికుల సమస్యలపైనా అలుపెరుగని పోరాటం నిర్వహించారు. 1948లో అరెస్టు వారెంటు, కనిపిస్తే కాల్చివేత ఉత్తర్వులు వచ్చినా నాలుగేళ్లు రహస్యంగా గడిపారు. అనంతరం సిపిఐ కేంద్ర నాయకత్వంలోకి, బికెఎంయు అధ్యక్ష బాధ్యతల్లోకి వెళ్లారు. ఆయన కుమారుడు గుజ్జుల రవీంద్ర జర్మనీలో సెనేటర్‌గా ఉంటున్నారు. యల్లమందారెడ్డి 1997 ఏప్రిల్ 27న కన్నుమూశారు.

స్టీల్‌ప్లాంట్ రక్షణకు కేంద్రంపై పవన్ ఒత్తిడి తేవాలి : సిపిఎం

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ అమ్మకాన్ని నిలిపివేసేందుకు కేంద్ర ప్రభుత్వంపై జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ చిత్తశుద్ధితో ఒత్తిడి తేవాలని సిపిఎం విశాఖపట్నం, అనకాపల్లి జిల్లా కమిటీలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శులు ఎం.జగ్గునాయుడు, కె.లోకనాథం సోమవారం ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు. వారాహి విజయయాత్రలో భాగంగా గాజువాకలో జరిగిన బహిరంగ సభలో స్టీల్‌ప్లాంట్‌పై పవన్ చేసిన ప్రసంగం ఉత్తరాంధ్ర ప్రజలను తీవ్ర నిరుత్సాహపరిచిందని పేర్కొన్నారు. గాజువాకలో నిర్వహించిన రోడ్ షోలో, బహిరంగ సభలో విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు, స్టీల్‌ప్లాంట్ అమ్మకం ఆపించాలనే నినాదాలతో మార్మోగాయని, అయినప్పటికీ పవన్ ప్రసంగం ప్రజలు ఆశించిన స్థాయిలో లేదని తెలిపారు. మోడీ అంటే తనకిష్టమని, అయినప్పటికీ స్టీల్‌ప్లాంట్‌పై ఆయనతో విభేదించానని పవన్ పేర్కొన్నారని, దీనివల్ల సాధించిన ఫలితమేంటో మాత్రం చెప్పలేదని పేర్కొన్నారు. 'జనసేనను అధికారంలోకి తీసుకువస్తే ప్రధాని కాళ్లు పట్టుకొని స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుతా' అని పవన్ అన్న విషయాన్ని గుర్తుచేస్తూ.. ప్రజలు అధికారం ఇవ్వకపోతే స్టీల్‌ప్లాంట్‌ను కాపాడరా? అని ప్రశ్నించారు. విశాఖ ఉక్కు కోసం భూములు ఇచ్చిన నిర్వాసితులకు ఇంతవరకు న్యాయం జరగలేదని, వారిలో కొందరు దేవాలయాల్లో ప్రసాదాలు తిని జీవిస్తున్నారని పవన్ ప్రసంగించారని, నిర్వాసితుల్లో 8500 మందికి ఇంత వరకూ ఉద్యోగాలు ఇవ్వని బిజెపి ప్రభుత్వాన్ని పల్లెత్తుమాట అనలేదని తెలిపారు. విశాఖ ఉక్కు కార్మిక సంఘాలన్నీ ఏకతాటిపైకి వస్తే కేంద్రస్థాయిలో సమస్యను పరిష్కరించేందుకు తనవంతు ప్రయత్నం చేస్తానని పవన్ చెప్పారని, వాస్తవానికి ఉక్కు కార్మిక సంఘాలన్నీ ఏకతాటిపైకి వచ్చి 914 రోజులుగా పోరాడుతున్నాయని, ఇంతకన్నా ఐక్యత ఏం కావాలని ప్రశ్నించారు. స్టీల్‌ప్లాంట్ అమ్మకం ఆపాలని వైసిపి ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి చేతులు దులుపుకుందని, అధిక సంఖ్యలో ఎంపిలున్నా పార్లమెంట్‌లోగానీ, ప్రజాక్షేత్రంలోగానీ స్టీల్‌ప్లాంట్ రక్షణకు కేంద్రంతో నిజాయితీగా పోరాడటంలేదని పేర్కొన్నారు. విశాఖపట్నం, ఉత్తరాంధ్ర ప్రజల ప్రయోజనాల కోసమని జనసేన అధినేత రోడ్ షోలు, బహిరంగ సభలు నిర్వహిస్తున్నారని, స్టీల్‌ప్లాంటు అమ్మకం ఆపకుండా, ప్రభుత్వ రంగాన్ని రక్షించకుండా విశాఖ, ఉత్తరాంధ్ర అభివృద్ధి, యువత ఉపాధి రక్షణ ఎలా సాధ్యమని ప్రశ్నించారు. ఇప్పటికైనా స్టీల్‌ప్లాంట్ అమ్మకం ఆపి, సొంత గనులు కేటాయించి, 8500 మంది నిర్వాసితులకు పర్మినెంట్ ఉద్యోగాలు కల్పించి, ప్లాంట్‌ను పూర్తిసామర్థ్యంతో నడిపించేలా పవన్ చిత్తశుద్ధితో కేంద్రంపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు.

ఎగ్జిబిషన్ గ్యాలరీ ప్రారంభం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా విజయవాడ డివిజన్ పరిధిలోని 13 రైల్వే స్టేషన్స్‌లో ఎగ్జిబిషన్ గ్యాలరీలను సోమవారం ఏర్పాటుచేశారు. విజయవాడ రైల్వే స్టేషన్ తూర్పు ప్రధాన ద్వారంలోని ఓల్డ్ బుకింగ్ ఆఫీస్ కాన్‌కోర్స్‌లో ప్రత్యేక ఎగ్జిబిషన్ గ్యాలరీని డిఆర్‌ఎం నరేంద్ర ఎ పాటిల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వాతంత్ర్య పోరాటంలో రైల్వే కీలకపాత్ర పోషించిందని, విభజన సమయంలో లక్షలాది మందికి సాధారణ రవాణా వ్యవస్థగా, ఆశాకిరణంగా రైల్వే నిలిచిందని అన్నారు. రైల్వేల విస్తృత పరిధిని దృష్టిలో ఉంచుకుని విజయవాడ, మచిలీపట్నం, ఏలూరు, రాజమండ్రి, కావలి, భీమవరం టౌన్, తెనాలి, బాపట్ల, ఒంగోలు, గూడూరు, తుని, అనకాపల్లి, కాకినాడల్లో ఎగ్జిబిషన్ గ్యాలరీలను ఏర్పాటుచేశామన్నారు. విజయవాడ, నెల్లూరు, రాజమండ్రిలోనూ డిజిటల్ మ్యూజియంలను ఏర్పాటుచేస్తున్నట్లు డిఆర్‌ఎం తెలిపారు. ఈ కార్యక్రమంలో జాతీయ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్య మనుమరాలు పింగళి సుశీల, అల్లూరి సీతారామరాజు మనుమడు రామరాజు, ఎడిఆర్‌ఎం ఆపరేషన్స్ ఎం శ్రీకాంత్, డి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తం

- రూ.10 లక్షల కోట్ల అప్పులతో పాలన
- ఆడిటర్ల సమావేశంలో లోకేష్ విమర్శ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గత 70 ఏళ్ల కాలంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ విమర్శించారు. యువగళం పేరుతో ఆయన చేపట్టిన పాదయాత్ర గుంటూరు జిల్లా తాడికొండ మండలంలో కొనసాగింది. సోమవారం రావెల నుంచి ప్రారంభమైన పాదయాత్ర పొన్నెకల్లు, తాడికొండ అడ్డరోడ్డు, తాడికొండ, కంతేరు మీదుగా మంగళగిరి మండలం నిడమర్రుకు చేరుకుంది. తాడికొండ విడిది కేంద్రం వద్ద ఆడిటర్లతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం రూ.10 లక్షల కోట్ల అప్పులతో పరిపాలన చేస్తోందన్నారు. పారదర్శకతలేని పాలన జరుగుతోందని, కార్పొరేషన్ల పేరుతో విపరీతంగా అప్పులు చేస్తున్నారని, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని విమర్శించారు. పలువురు ఆడిటర్లు మాట్లాడుతూ ఫెనాల్టీలు విధిస్తూ కేసులు నమోదు చేస్తూ తమను ఇబ్బంది పెడుతున్నారని అన్నారు. తమకు సంబంధం లేని అంశాల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు చేసి జిఎస్‌టి ఫైలింగ్‌లో ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. పన్నుల వసూళ్లలో పారదర్శకత తీసుకురావాలని, పాత బకాయిలు ఉన్న వారికి వన్ టైమ్ సెటిల్మెంట్ వ్యవస్థ తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. లోకేష్ స్పందిస్తూ రాష్ట్రంలో ఆగిపోయిన అభివృద్ధిని పున:ప్రారంభించాల్సి ఉందన్నారు. 2024లో టిడిపి అధికారంలోకి రావడం ఖాయమని, పెద్ద ఎత్తున పరిశ్రమలు తీసుకొచ్చి ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. జగన్ పాలనలో ఆడిటర్లు, సిఎలు కూడా బాధితులే అన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే మైక్రోలెవల్ డెవలప్‌మెంట్ మోడల్‌ను తీసుకొచ్చి చిన్న నగరాలను కూడా అభివద్ధి చేస్తామని హామీ ఇచ్చారు.



తాడికొండలో పాదయాత్రలో లోకేష్

ఆర్‌టిసి రిటైర్డు ఉద్యోగులకూ సంక్షేమ పథకాలు

రాష్ట్రంలోని ఆర్‌టిసి రిటైర్డు ఉద్యోగులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేస్తామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ హామీ ఇచ్చారు. ఎపిఎస్‌ఆర్‌టిసి రిటైర్డు ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు గద్దె రవీంద్రరావు, కానాల గంగాధరరావు యువగళం పాదయాత్రలో వున్న లోకేష్‌ను గుంటూరు జిల్లాలోని తాడికొండలో సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఆర్‌టిసి రిటైర్డు ఉద్యోగులకు పెన్షన్ రూ.వెయ్యి మాత్రమే వస్తోందని వివరించారు. తమకు రాష్ట్ర ప్రభుత్వం రేషన్ కార్డులు, వృద్ధాప్య పెన్షన్, ఆరోగ్యశ్రీ కార్డులు వంటివి ఇవ్వడం లేదన్నారు.

బోనులో చిక్కిన చిరుత

- కాలినడక మార్గంలో వచ్చే వారికి సెక్యూరిటీ గార్డుల రక్షణ
- ప్రతిఒక్కరికీ చేతి కర్ర , అవసరమైతే డ్రోన్ల వినియోగం : టిటిడి చైర్మన్ భూమన

ప్రజాశక్తి- తిరుమల

తిరుమల కాలినడక మార్గానికి సమీపంలో ఆదివారం అర్ధరాత్రి ఓ చిరుత బోనులో చిక్కింది. గత నెల 11న లక్షిత అనే చిన్నారిని ఈ చిరుతే చంపేసి ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. తిరుమల కాలినడక మార్గంలో సందర్శకుల కదలికలు తెలుసుకోవడానికి ఎక్కడికక్కడ సిసి కెమెరాలు ఉన్నాయి. కాలినడక మార్గాన వెళ్తున్న లక్షితను పులి చంపేసిన తర్వాత గతంలో పులులు సంచరించిన ఐదు చోట మూడేసి చొప్పున మొత్తం ఐదు ప్రాంతాల్లో 15 సిసి కెమెరాలను అధికారులు ఏర్పాటు చేశారు. వీటి ఆధారంగా ఐదు పులులు తిరుగుతున్నాయని గుర్తించారు. చిరుతల కోసం నాలుగు ప్రాంతాల్లో బోనులు ఏర్పాటు చేశారు. ఆ క్రమంలోనే ఒక బోనులో చిరుత చిక్కింది. మిగతా నాలుగు చిరుతల కోసం గాలిస్తున్నారు. చిరుత బోనులో చిక్కిన నేపథ్యంలో మీడియాతో టిటిడి ఇఒ ధర్మారెడ్డి మాట్లాడారు. కాలినడకన తిరుమల వచ్చే సందర్శకులు భయపడకుండా ముందుసాగాలని, పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు.

నడక మార్గంలో ఎలుగుబంటి సంచారం

తిరుమల నడక మార్గంలో వెళ్తున్న వారికి 2,000వ మెట్టు వద్ద సోమవారం ఎలుగుబంటి కనిపించింది. దీంతో, భయంతో వారు పరుగులు తీశారు. విషయాన్ని అధికారులకు తెలియజేశారు. దీంతో, అప్రమత్తమైన అధికారులు ఎలుగుబంటి కోసం గాలిస్తున్నారు.

దివ్యదర్శనం టోకెన్ల భక్తులు రోడ్డు మార్గంలోనూ వెళ్లొచ్చు : టిటిడి చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి

తిరుమల శ్రీవారి దర్శనార్థం కాలినడకన వచ్చే వారి రక్షణ ధ్యేయంగా పలు నిర్ణయాలు తీసుకున్నామని టిటిడి చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి తెలిపారు. నడకదారుల్లో 500 కెమెరాలు ఏర్పాటు చేశామని, అవసరమైతే డ్రోన్లను కూడా వినియోగిస్తామని చెప్పారు. నడక మార్గాలు, ఘాట్‌లలో యాత్రికుల భద్రతకు తీసుకోవాల్సిన చర్యలపై తిరుపతిలోని శ్రీపద్మావతి విశ్రాంతి గృహంలో టిటిడి ఇఒ, ఎస్‌పి, అటవీ శాఖ, జిల్లా జాయింట్ కలెక్టర్, ఇతర అధికారులతో సోమవారం ఆయన ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. అనంతరం మీడియాతో చైర్మన్ మాట్లాడారు. నడకదారిలో వచ్చే భక్తులకు సహాయకారిగా ఉండేలా ప్రతిఒక్కరికీ చేతి కర్ర ఇవ్వాలని నిర్ణయించామని చెప్పారు. ఘాట్ రోడ్లలో ఉదయం ఆరు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు మాత్రమే ద్విచక్ర వాహనాలను అనుమతిస్తామని తెలిపారు. సందర్శకుల రక్షణకు అటవీ శాఖ ఆధ్వర్యంలో నిపుణులైన సిబ్బందిని నియమించుకోవడానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. సందర్శులకు గుంపులుగా పంపుతామని, వీరికి సెక్యూరిటీ గార్డులు భద్రతగా ఉంటారని తెలిపారు. సాధు జంతువులకు ఆహార పదార్థాలు అందించేవారిపైనా, వాటికోసం ఆహార పదార్థాలు విక్రయించే వారిపైనా చర్యలు తీసుకుంటామని చెప్పారు. నడకదారుల్లో ఉన్న హోటళ్లవ్యర్థాలు అక్కడే వదిలివేయకుండా తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. వైల్డ్ లైఫ్ అవుట్ పోస్టులు 24/7 ఏర్పాటు చేసి యానిమల్ ట్రాకర్లు, డాక్టర్లు అందుబాటులో ఉంచుతామన్నారు. రోడ్డుకిరువైపులా 30 అడుగుల దూరం కనిపించేలా ఫోకస్ లైట్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఫెన్సింగ్ ఏర్పాటుకు అటవీ శాఖ కేంద్ర, రాష్ట్ర ఉన్నతాధికారులు అధ్యయనం చేసి నివేదిక సమర్పిస్తారని, అనంతరం తగు చర్యలు తీసుకుంటామని చెప్పారు. క్రూరమృగాలపై సందర్శలకు అవగాహన కల్పించేందుకు అలిపిరి, గాలిగోపురం, ఏడో మైలు వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తామన్నారు. తిరుపతిలోని భూదేవి కాంప్లెక్స్, శ్రీవారి మెట్టు వద్ద రోజుకు 15 వేల దివ్యదర్శనం టోకెన్లు జారీ చేస్తున్నామని, మధ్యలో వీటిని స్కానింగ్ చేయించుకోవాల్సిన అవసరం లేదని తెలిపారు. దివ్యదర్శనం టోకెన్లు పొందిన వారు రోడ్డు మార్గంలో కూడా తిరుమలకు వెళ్లవచ్చని చెప్పారు. ఈ సమావేశంలో టిటిడి ఇఒ ఎవి.ధర్మారెడ్డి, అటవీ శాఖ అదనపు ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ శాంతిప్రియ పాండే, జెఇఒలు సదాభార్గవి, వీరబ్రహ్మం, ఎస్‌పి పరమేశ్వర్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ డికె బాలాజీ, తిరుపతి సిసిఎఫ్ పి.నాగేశ్వరరావు, ఎస్‌వి జూపార్క్ క్యూరేటర్ సి.సెల్వం, తిరుపతి డిఎఫ్ఒ జి.సతీష్, డిఎఫ్ఒ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న పవన్

వైసిపికి ఉత్తరాంధ్రపై కాదు.. భూములపైనే ప్రేమ

- విస్సన్నపేట భూములపై ఎన్‌జిటికి ఫిర్యాదు చేస్తా : పవన్

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి, కశింకోట విలేకరి

వైసిపికి ఉత్తరాంధ్రపై ప్రేమలేదని, ఇక్కడ భూములపైనే ప్రేమ అని జనసేన అధినేత పవన్ కల్యాణ్ విమర్శించారు. ఉత్తరాంధ్రలో ఉపాధి, అభివృద్ధి లేక ప్రజలు వలసలు వెళ్లిపోతున్నారని తెలిపారు. వారాహి విజయ యాత్రలో భాగంగా అనకాపల్లి నియోజకవర్గంలోని కశింకోట మండలం విస్సన్నపేట భూములను సోమవారం ఆయన పరిశీలించారు. 600 ఎకరాలకుపైగా దళితుల భూములు, పోరంబోకు భూములు, రంగబోలు ప్రాజెక్టు క్యాచ్‌మెంట్ ఏరియా భూముల్లో అడ్డగోలుగా, ఓల్టా యాక్ట్‌కు విరుద్ధంగా లేఅవుట్ వేశారని, దీన్ని పట్టించుకోవాల్సిన బాధ్యత అధికారులకు లేదా? అని ప్రశ్నించారు. విస్సన్నపేట భూములపై కేంద్ర పర్యావరణ శాఖ, నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌కు ఫిర్యాదు చేస్తానని తెలిపారు. రూ.11 వేల కోట్ల విలువైన రియల్ ఎస్టేట్ వెంచర్లు ఇక్కడ వేశారన్నారు. వైసిపి నాయకులు గెడ్డలు, వాగులను అడ్డగోలుగా ఆక్రమించుకొని రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుంటే ముఖ్యమంత్రి పట్టించుకోవడంలేదని విమర్శించారు. ఇప్పటికైనా బాధ్యతగా వ్యవహరించి ప్రభుత్వ ఆస్తులు కాపాడాలని డిమాండ్ చేశారు. ఇక్కడి బయ్యవరానికి విశాలమైన రోడ్డులేదని, రియల్ ఎస్టేట్ భూములకు మాత్రం వంద అడుగుల రోడ్డు వేశారని తెలిపారు. ఉత్తరాంధ్రలో భూములను దోపిడీ చేస్తుంటే స్థానిక ఎమ్మెల్యేలు వంతపలుకుతున్నారని విమర్శించారు.

అనకాపల్లి నుంచి రోడ్ షో

విశాఖ నుంచి వాహనంలో వచ్చిన పవన్ కల్యాణ్‌కు యువకులు ఘన స్వాగతం పలికారు. అనకాపల్లి నుంచి బయ్యవరం వరకు పవన్ రోడ్ షో నిర్వహించారు. ఆయన వాహనాన్ని యువత అనుసరించి ద్విచక్ర వాహనాలతో రావడంతో జాతీయ రహదారికి రెండువైపులా ట్రాఫిక్ సమస్య ఏర్పడింది.

మతోన్మాదుల నుండి దేశాన్ని కాపాడుకుందాం

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కె.ప్రసన్నకుమార్
- నందిగామలో 77 మీటర్ల జాతీయ జెండాతో అజాది ర్యాలీ

ప్రజాశక్తి- నందిగామ (ఎన్‌టిఆర్ జిల్లా)

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎన్‌టిఆర్ జిల్లా నందిగామలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చైతన్య కళాశాల నుండి గాంధీబొమ్మ విగ్రహం వరకు 77 మీటర్ల జాతీయ జెండాతో సోమవారం విద్యార్థులు అజాది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కె.ప్రసన్నకుమార్ మాట్లాడుతూ దేశ స్వాతంత్రం కోసం 200 సంవత్సరాలు పోరాడి తెల్లదొరల నుండి దేశానికి విముక్తి కలిగించిన అమరుల స్ఫూర్తిని కొనసాగించాలని కోరారు. ఆనాటి వీరులు కలలుగన్న స్వాతంత్ర్యాన్ని నేడు పాలకులు వంచిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నేటికీ దేశంలో సామాజిక, ఆర్థిక అసమానతలు తీవ్రంగా ఉన్నాయన్నారు. అందరికి విద్య, ఉపాధి నేటికీ ప్రశ్నార్థకంగా మారిందని, దేశంలో ఎన్నడూలేనంతగా నేడు నిరుద్యోగం పెరిగిందని తెలిపారు. బిజెపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ మతాలు, ప్రాంతాల మధ్య చిచ్చుపెట్టి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తోందని విమర్శించారు. మహిళలకు భద్రత కరువైందన్నారు. గాంధీని చంపిన గాడ్సేకి బిజెపి నాయకులు విగ్రహాలు పెట్టడం, గొప్పవాడిగా కీర్తించడం ఏమిటని ప్రశ్నించారు. మణిపూర్ ఘటన దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేసిందని, తెగల మధ్య శాంతిని నెలకొల్పాల్సింది పోయి గొడవను మరింత పెంచేందుకు బిజెపి యత్నిస్తోందని విమర్శించారు. వంద రోజులవుతున్నా నేటికీ సమస్యను పరిష్కరించకపోవడం డబుల్ ఇంజన్ ప్రభుత్వ వైఫల్యమన్నారు. మణిపూర్ రాష్ట్ర ముఖ్యమంత్రిని వెంటనే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రశ్నించే హక్కును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని విమర్శించారు. స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తితో దేశాభివృద్ధి, పురోగతి కోసం పాటుపడాలని, దేశాన్ని విచ్ఛిన్నం చేసే బిజెపి విధానాలను తిప్పికొట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యురాలు ఎస్.కె జాహిద, ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్షులు ఎం.సోమేశ్వరరావు, సిఐటియు, డివైఎఫ్ఐ, ప్రజాసంఘాల నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సోలార్ రేడియేషన్ ప్రసరణ

- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి


ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వాతావరణంలో మార్పుల వల్ల భూమిపైకి సోలార్ రేడియేషన్ ప్రసరణ ఉంటోందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రకృతి విపత్తులశాఖ ప్రకటించింది. ఈ మేరకు సోమవారం ప్రకటన విడుదల చేసింది. రాష్ట్రంలో ఎండ తీవ్రతతోపాటు పగటిపూట ఉష్ణోగ్రతలు, ఉక్కపోత కూడా తోడవుతోందని తెలిపింది. మే నెల నుండి ఆగస్టు వరకూ గతంలో సోలార్ రేడియేషన్ కిరణాల ప్రసరణ నేరుగా భూమిపైకి ఉంటుందని పేర్కొంది. వర్షాకాలంలో మేఘాల వల్ల ఎండ తీవ్రత తక్కువగా ఉంటుందని తెలిపింది. ప్రస్తుతం మేఘాలు లేకపోవడంతో సోలార్ కిరణాలు నేరుగా భూమిని తాకుతున్నాయని వివరించింది. దీనివల్ల ఉష్ణోగ్రతలు పెరిగి అసౌకర్యంతో కూడిన వాతావరణం ఉంటోందని, దీనివల్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది.

విద్యార్థినులపై లైబ్రేరియన్ అసభ్య ప్రవర్తన

- దేహశుద్ధి చేసిన తల్లిదండ్రులు
- 'అనంత' కేంద్రీయ విద్యాలయంలో ఉద్రిక్తత

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి



లైబ్రేరియన్ భానుప్రకాశ్

అనంతపురం కేంద్రీయ విద్యాలయంలో విద్యార్థినుల పట్ల లైబ్రేరియన్ అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడంటూ విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. ఆయన వ్యవహారశైలిని తప్పుబడుతూ ప్రిన్సిపల్ ఛాంబరులోనే దేహశుద్ధి చేశారు. సోమవారం ఉదయం పాఠశాల ప్రారంభమైన తరువాత విద్యార్థినుల తల్లిదండ్రులు పాఠశాలకు చేరుకున్నారు. లైబ్రేరియన్ భానుప్రకాశ్ నాయక్ లైబ్రరరీ గదిలోనే విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడంటూ ఆందోళనకు దిగారు. విద్యార్థినులు ఏ రంగు లోదుస్తులు ధరించారు, వాటి బ్రాండ్లు అడగడమే కాకుండా మసాజ్ చేయాలని ఒత్తిడి చేయడం వంటివి చేస్తున్నాడని ఆగ్రహించారు. ఈ విషయాన్ని మూడు రోజుల క్రితం ప్రిన్సిపల్ కరీం ఖాన్ దృష్టికి తీసుకెళ్లినట్టు వారు తెలిపారు. ఆందోళనకు దిగడంతో భానుప్రకాశ్ నాయక్‌ను ప్రిన్సిపల్ తన ఛాంబర్‌కు పిలిపించి వివరణ అడిగారు. భానుప్రకాశ్ బుకాయించే ప్రయత్నం చేశాడు. దీంతో, తల్లిదండ్రులు కోపోద్రుక్తులై అతడిపై దాడి చేశారు. వివాదం జరుగుతున్న విషయం తెలియడంతో ఇటుకలపల్లి పోలీసులు అక్కడికి చేరుకుని సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. చర్యలు తీసుకుంటామని చెప్పినా తల్లిదండ్రులు శాంతించలేదు. అతడిపై తక్షణం చర్యలు తీసుకోవాలని పట్టుబట్టారు. దీంతో డిప్యూటీ కమిషనర్ మంజునాథ్ దృష్టికి ప్రినిపల్ తీసుకెళ్లారు. ఆయన తల్లిదండ్రులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఈ నెల 16న దీనిపై విచారణ బృందాన్ని పంపించి భానుప్రకాశ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

గతంలోనూ భాను ప్రకాశ్‌పై ఆరోపణలు

భానుప్రకాశ్‌పై గతంలోనూ ఆరోపణలున్నాయి. గుత్తి కేంద్రీయ విద్యాలయంలో పనిచేస్తున్న సమయంలోనూ ఇదే రకమైన ఆరోపణలొచ్చాయి. దీనిపై విద్యార్థి సంఘాలు ఆందోళనలు చేపట్టడంతో ఆయన్ను అక్కడి నుంచి అనంతపురం కేంద్రీయ విద్యాలయానికి బదిలీ చేశారు.

తల్లిదండ్రులు ఫిర్యాదు
ఇదే మొదటి సారి : కరీం ఖాన్, ప్రిన్సిపాల్

విద్యార్థినుల పట్ల లైబ్రేరియన్ అసభ్యంగా ప్రవరిస్తున్న విషయాన్ని గతంలో తల్లిదండ్రులు ఎవరూ ఫిర్యాదు చేయలేదు. ఇదే మొదటిసారి. దీనిపై ఉన్నతాధికారులకు నివేదించాం. విచారణకు నియమించిన కమిటీ నివేదిక అనంతరం భానుప్రకాశ్‌పై చట్టపరమైన చర్యలుంటాయి.

విద్యార్థి సంఘాల ఆందోళన

విద్యార్థినుల పట్ల లైబ్రేరియన్ భానుప్రకాశ్ అసభ్య ప్రవర్ధనను నిరసిస్తూ విద్యార్థి సంఘాలు ఆందోళనకు దిగాయి. ఎఐఎస్‌ఎఫ్, ఎస్ఎఫ్ఐ, టిఎన్ఎస్ఎస్, వైఎస్ఆర్ విద్యార్థి సంఘం, తదితర విద్యార్థి సంఘాలు పాఠశాల వద్ద నిరసన చేపట్టాయి. భానుప్రకాశ్‌ను వెంటనే సస్పెండ్ చేసి కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశాయి.



ధర్నాలో మాట్లాడుతున్న రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి. కృష్ణయ్య.

విద్యుత్ కోతలపై రైతుల ఆగ్రహం

- విద్యుత్తు సబ్ స్టేషన్ ముందు ధర్నా

ప్రజాశక్తి-పంగులూరు (ప్రకాశం జిల్లా)

కరెంటు కోతలపై రైతులు, మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ రైతుసంఘం, కౌలు రైతు సంఘం, మహిళా సంఘం ఆధ్వర్యంలో సోమవారం పంగులూరులోని విద్యుత్ సబ్ స్టేషన్ ముందు ధర్నా చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి కృష్ణయ్య మాట్లాడుతూ గత వారం రోజులుగా ఈ ప్రాంతంలో విద్యుత్ సరఫరాలో చాలా సమస్యలు వచ్చాయని, ఈ సమస్యలను విద్యుత్ వ్యవస్థను ప్రయివేటీకరించాలని కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగానే దీన్ని చూడాలని చెప్పారు. చాలా గ్రామాలకు లైన్‌మెన్లు, సబ్ స్టాప్ లేరని తెలిపారు. 26 లక్షల మంది ఉద్యోగులు, 70 లక్షల కోట్ల రూపాయలు విలువైన విద్యుత్ వ్యవస్థను కేంద్ర ప్రభుత్వం ప్రయివేటీకరించాలని నిర్ణయించడం దారుణమన్నారు. దానికి రాష్ట్రంలోని వైసిపి, టిడిపి మద్దతు ఇస్తున్నాయని తెలిపారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు, కౌలురైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాయిని వినోద్‌బాబు, మహిళా సంఘం జిల్లా నాయకురాలు రాయిని కృష్ణకుమారి మాట్లాడారు. అనంతరం విద్యుత్తు ఇడి సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. దీనిపై ఇడి స్పందించి నెల రోజుల్లో ఈ సమస్యను పరిష్కారిస్తామని హామీ ఇచ్చారు.

ఎయిడ్స్ నివారణకు కృషి

- ప్రాజెక్టు డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎస్‌బిఆర్ కుమార్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఎయిడ్స్ నివారణకు కృషి చేస్తానని ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ ప్రాజెక్టు డైరెక్టరు ఎస్‌బిఆర్ కుమార్ లఖింశెట్టి తెలిపారు. తాడేపల్లిలోని ఎపిశాక్స్ రాష్ట్ర కార్యాలయంలో ఆయన ప్రాజెక్టు డైరెక్టరుగా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయుష్ కమిషనరుగా వ్యవహరిస్తున్న ఆయనకు రాష్ట్ర ప్రభుత్వం ఎపి శాక్స్ అదనపు బాధ్యతలను అప్పగించింది. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎపి శాక్స్ పనితీరును మెరుగుపరిచేందుకు తగిన కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం విజయవాడ జిజిహెచ్‌లోని ఇంటిగ్రేటెడ్ కౌన్సెలింగ్ టెస్ట్, యాంటీ రిట్రోవైరల్ థెరపీ కేంద్రాలను పరిశీలించారు. అక్కడ అందుతున్న సేవలపై ఆరా తీశారు. ప్రతి ఒక్కరూ అంకిత భావంతో పనిచేయాలని ఉద్యోగులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎపిడి కోటేశ్వరి, జెడిలు కామేశ్వర ప్రసాద్, సుబ్రమణ్యం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న సుప్రీం కోర్టు జడ్జి

ప్రజాశక్తి- తిరుమల

తిరుమల శ్రీవారిని సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భయాన్ సోమవారం దర్శించుకున్నారు. ఉదయం విఐపి బ్రేక్ సమయంలో ఆలయం మహాద్వారం వద్దకు కుటుంబ సభ్యులతో చేరుకున్న ఆయనకు టిటిడి చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి, ఇఒ ఎవి ధర్మారెడ్డి సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. శ్రీవారి దర్శన అనంతరం రంగనాయక మండపంలో వేదపండితులు ఆశీర్వచనం అందించారు. చైర్మన్ కరుణాకరరెడ్డి శాలువతో సత్కరించి స్వామివారి తీర్థప్రసాదాలు, పంచగవ్య ఉత్పత్తులు, స్వామివారి చిత్రపటాన్ని అందించారు.

ఎపి ఎన్‌జిఒ రాష్ట్ర మహాసభకు సిఎంకు ఆహ్వానం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ అధ్యక్షులు బండి శ్రీనివాసరావు, జనరల్ సెక్రటరీ కెవి శివారెడ్డి, ప్రభుత్వ సలహాదారు (సంక్షేమం) ఎన్ చంద్రశేఖర్‌రెడ్డి సోమవారం క్యాంపు కార్యాలయంలో భేటీ అయ్యారు. ఈ నెల 21, 22 తేదీల్లో విజయవాడలోని ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో జరగనున్న ఎన్‌జిఒ 21వ రాష్ట్ర మహాసభకు హాజరుకావాలని కోరారు. అనంతరం సిఎంకు మహాసభ ఆహ్వాన పత్రికను అందజేశారు.

అసైన్డ్ చట్ట సవరణ దుర్మార్గం

కలెక్టరేట్ వద్ద ధర్నాలో వ్యకాస రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి వెంకటేశ్వర్లు




.ఏలూరు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నేతలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

పేదలకు భూ పంపిణీ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం అసైన్డ్ భూములను అక్రమంగా అనుభవిస్తున్న భూస్వాములకు యాజమాన్యపు హక్కులు కల్పిస్తూ చట్టాన్ని సవరణ చేయడం దుర్మార్గమని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి వెంకటేశ్వర్లు అన్నారు. భూములను అర్హులైన పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. ఏలూరు కలెక్టరేట్ ముందు వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం పేదలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కార్మికులు, పేదలు, దళితులు పోరాట ఫలితంగా 9/77 అసైన్డ్ చట్టం వచ్చిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ చట్ట సవరణల వల్ల అసైన్డ్‌దారుల కంటే అక్రమంగా, దౌర్జన్యంగా అనుభవిస్తున్న భూస్వాములే ఎక్కువ ప్రయోజనం పొందుతారని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలోనూ అసైన్డ్ చట్ట సవరణ వల్ల పేదలకంటే అనర్హులే ఎక్కువ లబ్ధి పొందారని ఆవేదన వ్యక్తం చేశారు. అసైన్డ్ భూములను అక్రమంగా అనుభవిస్తోన్న వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 17,21,160 కుటుంబాలకు చెందిన 27,41,609 ఎకరాల అసైన్డ్ భూముల వివరాలు ప్రతీ గ్రామ సచివాలయంలో బహిరంగపరచాలని కోరారు. అనర్హుల చేతుల్లో ఉన్న భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని తిరిగి హక్కుదారులకు లేదా వారి వారసులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వం భూకొనుగోలు పథకం కింద భూమి కొనుగోలు చేసి గ్రామంలో పేదలకు పంచాలని కోరారు. కోనేరు రంగారావు భూ కమిటీ సిఫార్సుల మేరకు సీలింగ్ భూములతోపాటు పేదలకు పంచడానికి అవకాశమున్న అన్ని రకాల భూములను పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. భూ సమస్యలలో పోలీసుల జోక్యం ఉండకూడదన్నారు. సంఘం జిల్లా కార్యదర్శి పి రామకృష్ణ మాట్లాడారు. అనంతరం డిఆర్‌ఒకు వినతిపత్రం అందజేశారు.

శ్రీహరికోటకు 'ఆదిత్య-ఎల్1' చేరిక



చందమామ చుట్టూ లూనార్ కక్షలో తిరుగుతున్న చంద్రయాన్-3 ఉపగ్రహం

ప్రజాశక్తి- సూళ్లూరుపేట (తిరుపతి జిల్లా)

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ వచ్చే నెల మొదటి వారంలో ప్రయోగించనున్న ఆదిత్య-ఎల్1 ఉపగ్రహం తిరుపతి జిల్లా సూళ్లూరుపేటలోని షార్ సెంటర్‌కు సోమవారం చేరుకుంది. బెంగళూరులోని యుఆర్‌రావు శాటిలైట్ సెంటర్లో సిద్ధం చేసిన ఈ ఉపగ్రహాన్ని కట్టుదిట్టమైన బందోబస్తు నడుమ ప్రత్యేక కంటైనర్లో ఇక్కడికి తీసుకొచ్చారు. ఈ ఉపగ్రహాన్ని పిఎస్‌ఎల్‌విసి-57 రాకెట్ ద్వారా ప్రయోగించనున్నారు.

చంద్రయాన్-3వ రౌండ్ పూర్తి

శ్రీహరికోట రాకెట్ ప్రయోగ కేంద్రం నుండి గత నెల 14న ఇస్రో ప్రయోగించిన చంద్రయాన్-3 ఉపగ్రహం చంద్రుని చుట్టూ లూనార్ కక్ష్యలో మూడు రౌండ్లు తిరగడం పూర్తి చేసింది. చంద్రునికి 150 కిలోమీటర్లు సమీప కక్ష్య,177 కిలోమీటర్ల దూరపు కక్ష్యకు చేరుకుంది. చంద్రుని కక్ష్యలో నాలుగవ రౌండ్‌ను ఈ నెల 16వ తేదీ ఉదయం 8.30 గంటలకు పూర్తి చేయనుంది. ఈ నెల 23న సాయంత్రం చంద్రునిపై దిగనుంది.

అన్ని ప్రాజెక్టులూ అదానీకేనా?

- ప్రభుత్వంపై మాజీ ఎంపి హర్షకుమార్ ఆగ్రహం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అన్ని ప్రాజెక్టులనూ అదానీకే కట్టబెడుతున్నారని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రిలయెన్స్‌కు అనుకూలంగా పనిచేస్తున్నారని అమలాపురం మాజీ ఎంపి హర్షకుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో సోమవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ప్రస్తుత రాజకీయాలు, ప్రభుత్వ తీరుపై ఆయన మాట్లాడారు. కేసులకు భయపడి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి బిజెపికి అనుకూలంగా పనిచేస్తున్నారని విమర్శించారు. టిడిపి, జనసేన పార్టీలు కూడా బిజెపికే అనుకూలంగా ఉన్నాయని తెలిపారు. పార్లమెంట్‌లో అవిశ్వాస తీర్మానంలో చర్చ జరిగిన సందర్భంగా వైసిపి, టిడిపి ఎంపిలు మాట్లాడకపోవడం సిగ్గుచేటని అన్నారు. పార్లమెంట్ సాక్షిగా ఎపి ప్రజల ఆత్మగౌరవాన్ని రాష్ట్ర ఎంపిలు బిజెపికి తాకట్టుపెట్టారని విమర్శించారు. బిజెపితో జనసేన కలిసి ఉంటే గత ఎన్నికల్లో వచ్చిన ఫలితాలే వస్తాయని పవన్‌కళ్యాణ్‌ను హెచ్చరించారు. బిజెపిని వీడితే పవన్ కళ్యాణ్‌కు జనం బ్రహ్మరథం పడతారన్నారు. రాష్ట్రంలో ప్రత్యామ్నాయం కావాలని హర్షకుమార్ అభిప్రాయం వ్యక్తం చేశారు. జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మంత్రుల పేర్లు కూడా జనానికి తెలీవని ఎద్దేవా చేశారు. స్టేజిపై జగన్ ఒక్కరే కూర్చుంటారని, వైవి.సుబ్బారెడ్డి, విజయసాయిరెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాత్రమే రాష్ట్రాన్ని పాలిస్తున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి సమక్షంలో మంత్రి పినిపే విశ్వరూప్‌ను మోకాళ్లపై కూర్చోబెట్టారన్నారు. మణిపూర్ ఘటనకు బాధ్యత వహిస్తూ బిజెపి ప్రభుత్వం దిగిపోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూములనూ జగన్‌మోహన్‌రెడ్డి అమ్మేస్తున్నారని ఆరోపించారు. వలంటీర్లు రూ.5 వేలతో కుటుంబాన్ని పోషించుకోగలరా? అని ప్రశ్నించారు. ఎన్నికల్లో డబ్బులు తీసుకోకుండా ఓటు వేయాలని ప్రజలను కోరారు.

గిట్టుబాటు ధర కల్పించాల్సిందే..

ఏలూరు కలెక్టరేట్ ఎదుట కొబ్బరి రైతుల ధర్నా



ఏలూరు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న కొబ్బరి రైతులు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కొబ్బరి కొనుగోలు కేంద్రాలు తెరవాలని, కొబ్బరికి గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేస్తూ కొబ్బరి రైతులు కదం తొక్కారు. ఏలూరు కలెక్టరేట్ వద్ద ఎపి రైతు సంఘం, కొబ్బరి రైతుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఆందోళనకు దిగారు. ఎండిన, మొలకలు వచ్చిన కొబ్బరికాయలను కలెక్టరేట్ ఎదుట వేసి ధర్నా నిర్వహించారు. తమను ఆదుకోవాలంటూ ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్, జిల్లా అధ్యక్షులు నిమ్మగడ్డ నరసింహా, ప్రాంతీయ కొబ్బరి రైతుల సంఘం ఉపాధ్యక్షులు బొల్లి రామకృష్ణ మాట్లాడారు. కొబ్బరి రైతుల సమస్యల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. ప్రస్తుతం రైతులకు కొబ్బరికాయకు రూ.ఐదు నుండి రూ.ఆరు మాత్రమే ధర వస్తోందన్నారు. వినియోగదారులకు మాత్రం వ్యాపారులకు నాణ్యమైన కొబ్బరికాయను రూ.30పైగా అమ్ముతున్నారన్నారు. ఎర్ర నల్లి, తెల్ల దోమ వంటి తెగుళ్ల వల్ల దిగుబడులు తగ్గిపోయాయని తెలిపారు. కొబ్బరికాయలు చెట్టు నుండి కోసుకునేందుకు వ్యాపారులు గతేడాది వరకూ రూ.వెయ్యి నుండి రూ.1200 వరకూ ధర ఇచ్చేవారని, ప్రస్తుతం రూ.600 నుండి రూ.700 మాత్రమే ఇస్తున్నారని అన్నారు. ఎకరా కొబ్బరి సాగుకు ఏడాదికి రూ.40 వేలకుపైగా ఖర్చవుతోందని, కనీస పెట్టుబడి ఖర్చులు కూడా రాక నష్టాల్లో కూరుకుపోతున్న కొబ్బరి రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కొబ్బరి రైతులను ఆదుకోకపోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అనంతరం స్పందన కార్యక్రమంలో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఎంతమంది రైతుల వద్ద ఎన్ని క్వింటాళ్లు దిగుబడి ఉందో తెలియజేస్తే దాని ఆధారంగా కొబ్బరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.

చంద్రబాబు సిబిఐ విచారణ కోరడం దివాళాకోరుతనమే

- సజ్జల రామకృష్ణారెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అధికారంలో వున్నప్పుడు రాష్ట్రంలోకి సిబిఐ రాకూడదని నిర్ణయం చేసిన చంద్రబాబు నాయుడు, ఇప్పుడు సిబిఐ విచారణ కావాలని కోరడం ఆయన దివాళాకోరుతనానికి నిదర్శనమని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి విమర్శించారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. పుంగనూరు, అంగళ్లలో టిడిపి కార్యకర్తలను రెచ్చగొట్టి వైసిపి శ్రేణులు, పోలీసులపై దాడి చేయించిన చంద్రబాబే ఆయన్ను హత్యచేసేందుకు ప్రభుత్వం కుట్రలు చేస్తోందని చెప్పడం సరికాదన్నారు. రాష్ట్రంలో ఏదో జరిగిపోతుందని, పాతవన్నీ తిరగేసి ప్రధానికి, రాష్ట్రపతికి అభూత కల్పనలతో 10 పేజీల లేఖను రాయడమేంటని అన్నారు. పూనకాలు, అరుపులు, తిట్లు తప్పితే పవన్ కల్యాణ్ స్పీచ్‌లో ఏమీ ఉండదని పేర్కొన్నారు. పవన్ కల్యాణ్ రిమోట్ మొత్తం చంద్రబాబు చేతిలో వుందన్నారు. చంద్రబాబు రాజకీయ మైలేజీ కోసమే జనసేన పనిచేస్తోందని విమర్శించారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో దళారుల ప్రమేయం లేకుండా 90 శాతం మంది ప్రజలు సంతృప్తి చెందేలా సంక్షేమ పథకాలు అమలు చేస్తుంటే తట్టుకోలేక దుష్ప్రచారానికి దిగుతున్నారని అన్నారు.

విఆర్‌ఒ గ్రేడ్-2 సప్లిమెంటరీ పరీక్షలు 27కు వాయిదా

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గ్రామ రెవెన్యూ అధికారులు గ్రేడ్-2 (ఇంతకుముందు 15 రోజులు సర్వే శిక్షణకు హాజరైన వారు) వారికి ఈ నెల 20న నిర్వహించాల్సిన సప్లిమెంటరీ పరీక్షలు 27కు ప్రభుత్వం వాయిదా వేసింది. ఈ మేరకు సర్వే సెటిల్‌మెంట్స్ అండ్ ల్యాండ్ రికార్డ్సు కమిషనరు సిద్ధార్థజైన్ సోమవారం జిల్లా కలెక్టర్లకు ఉత్తర్వులు జారీ చేశారు. పరిపాలనా కారణాల వల్ల పరీక్షలు వాయిదా వేసినట్లు పేర్కొన్నారు.

హెచ్‌ఎల్‌సి నీటిని పరిరక్షించలేని ప్రభుత్వం

ఎస్‌ఇ కార్యాలయం వద్ద ధర్నాలో వి రాంభూపాల్



అనంతపురం హెచ్‌ఎల్‌సి కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

తుంగభద్ర హెచ్‌ఎల్‌సి కాలువ ఆధునీకరణ పనులు చేపట్టకుండా, సాగు నీటిని పరిరక్షించలేని దుస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉండడం సిగ్గుచేటని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వి రాంభూపాల్ విమర్శించారు. హెచ్‌ఎల్‌సి కాలువ ఆధునీకరణ పనులు చేపట్టి, రైతులకు సాగునీరు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో అనంతపురం జిల్లా హెచ్‌ఎల్‌సి ఎస్‌ఇ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతూ జిల్లాకు ఏకైక సాగునీటి వనరు తుంగభద్ర డ్యాం అని, ఈ డ్యాం నుంచి హెచ్‌ఎల్‌సి కాలువ ద్వారా నీరు అందుతోందని తెలిపారు. దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ కాలువ పూర్తిగా బలహీనపడిందన్నారు. కాలువ ఆధునీకరణ పనులు చేపట్టి దశాబ్దం గడిచినా ఇప్పటికీ పనులు పూర్తి కాలేదని తెలిపారు. దీనివల్ల జిల్లాకు రావాల్సిన నీటిని పూర్తిగా వినియోగించుకునే అవకాశాలు తగ్గిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నెల పదిన బొమ్మనహాల్ మండలం 113 కిలోమీటర్ దగ్గర హెచ్‌ఎల్‌సి ప్రధాన కాలువ నుంచి పెద్ద ఎత్తున లీకేజీ అయ్యిందన్నారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి యుద్ధ ప్రాతిపదికన కాలువ మరమ్మతు, నిర్వహణకు అవసరమైన నిధులు, సిబ్బందిని ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం హెచ్‌ఎల్‌సి ఎస్‌ఇని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఒ నల్లప్ప, ఎం బాలరంగయ్య పాల్గొన్నారు.

అదాని షేర్లకు డెలాయిట్ దెబ్బ

• ఆడిటర్‌గా వైదొలగడంతో సూచీలకు నష్టాలు • విచారణకు మరింత గడువు కోరిన సెబీ



న్యూఢిల్లీ : గౌతం అదానికి ప్రముఖ ఆడిటింగ్ సంస్థ డెల్లాయిట్ ఊహించని షాక్ ఇవ్వడంతో అదాని గ్రూపు స్టాక్స్ పతనాన్ని చవి చూశాయి. అదానీ పోర్ట్స్ అండ్ సెజ్ ఆడిటర్‌గా డెల్లాయిట్ వైదొలగడంతో పాటుగా అదానిపై హిండెన్‌బర్గ్ రీసెర్చ్ ఆరోపణలకు ఓ విధంగా మద్దతును ఇచ్చినట్లయ్యింది. మరోవైపు హిండెన్‌బర్గ్ ఆరోపణలపై విచారణకు తమకు మరో 15 రోజుల గడువు కావాలని సెబీ అత్యున్నత న్యాయస్థానాన్ని కోరింది. దీనిపై స్పందించిన అత్యున్నత న్యాయస్థానం ఈ కేసు తదుపరి విచారణను ఈ నెల 29కి వాయిదా వేసింది. మొత్తం 24 లావాదేవీలకు సంబంధించి 17 లావాదేవీలపై దర్యాప్తు పూర్తయ్యిందని సుప్రీంకోర్టుకు తెలిపింది. మిగిలిన లావాదేవీలపైనా విచారణ పూర్తి చేసేందుకు గడువు ఇవ్వాలని కోరింది. విదేశీ లావాదేవీల ప్రమేయం కారణంగా కేసుకు సంబంధించిన కొన్ని అంశాలను పరిశోధించడంలో సవాళ్లను ఎదుర్కొంటున్నట్లు పేర్కొంది. వాస్తవంగా ఆగస్టు 14లోగా నివేదిక సమర్పించాల్సి ఉంది. ఈ పరిణామాలతో అదాని స్టాక్స్‌పై మదుపర్లలో మరోసారి ఆందోళన మొదలయ్యింది. అదాని గ్రూపు కంపెనీల స్టాక్స్‌ను కుప్పకూలేలా చేశాయి. అదానీ గ్రూప్ ప్రధాన కంపెనీ అయిన అదానీ ఎంటర్‌ప్రైజెస్ షేర్ 3.26 శాతం తగ్గి రూ.2,455.70కు పడిపోయింది. అదానీ ట్రాన్స్‌మిషన్ 4.77 శాతం, అదానీ పవర్ 4.23 శాతం, అంబుజా సిమెంట్ 4 శాతం, అదానీ పోర్ట్స్ 3.70 శాతం మేర పతనాన్ని చవి చూశాయి. అదానీ గ్రీన్ ఎనర్జీ షేర్ 3.14 శాతం, అదానీ టోటల్ గ్యాస్ 3 శాతం, ఎన్‌డిటివి 3 శాతం, ఎసిసి 2.23 శాతం చొప్పున క్షీణించాయి.

గొర్రెలతో తహశీల్దార్ కార్యాలయం ముట్టడి

మేతకు దారి చూపాలని నిరసన



ప్రకాశం జిల్లా కురిచేడులో గొర్రెలతో ప్రదర్శన నిర్వహిస్తున్న మేకల, గొర్రెల పెంపకందారులు

ప్రజాశక్తి-కురిచేడు (ప్రకాశం జిల్లా)

గొర్రెల మేతకు దారి చూపాలని కోరుతూ ప్రకాశం జిల్లా కురిచేడు పంచాయతీ పరిధిలోని గొల్లపాలెం గ్రామం మేకల, గొర్రెల పెంపకందారులు దాదాపు ఐదు వేలకు పైగా గొర్రెలతో సోమవారం ప్రదర్శన నిర్వహించి, తహశీల్దారు కార్యాలయాన్ని ముట్టడించారు. గొల్లపాలెం సర్వే నంబర్ 77లో ఉసుళ్ల దండుబాట ఉండేది. ఈ బాట గుండానే గతంలో గొల్లపాలెం నుండి గొర్రెలను మేతకు తోలుకెళ్లేవారు. 2002లో ఆ సర్వే నెంబర్‌లో ఉన్న 19 ఎకరాల అసైన్‌మెంట్ భూమిని గ్రామంలోని కొందరికి వ్యవసాయం కోసం అప్పటి ప్రభుత్వం పట్టాలు ఇచ్చింది. పట్టాలు పొందిన వారు ఆ భూమి గుండా గొర్రెలను మేతకు రానివ్వకుండా అనేక ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఇటీవల గొర్రెల పెంపకందారులు కురిచేడు పర్యటనకు వచ్చిన కలెక్టర్‌కూ తమ గోడును వెళ్లబోసుకున్నారు. స్పందించిన కలెక్టర్ వెంటనే స్పందించి దారి సమస్యను పరిష్కరించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. అయినా సమస్య పరిష్కరించలేదు. గత్యంతరం లేక పెంపకందారులు తహశీల్దార్ కార్యాలయాన్ని ఐదు వేల గొర్రెలతో ముట్టడించారు. దీనిపై తహశీల్దార్ స్పందించి జిల్లా జాయింట్ కలెక్టర్ దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. ఆ భూముల వివరాలు తమకు పంపితే పది రోజుల్లోపు సమస్యను పరిష్కస్తామని జాయింట్ కలెక్టర్ హామీ ఇచ్చారు. దీంతో గొర్రెల, మేకల పెంపకందారులు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో జిల్లా గొర్రెల, మేకల పెంపకందారుల జిల్లా కార్యదర్శి తోట తిరుపతిరావు పాల్గొన్నారు.

లోకేష్‌ది అబద్ధాల గళం

- డొక్కా మాణిక్య వరప్రసాద్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో దళితులు, గిరిజనులు, మైనార్టీలు, వెనుకబడిన తరగతులకు టిడిపి చేసింది శూన్యమని మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ విమర్శించారు.

14 ఏళ్ల అధికారంలో వున్న చంద్రబాబు బలహీనవర్గాల కోసం ఏమి చేశారో చెప్పుకునేందుకు వారి వద్ద ఒక్క కార్యక్రమం కూడా లేదని ఎద్దేవా చేశారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. నారా లోకేష్‌ది యువగళం యాత్ర కాదని అంతా అబద్ధాల గళమని అన్నారు.టిడిపి బలహీనవర్గాలకు దూరంగా వున్నందునే 2014లో గానీ, 2019 ఎన్నికల్లో గానీ ఎస్‌టి రిజర్వ్ స్థానాల్లో ఒక్కసీటైనా గెలవలేదని అన్నారు. తాడికొండ ఎమ్మెల్యే శ్రీదేవి వైసిపి నుంచి గెలిచి లోకేష్ పక్కన నిల్చొని వైసిపిని విమర్శించడం సరైందికాదని, ఆమెకు చిత్తశుద్ధి వుంటే రాజీనామా చేసి మాట్లాడాలని అన్నారు.

15 నెలల గరిష్టానికి రిటైల్ ద్రవ్యోల్బణం

- కూరగాయల కుంపటి



జులైలో 7.44 శాతానికి చేరిక

న్యూఢిల్లీ : దేశంలో ధరలు మళ్లీ కోరలు చాస్తున్నాయి. గత నెలలో కూరగాయలు, ఇతర వంట సరుకుల ధరలు ఎగిసిపడ్డాయి. ఈ నేపథ్యంలో 2023 జులైలో వినియోగదారుల ద్రవ్యోల్బణం సూచీ (సిపిఐ) ఏకంగా 7.44 శాతానికి పెరిగింది. ఇంతక్రితం నెల జూన్‌లో ఇది 4.87 శాతంగా ఉంది. గడిచిన నెలలో ముఖ్యంగా అహారోత్పత్తుల ధరలు 11.5 శాతం పెరిగాయని సోమవారం కేంద్ర గణంకాల శాఖ స్వయంగా వెల్లడించింది. దీంతో ద్రవ్యోల్బణం సూచీ 15 మాసాల గరిష్టానికి చేరింది. ఇంతక్రితం 2022 ఏప్రిల్‌లో ఈ స్థాయిలో ధరలు నమోదయ్యాయి. గడిచిన జులైలో కూరగాయల ధరలు 37.3 శాతం పెరిగాయి, తృణధాన్యాలు, పప్పులు 13 శాతం పైగా ప్రియమయ్యాయి. పట్టణాల్లో అహార ద్రవ్యోల్బణం 12.3 శాతానికి చేరగా.. గ్రామీణ ప్రాంతాల్లో 11 శాతంగా చోటు చేసుకుంది. చాలా మంది ఆర్థిక నిపుణుల అంచనాలు మించి ధరల పెరుగుదల చోటు చేసుకోవడం ఆందోళనకరం. రిటైల్ ద్రవ్యోల్బణాన్ని 6 శాతానికి రెండు శాతం అటూ, ఇటుగా కట్టడి చేయాలనే ఆర్‌బిఐ లక్ష్యానికి భిన్నంగా చోటు చేసుకోవడం గమనార్హం. మసాలా దినుసులు 21.6 శాతం, పాలు 8.34 శాతం చొప్పున పెరిగాయి. జూన్‌తో పోలిస్తే బంగాళాదుంప ధరలు 8 శాతం ఎక్కువగా ఉన్నాయి. ఉల్లిపాయలు కూడా 28 శాతం ఎగిశాయి. ఆగస్ట్ ప్రారంభంలోనూ అహార ధరలు సానుకూలంగా లేవని ఇక్రా చీఫ్ ఎకనామిస్ట్ అదితి నాయర్ పేర్కొన్నారు. ఇప్పటికే అధిక ధరలు ప్రజల జేబులకు చిల్లు పెడుతున్నాయి. మరింత పెరుగుతోన్న ధరలు ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశాలు ఉన్నాయి.

ఎస్‌ఎల్‌బిసి నిర్ణయాలపై స్పందన కరవు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ఎస్‌ఎల్‌బిసి సమావేశాల్లో పలు కీలక అంశాలపై జరుపుతున్న చర్చలు, తీసుకుంటున్న నిర్ణయాలు కాగితాలకే పరిమితమవుతున్నాయి. ఈ చర్చల్లో అంశాలపై నిర్దిష్టమైన సూచనలు వస్తున్నప్పటికీ వాటిని సంబంధిత శాఖల అధికారులు పెద్దగా పట్టించుకోవడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. ప్రధానంగా ఆర్థికపరమైన అంశాలపై రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమితిలో కీలక చర్చలు జరుగుతాయి. ఇందులో అనేక శాఖల ఉన్నతాధికారులు కూడా హాజరవుతారు.

ఎక్కువగా వ్యవసాయం, సంక్షేమం, విద్య వంటి రంగాలపైనే చర్చిస్తారు. ఈ శాఖల్లోని పథకాలకు కావాల్సిన నిధులు, లబ్ధిదారులకు నేరుగా అందించేందుకు తీసుకునే చర్చలపై నిర్ణయాలు తీసుకుంటారు. అయితే, వీటి అమలు అంతంతమాత్రమే!

ప్రధానంగా గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణకు సంబంధించి ఆర్థికసాయంకింద ఎస్‌ఎల్‌బిసిలో చర్చించారు.

దీనికోసం ఏప్రిల్ 30లోగా ఎస్‌ఓపి (స్టాండింగ్ ఆపరేషనల్ ప్రొసీజర్) సిద్ధం చేయాలని నిర్ణయించారు. అయితే ఇప్పటివరకు నైపుణ్యాభివృద్ధి సంస్థ నుంచి ఎస్‌ఓపి రాలేదు. రైతులకు సంబంధించిరైతు భరోసా కేంద్రాల్లో బిసి (బ్యాంకింగ్ కరస్పాండెంట్)లను అనుసంధానం చేసే ప్రక్రియకు కూడా ఇంతవరకు పూర్తి స్థాయి సమాచారం సిద్ధం కాలేదు.

అలాగే కౌలు రైతులకు సంబంధించిన అంశం కూడా ఇంకా పెండింగ్‌లోనే ఉంది. కౌలు రైతులకు సంబంధించి మరింత సేవలు ముమ్మరం చేసేందుకు గత సమావేశాల్లోనే నిర్ణయం తీసుకున్నారు. అయితే వ్యవసాయ శాఖ నుంచి కౌలు రైతుల అభివృద్ధి వ్యూహాలకు సంబంధించి ఇప్పటివరకు అవసరమైన సమాచారం రాలేదని అంటున్నారు.

ఆర్థికవిద్యపైనా...

పాఠశాల విద్యలో ఆర్థిక అంశాలపై ప్రత్యేక తరగతులు నిర్వహించేందుకు ప్రభుత్వం ప్రతిపాదించింది. దీనిపై విద్యా శాఖ నుంచి ప్రతిపాదనలు ఏప్రిల్ 30 నాటికే రావాల్సి ఉన్నప్పటికీ ఇంతవరకు రాలేదని చెబుతున్నారు. మరికొన్ని ఇతర అంశాలపైనా రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమితిలో చర్చించినప్పటికీ ఆయా శాఖల నుంచి స్పందన కనిపించడం లేదన్న విమర్శలు వస్తున్నాయి.



48 మంది స్మగ్లర్లు అరెస్టు

• మూడు ప్రాంతల్లో 51ఎర్రచందనం దుంగలు స్వాధీనం : డిఎస్‌పి చెంచుబాబు

ప్రజాశక్తి- తిరుపతి (మంగళం):

మూడు కేసుల్లో 48 మంది స్మగ్లర్లను అరెస్టు చేసినట్లు ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక టాస్క్‌ఫోర్సు డిఎస్‌పి చెంచుబాబు తెలిపారు. 51ఏ గ్రేడ్ ఎర్రచందనం దుంగలు, రెండు కార్లు, ఒక ఆటో, ఆరు మోటారుసైకిళ్లు స్వాధీనంపరచుకున్నట్లు చెప్పారు. తిరుపతి నగర పరిధిలోని కపిలతీర్థం వద్దగల ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక కార్యదళం కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... తిరుపతి జిల్లా లక్ష్మీపురం గ్రామసమీపంలో పెరుమాళ్లపల్లి ఫారెస్ట్ బీటు పరిధిలో తమిళనాడు తిరువన్నామలై జిల్లా జమునామత్తూరు తాలూకాకు చెందిన కె కుమార్‌ను అరెస్టు చేశారు. అతని నుంచి తొమ్మిది ఎర్రచందనం దుంగలు, ఒక కారును స్వాధీనం చేసుకున్నారు. అన్నమయ్య జిల్లా సానిపాయ రేంజి పరిధిలో సుండుపల్లి అటవీ ప్రాంతంలో చెక్ పోస్టుకు తూర్పువైపున కూంబింగ్ నిర్వహించారు. ఎర్రచందనం దుంగలను మోసుకుని వస్తున్న వారిని చుట్టుముట్టి 21 ఎర్రచందనం దుంగలు, ఐదు మోటారు సైకిళ్లు, ఒక కారు స్వాధీనం చేసుకున్నారు. తమిళనాడు వేలూరు జిల్లాకు చెందిన 15 మందిని, తిరువన్నామలై జిల్లాకు చెందిన ముగ్గురిని, కర్ణాటక కోలారు జిల్లాకు చెందిన ఒకరిని పట్టుకున్నారు. అన్నమయ్య జిల్లా బాలపల్లి రేంజిలోని సిద్దలేరు బేస్ క్యాంప్ వద్ద అరిమాను బండ సమీపంలో కొందరు వ్యక్తులు ఎర్రచందనం దుంగలు డ్రెస్సింగ్ చేస్తూ కనిపించారు. వారిని చుట్టుముట్టి 21 ఎర్రచందనం దుంగలను, ఒక మోటారు సైకిల్, ఒక ఆటో స్వాధీనం చేసుకున్నారు. తమిళనాడు వేలూరు జిల్లా, కల్లకురుచ్చి జిల్లాకు చెందిన 27 మందిని, చిత్తూరు జిల్లాకు చెందిన ఒకరిని అరెస్టు చేశారు. మొత్తం 51 దుంగలు 1588 కిలోలు ఉన్నాయని, వాటి విలువ సుమారు రూ.రెండు కోట్లు ఉంటుందని అంచనా వేశామన్నారు. ఈ కేసులను తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీసుస్టేషన్‌లో నమోదు చేశామని, సిఐ శ్రీనివాసులు దర్యాప్తు చేస్తున్నారని డిఎస్‌పి తెలిపారు.

సంపాదకీయం

ఏకపక్ష పార్లమెంట్

పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో కేంద్ర బిజెపి ప్రభుత్వం తన ఏకరూప-కార్పొరేట్ ఎజెండాకు మరింత పదును పెట్టి రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని మంటకలిపింది. పార్లమెంట్ సమావేశాలు జులై 20న ప్రారంభమై శుక్రవారంతో ముగిశాయి. జనాన్ని భక్షించే, అవస్థలపాల్జేసే, ఇంకా ఇంకా సహజ వనరుల దోపిడీకి ఆస్కారం కలిగించే బిల్లులను ఆమోదింపజేసుకుకోడానికి, ప్రతిపాదించడానికి పార్లమెంట్‌ను మోడీ ప్రభుత్వం ఒక సాధనంగా వాడుకుంది. ఏడెమిది మాసాల్లో సార్వత్రిక ఎన్నికలుండగా ఇప్పుడూ ప్రజల కంటే మతతత్వ-కార్పొరేట్ కార్యాచరణకే నడుంకట్టింది. ఇదే తన అసలు సిసలైన ఎజెండా అని అరమరికలు లేకుండా స్పష్టం చేసింది. ఎగువ, దిగువ సభలు కలిపి 21 బిల్లులు ఈ సమావేశాల్లో ఆమోదం పొందాయి. చట్టరూపం దాల్చిన వాటిలో అత్యంత దుర్మార్గమైనవి అటవీ (సంరక్షణ) చట్టం, గనులు, ఖనిజాలు (అభివృద్ధి, నియంత్రణ) చట్టం. ప్రజలతో పర్యావరణంతో సంబంధం లేకుండా ప్రైవేటు పెట్టుబడిదారులు జాతీయ వనరులను దోచుకోడానికి, అడవులపై ఆధారపడ్డ ఆదివాసీల, ఇతర పేదల భూములు లాక్కోడానికి ఈ చట్టాలు బాగా ఉపకరిస్తాయి.

1980 నాటి అటవీ చట్టం ప్రధానోద్దేశం నిర్లక్ష్యపూరిత దోపిడీ నుంచి అడవులను రక్షించడం. 2006లో తెచ్చిన అటవీ హక్కుల చట్టంలో గిరిజనులు, ఇతర సంప్రదాయ అటవీ వాసులకు భూములపై హక్కులు కల్పించేందుకు కొన్ని మినహాయింపులు ఇచ్చారు. ప్రస్తుత చట్టంలో రోడ్లు, మౌలిక సదుపాయాల, వంటి వాటికి అటవీ భూములను స్వేచ్ఛగా తీసుకొనే వెసులుబాటు కల్పించారు. పర్యావరణానికి హాని తలపెట్టి నిరంతర మైనింగ్‌ల ద్వారా వనరులను దోచుకోడానికి వీలుగా సవరణలు చేశారు. బిల్లుల ఆమోదానికి ఏ విధంగా బుల్డోజ్ చేశారంటే కనీసం అటవీ, పర్యావరణ అంశాలపై పరిశీలనకు ఉన్న పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీకి బిల్లులపై కనీస సమాచారం ఇవ్వకుండా పార్లమెంట్‌లో ప్రవేశపెట్టారు. ఈ విషయాన్ని కమిటీ ఛైర్మన్ జైరాంరమేష్ చెప్పారు. తాను ఛైర్మన్ పదవిలో ఉండనని ప్రకటించారు. మోడీ ప్రభుత్వం పార్లమెంటరీ నిబంధనలను, సంప్రదాయాలను తుంగలో తొక్కుతోందనడానికి ఈ దృష్టాంతం తిరుగులేని ఉదాహరణ. ఢిల్లీ ప్రభుత్వ పాలనపై కేంద్ర పెత్తనానికి ఉద్దేశించిన ఢిల్లీ సర్వీస్ బిల్లు సమాఖ్య వ్యవస్థపై మోడీ సర్కారు చేసిన దాడి. డేటా ప్రొటెక్షన్ బిల్లు పౌరుల భావ ప్రకటనా స్వేచ్ఛకు విఘాతం కలిగిస్తుంది. మల్టీ కోపరేటివ్ సొసైటీల బిల్లు రాష్ట్రాల పరిధిలోని సహకార వ్యవస్థపై కేంద్రం పెత్తనం చేయడానికి ఉద్దేశించినది. బిల్లుల్లో చాలా మట్టుకు మూజువాణి ఓటుతో అమోదం పొందాయి. అంతా ఏకపక్షం.

మోడీ సర్కారు తీసుకొచ్చిన మరో దుర్మార్గమైన బిల్లు కేంద్ర ఎన్నికల సంఘంలో చీఫ్ ఎలక్షన్ కమిషనర్, సభ్యుల నియామకాలకు సంబంధించినది. పార్లమెంట్ చట్టం చేసే వరకు ఎంపిక కమిటీలో ప్రధాని, లోక్‌సభ ప్రతిపక్షనేత, సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ (సిజెఐ) ఉండాలని రాజ్యాంగ ధర్మాసనం తీర్పు చెప్పింది. బిల్లులో ఎంపిక కమిటీ నుంచి సిజెఐని ప్రభుత్వం తొలగించింది. కమిటీలో ప్రధాని నామినేట్ చేసిన కేబినెట్ మినిస్టర్‌ను చేర్చింది. ఇసిపై పెత్తనానికే ఈ బిల్లు. అంతేకాదు క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ స్థానే మూడు కొత్త కోడ్‌లు, సిఆర్‌పిసి పేరును భారతీయ నాగరిక్ సురక్ష సంహిత చట్టం, ఐపిసి పేరును భారతీయ న్యాయ సంహితగా మార్పు, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ పేరును భారతీయ సాక్ష్యాధారాల చట్టంగా మార్చేందుకు చివరి రోజు మూడు బిల్లులు తీసుకొచ్చింది.. రాజద్రోహం అనే పదాన్ని తీసేసి అంతకంటే క్రూరమైన నిబంధనలను జోడించింది. చట్టాలకు హిందీపేర్లు పెట్టడం ఏకరూప సిద్ధాంత అమలులో భాగం. ఆ ముసుగులో పౌరులకు రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాసే, అణచివేతను పెంచే చట్టాలు చేయడం ప్రభుత్వ నిరంకుశ వైఖరిని స్పష్టం చేస్తుంది. రాజ్యసభలో ఆప్ ఎంపి, లోక్‌సభలో కాంగ్రెస్ పక్ష నేత సస్పెన్షన్ బిజెపి అసహనానికి నిదర్శనం. మణిపూర్‌పై అవిశ్వాస తీర్మానం, ఢిల్లీ బిల్లుపై, ఇంకా ఇతర అంశాలపై ప్రతిపక్ష 'ఇండియా' మోడీ ప్రభుత్వాన్ని ముచ్చెమటలు పోయించడం కొత్త పరిణామం. బిజెపి ఓటమే లక్ష్యంగా 'ఇండియా' కార్యాచరణ బలోపేతం కావాలి. ఇదే ప్రజల ఆకాంక్ష.

మహనీయుల మాట



ప్రపంచంలో పెట్టుబడిదారులు రాజ్యమేలిన చోట పత్రికా స్వేచ్ఛ అంటే వార్తా పత్రికలు కొనడానికి, రచయితలను కొనడానికి, లంచం ముట్టజెప్పడానికి, కొనుగోలు చేయడానికి, బూర్జువా ప్రయోజనాల కోసం ప్రజల అభిప్రాయాలను కూడా కొనుగోలు చేయడానికి, బూటకపు అభిప్రయాలను ప్రచురించడానికి స్వేచ్ఛ.

-వి ఐ లెనిన్

నిజాన్ని వెల్లడి చేయడమే నేరమా ?

విశ్లేషణ



ఉత్సా పట్నాయిక్

గడిచిన మూడు దశాబ్దాల కాలపు నయా ఉదారవాద విధానాల కాలంలో దేశ ప్రజల పౌష్టికాహార లభ్యత క్రమంగా దిగజారుతోంది. దేశ ప్రజలు పౌష్టికాహారం పొందుతున్నదీ లేనిదీ అయిదేళ్ళకోమారు సర్వే చేస్తారు. ఈ సర్వేలు తలసరి కేలరీల లభ్యత, మాంసకృత్తుల లభ్యత తగ్గిపోతున్నట్టు సూచిస్తున్నాయి.. (ఐతే అధికాదాయం పొందుతున్న వారిలో కొవ్వు పదార్థాల వినియోగం పెరుగుతున్నట్టు కూడా సర్వేలు వెల్లడి చేస్తున్నాయి) ఈ పౌష్టికాహార లోపం ముందు గ్రామీణ ప్రాంతాలలో, ఆ తర్వాత పట్టణ ప్రాంతాలలో సైతం బైటపడింది. మనకి ఎక్కువ శక్తిని ఇచ్చేవి తృణధాన్యాలు, పప్పు దినుసులు. మొత్తం పండించే ఆహారధాన్యాలలో 90 శాతం తృణధాన్యాలే. ఒక సగటు గ్రామీణ పౌరుడు పొందే శక్తి లో మూడింట రెండొంతులు వీటిద్వారానే లభిస్తున్నాయి. కాని నయాఉదారవాద కాలంలో ఈ తృణ ధాన్యాల వినియోగం బాగా తగ్గిపోయింది. ఆఫ్రికా దేశాలలో కన్నా, అభివృద్ధిలో బాగా వెనుకబడిన చాలా దేశాలలో కన్నా మన దేశంలో తగ్గిపోయింది. (పాలు, గుడ్లు, కోడి మాంసం వంటివి ఉత్పత్తి చేయడానికి ఉపయోగించే మేత గా వినియోగించే తృణధాన్యాలను కూడా లెక్కలోకి తీసుకున్నా)

అంతేగాక, గత కొన్ని దశాబ్దాలుగా ఆహారం మీద వెచ్చించే తలసరి వ్యయం వాస్తవ లెక్కల ప్రకారం తగ్గిపోతోంది. (అన్ని ఆహార వస్తువుల మార్కెట్ ధరలపైన వినిమయ ధరల సూచిక లో వచ్చే పెరుగుదల ప్రభావం తగ్గించి లెక్కిస్తే వాస్తవ ధర నిర్ధారించవచ్చు) ఒక పక్క జిడిపి వృద్ధి చాలా ఎక్కువగా నమోదు అవుతున్న దేశంలో ఆహారం మీద వెచ్చించే తలసరి వ్యయం తగ్గిపోవడం చాలా అసాధారణ విషయం. ఆదాయాల్లో అసమానతలు తీవ్రంగా పెరిగిపోవడం, జనాభాలో పౌష్టికాహారాన్ని పొందలేని పేదవారి సంఖ్య పెరిగిపోవడమూ దీనికి కారణం

చాలా కాలంనుంచీ ఈ విధంగా పడిపోతున్న పౌష్టికాహార స్వీకరణ గురించి కొందరు ఆర్థిక వేత్తలు చాలా తప్పుడు వాదనలు ముందుకు తెస్తున్నారు. యాంత్రీకరణ ఫలితంగా ఇప్పుడు తక్కువ శక్తి సరిపోతున్నదని, జనాభా వయస్సు పొందిక మారిపోయినందువలన కనీసంగా అవసరమైన శక్తి స్థాయి తగ్గిపోతోందని, ప్రజల రుచులు మారిపోయినందువలన వారు పౌష్టికాహారాన్ని తీసుకోడానికి విముఖంగా ఉన్నారని - ఇలా నానా రకాల పనికిమాలిన వాదనలూ తెస్తున్నారు.

అధిక జనాభా కలిగివుండి, జనాభాలో మన మాదిరిగానే



> ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఒక కొత్త సూచిక విడుదల చేసింది. దాని ఆధారంగా దేశంలో పేదరికం గణనీయంగా తగ్గిపోయిందని ప్రకటించింది. గత 70 సంవత్సరాలుగా దేశంలోగాని, అంతర్జాతీయంగాగాని పేదరికానికి సంబంధించి ఉన్న అర్థానికి భిన్నమైన రీతిలో ప్రభుత్వం పేదరికం గురించి చెప్తోంది. కుళాయినీరు, విద్యుత్ కనెక్షన్, రేకుల ఇల్లు గాని స్లాబు ఇల్లు గాని, బ్యాంక్ అకౌంట్ (అందులో సున్నా బ్యాలెన్స్ ఉన్నా సరే) ఉంటే పేదరికం లేనట్టే.

వయస్సు పొందిక ఉన్న దేశాలు మన మాదిరిగానే అభివృద్ధి చెందుతున్న చోట్ల మన దేశంలో కన్నా ఎక్కువ యాంత్రీకరణ జరిగినా వారి పౌష్టికాహార స్వీకరణ స్థాయి ఏ మాత్రమూ తగ్గిపోవడం లేదు. పైగా మనకన్నా ఎక్కువ మోతాదులో వారు ఎక్కువ పుష్టికరమైన ఆహారాన్ని తీసుకుంటున్నారు. ఐరాస కు చెందిన ఆహార, వ్యవసాయ సంస్థ (ఎఫ్ఎఓ) 2019లో విడుదల చేసిన లెక్కల బట్టి(ఇవే ఇప్పటికి లభిస్తున్న తాజా లెక్కలు) భారతదేశంలో తలసరి తృణధాన్యాల వినిమయం171 కిలోలు. (ఇందులో మనం వినియోగించే పాలు, గుడ్లు, చికెన్ వంటివి ఉత్పత్తి కావడానికి అవసరమైన మేతలో వాడే తృణ ధాన్యాలను కూడా కలిపి లెక్కించారు) ఇదే ఆఫ్రికా ఖండంలో 190 కిలోలు ఉంది. అతి తక్కువ అభివృద్ధి చెందుతున్న దేశాల్లో 205 కిలోలు ఉంది. ప్రపంచ సగటు 304 కిలోలుఉంది. చైనాలో, బ్రెజిల్ లో దానిని మించి 360 కిలోలు ఉంది. ఇక రష్యాలో 407 కిలోలు ఉంది. అభివృద్ధి చెందిన పారిశ్రామిక దేశాల్లో 494 కిలోలు ఉంది. యూరపియన్ యూనియన్ దేశాల్లో, అమెరికాలో ఇది 590 కిలోలు! ఇక్కడ గుర్తుంచుకోవలసినది ఒకటుంది. ఎఫ్ఎఓ తనంతట తానుగా లెక్కల్ని తయారు చేయదు. ఆ యా ప్రభుత్వాలు అందించే సమాచారం ఆధారంగానే వివరాలు రూపొందిస్తుంది. కాబట్టి ఈ లెక్కలు తప్పుడు తడకలని చెప్పి మన ప్రభుత్వం తప్పించుకోడానికి కుదరదు. అందుచేత 121 దేశాలకు గాను ప్రపంచ ఆకలిసూచికలో మనదేశం 107వ స్థానంలో ఉండడం ఆశ్చర్యాన్ని కలిగించదు.

2017-18 నాటి జాతీయ శాంపిల్ సర్వే వివరాలను ఆ సంస్థ గతేడాది బహిరంగంగా పోర్టల్ లో అందుబాటులో ఉంచింది. దానిని బట్టి 2011తో పోల్చితే 2017-18 నాటికి వినిమయ వస్తువులమీద, సేవలమీద ప్రజలు చేసే ఖర్చు పడిపోయింది. అంతకుముందు దశాబ్దాలనుండీ పౌష్టికాహారంమీద చేస్తున్న ఖర్చు తగ్గిపోవడం గురించి ముందే తెలిపాను, దానికి అదనంగా అన్ని రకాల ఖర్చూ తగ్గిపోవడం అనేది తోడైంది. ఈ నివేదికను వెంటనే ప్రభుత్వం పోర్టల్ నుండి తొలగించి ప్రజలకు కీలకమైన సమాచారం అందకుండా కప్పిపుచ్చింది. ఇటువంటిఅసాధారణ చర్య గతంలో ఏ ప్రభుత్వమూ చేపట్టలేదు.

కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పాపులేషన్ సైన్సెస్ (జనాభాకు సంబంధిచిన శాస్త్రాన్ని అధ్యయనం చేసే సంస్థ) ముంబైలో ఉంది. దాని డైరక్టర్ ను ఇటీవల కేంద్ర ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ఈ సంస్థ అయిదేళ్ళకోసారి జాతీయ స్థాయిలో కుటుంబ ఆరోగ్య పరిస్థితిని సర్వే చేస్తుంది. 2019-21 లో చేసిన 5వ సర్వే వివరాలను ఆ సంస్థ వెల్లడి చేసింది. దాని ప్రకారం 2015-16 నాటి 4వ సర్వేతో పోల్చితే చిన్న పిల్లలకు, మహిళలకు సంబంధించిన ఆరోగ్య సూచికలు గణనీయంగా పడిపోయాయి. ఈ వాస్తవాలు ప్రభుత్వాన్ని తగు చర్యల దిశగా కదిలించాలి. కాని అందుకు భిన్నంగా ఆ వాస్తవాలను బైట పట్టినందుకు కంపెనీ డైరక్టర్ పదవి నుండి సస్పెండ్ అయారు. ఆరోగ్య సూచికలు పతనం కావడానికి అతగాడు ఏ విధంగానూ బాధ్యుడు కాడు. కేవలం వాటిని సేకరించి వెల్లడించడమే అతని బాధ్యత. ఆ వివరాలను గ్రహించి పరిస్థితిని సరిదిద్దడం పోయి ఆ వస్తవాలను తెలియజెప్పినందుకు అతనిపై వేటు వేసింది ఈ ప్రభుత్వం.

ఆరోగ్యసూచికలన్నీ కేవలం పౌష్టికాహారం మీదనే ఆధారపడివుండవు. రక్షిత మంచినీటిని అదరికీ అందించడం ద్వారా, రోగాలను వ్యాప్తి చేసే దోమల వ్యాప్తిని కట్టడి చేయడం ద్వారా, పేగులలోనులిపురుగులను నిర్మూలించడం ద్వారా, పారిశుధ్యాన్ని మెరుగుపరచడం ద్వారా ఆరోగ్య పరిస్థితిని మెరుగుపరచవచ్చు. చాలా దేశాలలో మాదిరిగానే మన దేశంలో కూడా ఈ విషయాలలో పురోగతి నత్తనడకన సాగుతోంది. ఐతే తక్కిన ఆరోగ్య సూచికలు ఎక్కువగా పౌష్టికాహారం తీసుకోవడం మీదనే ఆధారపడివుంటాయి. అటువంటి ఆహారం దొరకనప్పుడు ఆ సూచికలు దిగజారుతాయి.

4వ కుటుంబ, ఆరోగ్య సర్వే తో పోల్చినప్పుడు 5వ సర్వేలో కూడా ప్రసూతి, శిశు మరణాల రేటు తగ్గడం అనేది కనిపించింది. (అది గతం కన్నా స్వల్పంగానే తగ్గింది) అదే సమయంలో చిన్న పిల్లలలోను పెద్ద వారిలో కూడా రక్తహీనత బాగా పెరిగిందని నివేదిక వెల్లడించింది. ఈ రక్తహీనత ఇదివరకే బాగా ఎక్కువగా ఉంది. ఇప్పుడు మరింత పెరిగింది. 6 నెలల నుండి 5 ఏళ్ళలోపు చిన్న పిల్లల్లో రక్త హీనత ఉన్నవారు 2015-16 లో 59 శాతం ఉంటే 2019-21 నాటికి 67 శాతానికి పెరిగారు. వీరిలో తీవ్ర స్థాయిలో రక్తహీనత ఉన్నవారు 30.6 శాతం ,ఉండి 38.1 శాతానికి పెరగడం మరీ ఆందోళనకరం.

పెద్ద వారిలో కూడా , అందులో ముఖ్యంగా మహిళలలో రక్తహీనత ఇదే కాలంలో 53 శాతం నుండి 57 శాతానికి పెరిగింది. తీవ్ర రక్తహీనత ఉన్నవారు 28.4 శాతం నుండి 31.4 శాతానికి పెరిగారు. ఇదే మగవారిలో (49 సం.లోపువారికి) తీవ్ర రక్తహీనత ఉన్నవారు 23 శాతం నుండి 25 శాతానికి పెరిగారు. గ్రామీణ ప్రాంతాల్లో రక్తహీనత ఎక్కువగా ఉంది. ఈ వాస్తవాలను గమనించి దానిని చక్కదిద్దే చర్యలు తీసుకోవడం పోయి ప్రభుత్వం ఆ వాస్తవాలను గుర్తించడానికి నిరాకరిస్తోంది.

చిన్న పిల్లల పౌష్టికాహారానికి సంబంధించిన సూచికలు కూడా అంచనాలకన్నా కూడా హీనంగా ఉన్నాయి. 2015-16లో 5 సంవత్సరాల లోపు పిల్లల్లో 36 శాతం తక్కువ బరువుతో ఉన్నారు. 38 శాతం పిల్లలకు వయస్సుకు తగ్గ పొడవులు లేవు. 2019-20 నాటికి తక్కువ బరువు ఉన్నవారి శాతం 32కి, వయస్సుకు తగ్గ పొడవు లేనివారి శాతం 36 కి స్వల్పంగా తగ్గింది. ఎత్తుకు తగ్గ బరువు లేనివారి శాతం కూడా 21 నుండి 19 కి తగ్గింది. ఐదేళ్ళ క్రితం ఐదు రాష్ట్రాల్లో ఈ సూచికలు జాతీయ సగటు కన్నా చాలా హీనంగా ఉండేవి. ఈ కాలంలో ఆ ఐదు రాష్ట్రాల్లో కొంత మెరుగుదల వచ్చినందువలన జాతీయస్థాయిలో కూడా మెరుగుదల కనిపించింది. ఇంకా ఎక్కువ రాష్ట్రాల్లో అవసరమైనమేరకు దిద్దుబాటు చర్యలు తీసుకోవలసివుంది.

ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఒక కొత్త సూచిక విడుదల చేసింది. దాని ఆధారంగా దేశంలో పేదరికం గణనీయంగా తగ్గిపోయిందని ప్రకటించింది. గత 70 సంవత్సరాలుగా దేశంలోగాని, అంతర్జాతీయంగాగాని పేదరికానికి సంబంధించి ఉన్న అర్థానికి భిన్నమైన రీతిలో ప్రభుత్వం పేదరికం గురించి చెప్తోంది. కుళాయినీరు, విద్యుత్ కనెక్షన్, రేకుల ఇల్లు గాని స్లాబు ఇల్లు గాని, బ్యాంక్ అకౌంట్ (అందులో సున్నా బ్యాలెన్స్ ఉన్నా సరే) ఉంటే పేదరికం లేనట్టే. తన అంచనాలో పౌష్టికాహారానికి ఆరో వంతు మాత్రమే ప్రాధాన్యత ఇచ్చింది. అలాగే పౌష్టికాహారం అందుతున్నదీ లేనిదీ తేల్చడానికి వారు స్వీకరించే ఆహారాన్ని బట్టి కాకుండా, శరీరం ఎత్తుకు, బరువుకు నడుమ ఉండే నిష్పత్తి (బాడీ-మాస్ ఇండెక్స్) ఆధారంగా తీసుకున్నారు. మన దేశంలో ఎక్కువమంది తక్కువ ఎత్తు, తక్కువ బరువు కలిగివుంటారు. వయస్సుకు తగ్గ ఎత్తు గాని బరువుగాని ఉన్నవారు పేదల్లో తక్కువ. అటువంటప్పుడు ఆ కొలబద్ద యధాతథంగా మన ప్రజలకు వర్తించదు. ఇదంతా చాలదన్నట్టు పౌష్టికాహారానికి సంబంధించి కూడా ప్రమాణాలను ఏ విధంగా తగ్గించాలన్న కసరత్తు ఇప్పుడు ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రిసెర్చి ద్వారా సాగిస్తున్నారు.తమ రాజకీయ ప్రయోజనాలను నెరవేర్చుకోవడం కోసం శాస్త్రీయ అధ్యయనాలను ఎంత దారుణంగా దెబ్బ తీస్తున్నారో చూస్తే వెగటు పుడుతున్నది. త్వరలోనే మన దేశంలో పేదరికం పూర్తిగా అంతరించిపోయిందన్న లెక్కలు మన ముందు ప్రత్యక్షం అయినా పాఠకులెవరూ ఆశ్చర్యపోకూడదు మరి !

(స్వేచ్ఛానుసరణ)

ఈ దేశం ఎటు పోతోందో...

సందర్భం



ఆర్. రఘు

> మనస్మృతి ప్రస్తావన లేదు కాబట్టి రాజ్యాంగం మెజారిటీ మతస్తులైన హిందువులకు ఆమోదయోగ్యం కాదని ప్రకటించింది. ఇప్పుడు అనేక కారణాల రీత్యా బలం పుంజుకున్న ఆర్ఎస్ఎస్ హిందుత్వ ఫాసిస్ట్ శక్తులు తాము 70ఏండ్ల క్రితం చెప్పిన మాటలను నిజం చేయబూనుకుంటున్నాయి. ప్రముఖ చరిత్ర విశ్లేషకులు ప్రొఫెసర్ ఐజాజ్ అహ్మద్ చెప్పినట్లు "వీరు రాజకీయ వ్యవస్థని, రాజ్యాంగాన్ని, లోపల నుంచి తొలుచుకుంటూ వస్తున్నారు."

అది తెలుసుకోవడం అసాధ్యం కాదు. కానీ ప్రస్తుత పరిస్థితులలో చాలా కష్టం. కారణం గత పది సంవత్సరాలుగా అధికారం వెలగబెడుతున్న బిజెపి సర్కార్ అబద్ధాలతో, అసత్యాలతో, ఉద్వేగాలతో, విద్వేషాలతో తప్పుడు సమాచారంతో దేశాన్ని మొరటుగా వందల సంవత్సరాల వెనక్కి నడిపిస్తున్నది. స్వాతంత్ర్య ఉద్యమం వెలికి తీసిన సమస్యల పరిష్కారానికి, స్వాతంత్ర్యానంతరం జరుగుతున్న (అందులో అనేక లోపాలున్నప్పటికీ) ప్రయత్నాలు అన్నింటిని అడ్డం కొట్టి దేశాన్ని పచ్చి మితవాద ఫాసిస్టు తరహా పరిష్కారాల వైపు లాగేస్తున్నది. పార్లమెంటరీ ప్రజాస్వామ్యం, దానికి ప్రాణవాయువు అందించే లౌకికతత్వం జవసత్వాలనిచ్చే సామాజిక న్యాయంపై ఈ మనువాదులు ముప్పేట దాడికి దిగారు. ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టడానికి, భారత రాజ్యాంగంలో పొందుపరచిన వ్యవస్థలన్నింటినీ హిందుత్వ శక్తులు తొలిచేస్తున్నాయి.

తిరోగమనం దిశగా ...

60 సంవత్సరాలు బిజెపి యేతర బూర్జువా పార్టీల ప్రభుత్వాలు దేశానికి చేసిన నష్టానికి పదింతలు నష్టం ఈ తొమ్మిదేళ్ల బిజెపి పాలనలో జరిగింది. దీని నుంచి దృష్టి మళ్లించేందుకు ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టడం దానికి తెలిసినంతగా మరే ఇతర పాలక పార్టీకి తెలియదు. అది ఒక ఫాసిస్టు కళ. అధికారంలోకి రాగానే ప్రణాళికా సంఘాన్ని రద్దు చేసింది. దాని స్థానంలో నీతి ఆయోగ్‌ని కూర్చోబెట్టారు. జాతీయ గణాంకాల కమిషన్ (ఎన్ఎస్‌సి) రూపొందించిన గణాంకాలను తారుమారు చేస్తున్నదని ఆ సంస్థ ఛైర్మన్, ఇతర సభ్యులు 2019లో రాజీనామా చేశారు. ఈ సంస్థ క్రమానుగతంగా చేసే శ్రామికశక్తి సర్వే-2018ని నిరుద్యోగం పెరుగుతుందని చూపించినందుకు నిలిపివేశారు. తాజాగా జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే (ఎన్ఎఫ్‌హెచ్ఎస్) ద్వారా ఆరోగ్య శాఖకి సమాచారం అందిస్తున్న ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ పాపులేషన్ సైన్సెస్ డైరెక్టర్‌గా ఉన్న కె.ఎస్. జేమ్స్‌ను పదవి నుండి తొలగించారు. కారణం ఆ సంస్థ 2019-21 మధ్య మోడీ ప్రభుత్వం బహిరంగ మలవిసర్జన జరిగే గ్రామాలు లేవని చేసిన ప్రకటనను తప్పుపడుతూ ఇప్పటికీ 19శాతం గ్రామాలకు మరుగుదొడ్ల సౌకర్యంలేదని ప్రకటించింది. అలాగే గ్రామీణ కుటుంబాలలో రక్తహీనత పెరిగిందని, 57శాతం కుటుంబాలకి ఎల్పీజి గ్యాస్ అందడం లేదని తేల్చి చెప్పింది. ఈ విధంగా ప్రభుత్వ ప్రచార బండారం వివిధ రూపాలలో ప్రజలకు తెలుస్తున్నది. నీతి ఆయోగ్ 29 రకాల ప్రపంచ సూచికలకి సమాచారం తెలియజేయాలని సంకల్పించింది. ఒకటి, రెండు మినహాయిస్తే అన్ని సూచికలలో భారతదేశ పరిస్థితి మోడీ తొమ్మిదేళ్లలో అధోగతిలో పయనిస్తున్నదని స్పష్టం కావడంతో కంగుతిన్నది. వాస్తవాల కన్నా ప్రతిష్ఠ పెంచుకోవడానికి ప్రాధాన్యత నివ్వాలని సూచించింది. అందుకు అనుగుణంగా గణాంకాలు తయారు చేసే కార్యక్రమాలు ప్రారంభించారు. దేశమంతా బీసీ జనగణన కోరుతుంటే అసలు పది సంవత్సరాలకు జరగాల్సిన జనగణన ప్రక్రియనే ఎత్తేశారు.

ఈ బండారమంతా బయట పెడుతూ ప్రముఖ రచయిత, ఆర్థిక రాజకీయ విశ్లేషకులు ఆకార్ పటేల్ తన 500 పేజీల గ్రంథం "ప్రైస్ ఆఫ్ ది మోడీ ఇయర్స్"లో 58 రకాల అంతర్జాతీయ సూచికలను తీసుకొని విశ్లేషించారు. ఇందులో మానవ అభివృద్ధి, మతపరమైన ఆంక్షలు, పౌర హక్కులు, శాంతిభద్రతలు, పత్రికా స్వేచ్ఛ, వాక్ స్వాతంత్రం, మేధావి వర్గంపై దాడులు, అణచివేతలు, బహుళత్వం, రాజకీయ సంస్కృతి, పాలనలో ప్రజల భాగస్వామ్యం, అవినీతి, నేరాలు, ఎన్నికల ప్రక్రియ వంటి అనేక అంశాలను పరిశీలించడం జరిగింది. అన్నింటిలోనూ ఈ తొమ్మిది సంవత్సరాల బిజెపి పాలన దేశాన్ని దిగజారుస్తున్నదని తేలుతున్నది. ప్రజాస్వామ్యం, పత్రికా స్వేచ్ఛ, మానవ హక్కుల వంటి వాటిలో మన దేశం శ్రీలంక, పాకిస్తాన్‌ల కంటే వెనకబడటం చిన్న విషయం కాదు. అలాగే పేదరికం, ఆకలి, మహిళలలో రక్తహీనత, తలసరి ఆదాయం వంటి వాటిలో కూడా మనం అట్టడుగుకి చేరాము. డెమోక్రసీ ఇండెక్స్ భారతదేశాన్ని "విఫలమైన ప్రజాస్వామ్యం" (ఫ్లాఫ్ డెమోక్రసీ)గా వర్ణించింది. ఎందుకంటే 2015 నుండి భారత దేశంలో ప్రజాస్వామ్య విధానాలన్నీ తీవ్రమైన ఒత్తిడికి గురవుతున్నాయి. మోడీ ప్రభుత్వంలో అన్ని రంగాల్లోనూ మత జోక్యం పెరిగింది. ముస్లిం వ్యతిరేక భావాలు విస్తరిస్తున్నాయి. దీనితో భారతదేశం యొక్క రాజకీయ రంగం పూర్తిగా దెబ్బతిని పోయిందని ఆ సంస్థ పేర్కొన్నది. సిలికాస్ డాట్ ఆర్గ్ అనే సంస్థ భారతదేశాన్ని "ప్రజల్ని అణిచివేచే దేశం"గా పేర్కొంది. కారణం భారతదేశంలో పౌర స్వేచ్ఛ తీవ్రంగా దెబ్బతింటున్నది. భావ ప్రకటన స్వేచ్ఛను దెబ్బతీస్తూ అనేక నిర్బంధ చట్టాలని మోడీ ప్రభుత్వం తీసుకు వస్తున్నదని ఆ సంస్థ ప్రకటించింది. అలాగే యాక్సెస్ నౌ ఆర్గ్ అనే సంస్థ భారత దేశంలో ప్రజల నోరు నొక్కడానికి "ఇంటర్నెట్ బ్లాక్ చేయడం" ఒక విధానంగా మారింది అని చెప్పింది. కాశ్మీర్లో 17నెలలు, ఢిల్లీ రైతాంగ పోరాటంపై సంవత్సరం పాటు ఇంటర్నెట్ నిలిపివేయడం జరిగింది. 2014లో ఆరుసార్లు షట్‌డౌన్ జరిగితే 2020లో మోడీ ప్రభుత్వం 19సార్లు నిర్వహించింది. ఇప్పుడు మణిపూర్‌లో అదే జరుగుతున్నది. ప్రపంచ ఆకలి సూచికలో 2014లో 76 దేశాలకు గాను 55వ దేశంగా ఉన్న భారత్, మోడీ ప్రభుత్వం పుణ్యాన 107దేశాలలో 101వ స్థానానికి పడిపోయింది. మనం ఈ విషయంలో పాకిస్థాన్, బంగ్లాదేశ్, నేపాల్ కన్నా వెనకబడి ఉండటం దుర్మార్గం. మరో సూచిక భారతదేశంలో ఎన్నికలు స్వేచ్ఛగా జరుగుతున్నట్లు కనపడుతున్నా అక్కడ పార్లమెంటరీ ప్రజాస్వామ్యం కన్నా నియంతృత్వ ఎన్నికల విధానం నడుస్తున్నదని ప్రకటించింది. ఈ విధంగా అన్ని రంగాలలో మన దేశం మోడీ విధానాల వలన తీవ్రంగా దిగజారుతున్నా రకరకాల ఉద్వేగ భరిత అంశాల చుట్టూ, వేల కోట్ల రూపాయల ప్రచార ఆర్భాటంతో ప్రజల దృష్టిని మరలుస్తున్నది. గత ప్రధాని మన్మోహన్‌సింగ్ అన్నట్లు "మోడీ ప్రధానిగా ఈ దేశానికి ఓ పెద్ద విధ్వంసం" అన్నది నిరూపితం అవుతున్నది.

గుణ పాఠాలు - కర్తవ్యాలు

నేడు 77వ స్వాతంత్రదినోత్సవం. దీని వెనకాల గడచిన 77సంవత్సరాల స్వతంత్ర భారత చరిత్ర ఉంది. అంతకుముందు నడిచిన 200 సంవత్సరాల స్వాతంత్ర్య పోరాట చరిత్ర ఉంది. ఓ లెక్క ప్రకారం 1857 ప్రథమ స్వతంత్ర సంగ్రామం నుండి 1947 ఆగస్టు 15 మధ్యలో 3కోట్ల 50లక్షల మంది స్వాతంత్ర్య పోరాటంలో మరణించారు. దేశ విభజన సందర్భంగా జరిగిన మతమారణకాండలో ఒక్క సంవత్సరంలోనే 10లక్షల మంది ఊచకోత కోయబడ్డారు. కోట్లాది మంది భారతీయుల బలిదానం వృధా కాకూడదు. వారందరూ కోరుకున్నది, ఈ దేశంలో ఒక ప్రజాతంత్ర, గణతంత్ర రాజ్యం రావాలని. 1857 ప్రథమ స్వతంత్ర సంగ్రామం అణిచివేయబడిన తరువాత మూడు దశాబ్దాల అనంతరం ఏర్పడిన కాంగ్రెస్ పార్టీ నాయకత్వాన ప్రజాతంత్ర రిపబ్లిక్ వైపు అడుగులు పడ్డాయి. మరో మూడు దశాబ్దాల తర్వాత సోషలిస్టు రిపబ్లిక్ స్థాపన ద్వారానే ప్రజల సమస్యలకు శాశ్వత పరిష్కారం దొరుకుతుందని కమ్యూనిస్టు పార్టీ ప్రకటించింది. ఆ విధంగా భారతదేశం లౌకిక, ప్రజాతంత్ర, గణతంత్ర రాజ్యంగా రూపొందించడంలో సోషలిస్టు భావాలు, విధానాల ప్రభావం కూడా పెద్ద ఎత్తున పడింది. అందుకు రష్యాలో అత్యంత ఆదర్శవంతంగా నిర్మితమవుతున్న సోషలిస్టు వ్యవస్థ కూడా ఓ బలమైన కారణం.

బ్రిటిష్ సామ్రాజ్యవాదుల కుట్రల ఫలితంగా వారికి వ్యతిరేకంగా వీరోచితంగా పోరాడిన భారతదేశం 1947 ఆగస్టు 15తో రెండు ముక్కలైంది. పాకిస్తాన్ ముస్లిం మత రాజ్యాంగా అవతరించింది. దానికి ప్రతిగా భారతదేశం హిందూ రాజ్యం కావాలని ఆర్ఎస్ఎస్ ఉబలాటపడింది. కానీ, కాంగ్రెస్, కమ్యూనిస్టులే కాకుండా దేశంలో ఉన్న రాజకీయ పార్టీలు, సంస్థలు, మేధావులు, నిజానికి అశేష ప్రజానీకం ఈ దేశం మతరాజ్యం కాకూడదని, ఇది ఒక లౌకిక రాజ్యంగా ఉండాలని, అప్పుడే ఆధునిక ప్రపంచంలో దేశం సముచిత స్థానం సంపాదించగలుగుతుందని, వేగంగా అభివృద్ధి చెందగలుగుతుందని బలంగా కోరుకున్నారు. తాత్కాలికంగా తమ వాదనకు బలం రాలేదని ఆర్ఎస్ఎస్ నక్కి కూర్చుంది. నంగి నంగిగా తాము రాజ్యాంగాన్ని అంగీకరించమని, జాతీయ పతాకాన్ని అంగీకరించమని, మనస్మృతి ప్రస్తావన లేదు కాబట్టి రాజ్యాంగం మెజారిటీ మతస్తులైన హిందువులకు ఆమోదయోగ్యం కాదని ప్రకటించింది. ఇప్పుడు అనేక కారణాల రీత్యా బలం పుంజుకున్న ఆర్ఎస్ఎస్ హిందుత్వ ఫాసిస్ట్ శక్తులు తాము 70ఏండ్ల క్రితం చెప్పిన మాటలను నిజం చేయబూనుకుంటున్నాయి. ప్రముఖ చరిత్ర విశ్లేషకులు ప్రొఫెసర్ ఐజాజ్ అహ్మద్ చెప్పినట్లు "వీరు రాజకీయ వ్యవస్థని, రాజ్యాంగాన్ని, లోపల నుంచి తొలుచుకుంటూ వస్తున్నారు."

ఈ శక్తులను అంతం చేయాలి.

ఈరోజు మనం చూస్తున్న హిందూత్వ ఫాసిస్టు శక్తులను తిప్పికొట్టడం ద్వారానే మన దేశం సర్వతోముఖాభివృద్ధి జరుగుతుంది. తరతాలుగా మనదేశ అభివృద్ధికి ఆటంకంగా తయారైన ఈ మనువాద సంస్కృతి, కుల వ్యవస్థ, అది వెదజల్లుతున్న విషపూరిత భావజాలం శాశ్వతంగా అంతం కావాలి. అందుకు లౌకికవాదులు, ప్రజాతంత్ర వాదులు, దేశభక్తియుత జనం, కర్ణాటకలోలా పౌర సమాజం ఒక్కటి కావాలి. పోరుబాట పట్టాలి. ఎన్నికలలో బిజెపిని ఓడించినంత మాత్రాన హిందుత్వ నశించదు. రచయితలు, కవులు, సామాజిక కార్యకర్తలు, మేధావుల పరిరక్షణకు, వారికి మద్దతుగా అశేష కార్మిక ప్రజానీకాన్ని, కార్మిక కర్షక జనాన్ని కదిలించాలి. లేకుంటే మన దేశాన్ని ఈ శక్తులు హిందూ తాలిబన్‌ల రాజ్యంగా మారుస్తాయి. వారి ప్రతి అడుగులోనూ ఇది నిరూపితం అవుతున్నది.

జనవాక్యం

ఇది స్వాతంత్ర దినోత్సవం కాదు - హక్కుల హననోత్సవం

స్వతంత్ర దినోత్సవం కాదు ప్రభుత్వ పాలనాపరంగా హత్యల దినోత్సవం ఆగస్టు15. మణిపూర్ మారణహోమం ప్రభుత్వపరంగా, అధికారయుతంగా భారత బిడ్డలు ఒకరిని ఒకరు భయంకరంగా హతమార్చుకునే దృశ్యాలు. ఢిల్లీ సర్కారు రాక్షస పాలనకు పరాకాష్ట. రోమ్ నగరం మంటల్లో తగలబడిపోతుంటే నీరో చక్రవర్తి ఫిడేల్ వాయించుకున్నాడట. అలాగే ఢిల్లీ సర్కారు తన ప్రకటనల మద్దెల వాయించుకుంటోంది. అక్కడి ప్రజల హాహాకారాలు మారుమోగుతుంటే ఢిల్లీ కేంద్ర ప్రభుత్వానికి చీమకుట్టినట్టు కూడా లేదు. ఇది ఆగస్టు 15 స్వతంత్రదినోత్సవమా? కాదు. అక్షరాలా భారత ప్రజల గోడు. సంతాప దినోత్సవం, ప్రపంచ దేశాలు కూడా ఈ స్థితికి గగ్గోలు పెడుతున్నాయి. అయినా పాలకులకు లెక్కలేదు. అక్కడి ప్రజల హాహాకారాలు పసిపిల్లల ఆర్తనాదాలు, ఆకలిచావులు, అక్కడి శవాలమీద ప్రభుత్వ అధికారం హాయిగా సాగుతోంది. వినాశకాలే విపరీత బుద్ధి. ఇతిహాసంలో నరకాసుర వధ సత్యభామ చేతిలో జరిగినట్టే ఈనాడు కూడా భారత మహిళలు నడుంబిగించి ఆదిశక్తుల వలే ఈ నరకాసురుడి పాలన అంతమొందిస్తారు. ఈ దుష్టపాలన ఇక సాగనివ్వరు. జాతిపిత మహాత్మ సందేశం కూడా అదే. మహిళలు తలుచుకుంటే రెండు నెలల్లో ప్రభుత్వాన్ని కూల్చేయగలరు. ఉదాహరణకు గతంలో తెలుగు మహిళల సారా, మద్య వ్యతిరేక ఉద్యమం. ఆ ఫలితంగానే కాంగ్రెస్, తెలుగు దేశం ప్రభుత్వాలు కూలిపోయాయి. దేశంలో తమ బిడ్డల బంగారు భవిత కోసం భారత మహిళా లోకం తమ విశ్వరూపం చూపుతోంది. జాతిపిత ఆశించిన నిజమైన స్వతంత్ర భారతాన్ని సాధిస్తుంది. అదే స్త్రీ శక్తి అనేది రుజువు అవుతుంది.

- అల్లూరి మన్మోహిని

స్వాతంత్య్ర దినోత్సవానికి విస్తృత భద్రతా ఏర్పాట్లు

- ఎర్రకోట చుట్టూ 10 వేల మందితో పహారా

న్యూఢిల్లీ : స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా దేశ రాజధాని ఢిల్లీలో విస్తృత స్థాయిలో భద్రతా ఏర్పాట్లు చేశారు. ప్రధానంగా వేడుకలు జరిగే ఎర్రకోట, దాని పరిసర ప్రాంతాల్లో 10 వేలకు మందికి పైగా భద్రతా సిబ్బందిని మోహరించారు. ఎర్రకోటపై నుంచి జెండా ఎగురవేసిన అనంతరం ప్రధాని మోడీ జాతిని ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ఎర్రకోట చుట్టూ ముఖ గుర్తింపు, వీడియో విశ్లేషణ వ్యవస్థతో కూడిన వెయ్యికి పైగా కెమెరాలను ఏర్పాటు చేశారు. మంగళవారం 77వ స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా సోమవారం ఢిల్లీ పోలీసు అధికార ప్రతినిధి మాట్లాడుతూ 'ఢిల్లీ పోలీసులు అప్రమత్తంగా ఉన్నారు. అన్ని భద్రతా ఏర్పాట్లు పూర్తయాయి. నాలుగు నెలల ముందు నుంచే ఈ ఏర్పాట్లను ప్రారంభించాం' అని తెలిపారు. భద్రతా ఏర్పాట్లలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగిస్తున్నట్లు చెప్పారు. ముఖ గుర్తింపు ఉన్న సిసిటివి కెమెరాలతోపాటు, యాంటీ-డ్రోన్ టెక్నాలజీను కూడా ఉపయోగిస్తున్నట్లు చెప్పారు. సోమవారం రాత్రి నుంచి ఢిల్లీలోకి భారీ వాహనాల ప్రవేశాన్ని నిషేధించినట్లు తెలిపారు.

ఎర్రకోట వద్ద మంగళవారం జరిగే స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలకు దేశం నలుమూలల నుంచి 1,800 మంది ప్రత్యేక అతిథులను కేంద్రప్రభుత్వం ఆహ్వానించింది. వీరిలో 55 మంది నర్సులు, వారి కుటుంబ సభ్యులు కూడా ఉన్నారు. నర్సులతోపాటు వివిధ గ్రామాల సర్పంచులు, ఉపాధ్యాయులు, రైతులు, జాలర్లు కూడా ఉన్నారు. జ్ఞానపథ్‌లో జరిగే వేడుకలను సుమారు 20 వేల మంది అధికారులు, సామాన్య ప్రజలు ప్రత్యక్షంగా వీక్షిస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు.



స్వాతంత్ర దినోత్సవానికి ముస్తాబయిన విజయవాడలోని మున్సిపల్ స్టేడియం

స్వాతంత్య్ర వేడుకలకు సర్వం సిద్ధం

- విజయవాడలో జెండాను ఆవిష్కరించనున్న సిఎం జగన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో 77వ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. విజయవాడలోని ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియాన్ని రాష్ట్ర స్థాయి స్వాతంత్య్ర వేడుకలకు సిద్ధం చేశారు. రాష్ట్ర సచివాలయం, శాసనసభ, శాసనమండలి, రాష్ట్ర హైకోర్టుల ముందు మువ్వన్నెల జెండాలతో ఆకర్షణీయంగా అలంకరించారు. రాష్ట్రస్థాయి వేడుకలు అయిన ఇందిరా గాంధీ స్టేడియంలో మంగళవారం ఉదయం 9 గంటలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జాతీయ జెండాను ఎగురవేసిన అనంతరం సాయుధ దళాల నుండి గౌరవ వందనం స్వీకరిస్తారు. అనంతరం రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతారు. అంతకుముందు వెలగపూడిలోని సచివాలయంలోని మొదటి బ్లాక్ వద్ద 7:30 గంటలకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డి, ఉదయం 7:45 గంటలకు శాసనసభ ఆవరణలో శాసనమండలి ముందు మండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, 8:15 గంటలకు శాసనసభ ముందు శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం జాతీయ జెండాను ఎగురవేస్తారు. అలాగే నేలపాడులోని హైకోర్టు ఆవరణలో ఉదయం పది గంటలకు రాష్ట్ర హైకోర్టు చీఫ్ జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు.



ఎన్‌టిఆర్ జిల్లా నందిగామలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన 77 మీటర్ల జాతీయ జెండాతో నిర్వహిస్తున్న ఆజాది ర్యాలీ

ప్రాణాల్ని బలితీసుకోకండి

- నీట్‌ని రద్దు చేస్తాం : స్టాలిన్

చెన్నై : నీట్ పరీక్షల్లో అర్హత సాధించకపోవడంతో చెన్నైలోని విద్యార్థులు బలవన్మరణాలకు పాల్పడుతుండటంపై తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ ఆవేదన వ్యక్తం చేశారు. నీట్ పరీక్షల్లో అర్హత సాధించకపోవడంతో విద్యార్థి జగదీశ్వరన్ (19) శనివారం ఆత్మహత్యకు పాల్పడ్డారు. కొడుకు మరణం తట్టుకోలేక తండ్రి సెల్వశేఖర్ సైతం సోమవారం ఆత్మహత్యకు పాల్పడ్డారు. తండ్రీ కొడుకుల ఆత్మహత్యలపై తమిళనాడు సిఎం స్టాలిన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే చివరి నీట్ మరణాలు కావాలని కోరుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ నీట్ విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడవద్దని విద్యార్థుల్ని కోరారు. నీట్ రద్దు బిల్లుపై తాత్సారం చేస్తున్న ఆ రాష్ట్ర గవర్నర్ ఆర్‌ఎన్ రవిని స్టాలిన్ చురకంటించారు. వచ్చే ఎన్నికల్లో బిజెపి ఓటమిపాల్లె.. రాజకీయ మార్పులు చోటుచేసుకుంటే.. వాళ్లు ఎలాగూ నీట్ రద్దు బిల్లుకు అడ్డంకులన్నీ తొలగిపోతాయని స్టాలిన్ పేర్కొన్నారు. ఎట్టి పరిస్థితుల్లో ఎవరూ ఎలాంటి అఘాయిత్యాలకు పాల్పడవద్దని స్టాలిన్ విజ్ఞప్తి చేశారు. మీ ఎదుగుదలకు ఆటంకంగా ఉన్న నీట్ పరీక్ష కచ్చితంగా రద్దయి తీరుతుంది. అందుకోసం ప్రభుత్వం న్యాయపరమైన మార్గం ద్వారా ప్రయత్నాలు చేస్తోందని సిఎం స్టాలిన్ తెలిపారు. నీట్‌ని రద్దు చేస్తూ తమిళనాడు ప్రభుత్వం బిల్లును తీసుకురాగా.. ఆ బిల్లును గవర్నర్ ఆమోదించడం లేదు. నీట్ పరీక్ష కచ్చితంగా జరగాల్సిందేనని ఆయన పట్టుబడుతున్న సంగతి తెలిసిందే.

ఇళ్ల పట్టాల పోరాటం ఉధృతం

- పెనుకొండ సబ్‌కలెక్టర్ కార్యాలయం ముట్టడికి పిలుపుతో వామపక్ష నాయకుల ముందస్తు అరెస్టులు

ప్రజాశక్తి-పెనుకొండ

పెనుకొండలో ఇళ్లులేని పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సిపిఎం, వ్యకాస ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళనలు ఉధృతం అవుతున్నాయి. గత పది రోజులుగా పేదల ఇళ్ల పట్టాల కోసం సిపిఎం ఆధ్వర్యంలో పోరాటాలు కొనసాగుతూనే ఉన్నాయి. అధికారులు పోలీసుల చేత ఈ పోరాటాలను అణిచివేసేందుకు ప్రయత్నిస్తున్నా, నాయకులు వెనక్కు తగ్గడం లేదు. ఆందోళనల్లో భాగంగా సోమవారం నాడు పేదలతో కలిసి పెనుకొండ సబ్ కలెక్టర్ కార్యాలయం ముట్టడికి సిపిఎం నాయకులు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో పోలీసులు ముందస్తు అరెస్టులకు శ్రీకారం చుట్టారు. పెనుకొండ డివిజన్ వ్యాప్తంగా పలు మండలాల్లో సిపిఎం, వ్యకాస, ఇతర అనుబంధ సంఘాల నాయకులను ముందస్తు అరెస్టులు చేశారు. అర్ధరాత్రి సమయంలో పోలీసులు సిపిఎం నాయకుల ఇళ్ల వద్దకు వెళ్లి వారిని ముందస్తు అరెస్టు చేశారు. ఉత్తసాయం జిల్లా ఉపాధ్యక్షులు హరి, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పెద్దన్న, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్, సిపిఎం నాయకుడు వెంకటరాముడు, సోమందేపల్లి సిపిఎం మండల కార్యదర్శి రాజగోపాల్, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు అన్నమయ్య, చేనేత కార్మిక సంఘం మండల కార్యదర్శి చాంద్ బాషా తదితరులను అరెస్టు చేసి మడకశిర, అమరాపురం, చిలమత్తూరు పోలీసు స్టేషన్లకు తరలించారు. పేదల కోసం పోరాటాలు చేస్తుండగా ఇలా అధికారులు ముందస్తు అరెస్టుల పేరుతో సమస్యను పక్కదోవ పట్టించే ప్రయత్నం చేయడంపై సిపిఎం నాయకులు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు.

పార్శిళ్లు తెరవచ్చు

- పోస్టాఫీసు బిల్లులో కేంద్రం ప్రతిపాదన

న్యూఢిల్లీ : భారతీయ తపాలా కార్యాలయాల చట్టంలో కేంద్రం కొన్ని మార్పులు ప్రతిపాదించింది. దీనికి సంబంధించిన బిల్లును ఇటీవల ముగిసిన పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో రాజ్యసభలో ప్రవేశపెట్టింది. దీని ప్రకారం దేశ భద్రత, ప్రజల భద్రత దృష్ట్యా తపాలా అధికారులు ఏ పార్శిల్‌ను అయినా విప్పి చూడవచ్చు. దానిని కస్టమ్స్‌కు అందించవచ్చు లేదా పెట్టుకోవచ్చు. పార్శిల్ ఎక్కడ నుండి వచ్చినా అది అనుమానాస్పదంగా కనిపిస్తే తపాలా అధికారి దానిని విప్పి చూడవచ్చు. సేవలను అందించే క్రమంలో నష్టం జరిగినా, ఒకరికి బదులు వేరొకరికి బట్వాడా చేసినా, జాప్యం జరిగినా తపాలా కార్యాలయానికి కానీ లేదా అధికారిని కానీ బాధ్యుడిని చేయకూడదు. తపాలా కార్యాలయం నుంచి సేవలు పొందే ప్రతి వ్యక్తి వాటి కోసం రుసుము చెల్లించాల్సి ఉంటుంది. ఎవరైనా అందుకు నిరాకరించినా లేదా చెల్లింపులో నిర్లక్ష్యంగా వ్యవహరించినా రెవెన్యూ బకాయిలను ఎలా రాబట్టుకుంటారో అదే విధంగా ఆ వ్యక్తి నుండి రాబడతారు.

బెఫి అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా అనిల్, దేబాశిష్ బసు

చెన్నై : బ్యాంక్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (బెఫి) నూతన కార్యవర్గం ఎన్నికైంది. ఇక్కడ జరుగుతున్న 11వ జాతీయ సదస్సులో నూతన కార్యవర్గాన్ని సభ్యులు సోమవారం ఎన్నుకున్నారు. జాతీయ అధ్యక్షుడిగా ఎస్ఎస్ అనిల్ (కేరళ), ప్రధాన కార్యదర్శిగా దేబాశిష్ బసు చౌధురి (పశ్చిమ బెంగాల్), సందీప్ పాల్ (పశ్చిమ బెంగాల్) కోశాధికారిగా ఎన్నికయ్యారు. ఆఫీస్ బేరర్లుగా జైదీప్ దాస్ గుప్తా, ఆర్ అజయకుమార్, సి రాజీవ్ (కేరళ), సాజి ఓ వర్గీస్ (కేరళ), రంజన్ రాజ్, ప్రదీప్ శర్మ, సునీల్ రాజ్ పిఎస్ (వైస్ ప్రెసిడెంట్లు). మనోదీప్ ఘోష్, ఎస్ హరిరావు (కార్యదర్శులు) ఎన్నికయ్యారు.



బెఫీ అధ్యక్షులు ఎస్ఎస్ అనిల్ — ప్రధాన కార్యదర్శి దేబాశిష్ బసు చౌధురి

పేస్కేల్‌పై తొలగని ప్రతిష్టంభన

- విద్యుత్ అధికారులు, ఉద్యోగుల జెఎసి చర్చలు వాయిదా
- రేపు మరోసారి భేటీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యుత్ ఉద్యోగులు, ప్రభుత్వం మధ్య వేతన సవరణ ఒప్పందం (పిఆర్‌సి)పై ప్రతిష్టంభన నెలకొంది. రాష్ట్ర ప్రభుత్వం, ఉద్యోగుల జెఎసి మధ్య అంగీకారం కుదరకపోవడంతో చర్చలు మరోసారి వాయిదా పడ్డాయి. విద్యుత్‌శాఖ అధికారులు, ఉద్యోగ సంఘాల జెఎసి నాయకుల మధ్య పిఆర్‌సి అగ్రిమెంట్ సంతకాలపై సోమవారం జరిగిన చర్చల్లో ఏకాభిప్రాయం రాలేదు. ఉదయం నుంచి రాత్రి వరకు సుదీర్ఘ చర్చలు జరిగినా కొలిక్కి రాలేదు. ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె విజయానంద్, జెన్‌కో ఎమ్‌డి కెవిఎన్ చక్రధరబాబు, ఎపిసిపిడిసిఎల్ సిఎమ్‌డి జె పద్మజనార్ధన్ రెడ్డి, ట్రాన్స్‌కో జెఎమ్‌డి మల్లారెడ్డి, అడిషనల్ సెక్రటరీ శ్రీనివాసరావు, ఉద్యోగ సంఘాల జెఎసి నాయకులతో విద్యుత్ సౌధలో చర్చలు జరిపారు. ప్రభుత్వం నియమించిన మనోహ్మాన్‌సింగ్ పిఆర్‌సి ఏకసభ్య కమిషన్ ప్రతిపాదించిన పేస్కేల్‌లో మార్పులు చేయాలని జెఎసి నాయకులు అధికారులను కోరారు. ఇంక్రిమెంట్లు వస్తే వేతనాలు పెరుగుతాయని, కమిషన్ ప్రతిపాదించిన పేస్కేల్‌తో మాత్రం కోతలు పడుతున్నాయని అభ్యంతరం వ్యక్తం చేశారు. కొత్త ఇంక్రిమెంట్లు కాకుండా పాత వాటినే అమలు చేయాలని, అందుకు తగ్గట్టుగా కమిషన్ ప్రతిపాదించిన దానిలో మార్పులు చేసి అందరికీ ఇంక్రిమెంట్లు పెరిగేలా చేయాలని ప్రతిపాదించారు. కమిషన్ స్కేల్ కాకుండా జెఎసి నాయకులు సొంతంగా రూపొందించిన స్కేల్‌ను అధికారుల ముందు ఉంచారు. తాము ప్రతిపాదించిన స్కేల్ వల్ల విద్యుత్ సంస్థలపై అదనపు భారం కూడా ఉండదని వివరించారు. జెన్‌కో అలవెన్స్, మెడికల్, ఇతర అలవెన్స్ 2018 ప్రకారం కాకుండా కొత్త పిఆర్‌సి ప్రకారం ఇవ్వాలని కోరారు. అధికారులు మాత్రం కమిషన్ ప్రతిపాదించిన పే స్కేల్‌లో ఎలాంటి మార్పులు చేయబోమని చెప్పారు. రాత్రి 9:30 గంటల వరకు కూడా ఇరువురి మధ్య ఒప్పందం కుదరకపోవడంతో అంగీకార ప్రక్రియను వాయిదా వేశారు. మంగళవారం సెలవు కావడంతో బుధవారం మరోసారి చర్చిద్దామని అధికారులు తెలిపారు. ఈ సమావేశంలో విద్యుత్ ఉద్యోగుల జెఎసి ఛైర్మన్ పి చంద్రశేఖర్, కన్వీనర్ సాయికృష్ణ, కో ఛైర్మన్లు శేషారెడ్డి, శ్రీనివాసరావు, ఎఎస్ కుమార్, కో కన్వీనర్ ఎవి కిరణ్, సలహాదారు పివిఎస్ఆర్ మూర్తి, నాయకులు శ్రీనివాసరావు, ట్రెజరర్ టి పద్మావతి తదితరులు పాల్గొన్నారు.



దీక్షల్లో కూర్చున్న అయోధ్యరాం, స్టీల్‌ప్లాంట్ కార్మికులు

స్టీల్‌ప్లాంట్‌ను అమ్మే హక్కు ఎవరిచ్చారు ?

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

రాష్ట్రాభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను, జాతి సంపదైన ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మే హక్కు మోడీ సర్కారుకు ఎవరిచ్చారని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ కో - కన్వీనర్ జె.అయోధ్యరాం ప్రశ్నించారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారానికి 914వ రోజుకు చేరాయి. దీక్షల్లో స్టీల్ ఎంఎంఎస్‌ఎం, ఎస్‌టిఎం విభాగాల కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కు విషయంలో ఒంటెద్దు పోకడ వీడకుంటే తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. బిజెపి విధానాలు దేశంలోని ప్రజలను, కార్మికులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయని తెలిపారు. దేశంలో సంపదను సృష్టించలేని బిజెపి పాలకులు స్వాతంత్ర్యం అనంతరం ఎందరో మహానుభావాలు నెలకొల్పిన ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మేస్తుండడం దారుణమన్నారు. నాడు రూ.4900 కోట్ల పెట్టుబడితో నెలకొల్పిన విశాఖ ఉక్కు కర్మాగారం నేడు రూ.మూడున్నర లక్షల కోట్ల విలువకు చేరిందని, రూ.54 వేల కోట్లను ప్రభుత్వాలకు పన్నుల రూపేణా చెల్లించిన ఏకైక భారత ప్రభుత్వ రంగ సంస్థ అని వెల్లడించారు. అటువంటి పరిశ్రమను పోరాటాలతో రక్షించుకుంటామని స్పష్టం చేశారు. దీక్షల్లో డి.దేముళ్లు, జి.ఆనంద్, రమణ, ఆర్.సూరిబాబు, కెవి.రమణ, సింహాద్రి, మహమ్మద్, కృష్ణంనాయుడు పాల్గొన్నారు.



చిన్ని గుండెకు పెద్ద కష్టం

- అరుదైన వ్యాధితో బాధపడుతున్న చిన్నారి
- సాయం కోసం ఎదురుచూపులు

ప్రజాశక్తి - కవిటి (శ్రీకాకుళం జిల్లా)

ఏడు నెలల పాటు ఆడుతూ పాడుతూ కేరింతలు కొట్టిన ఆ చిన్నారికి అనుకోని ఆపద ఎదురైంది. లేకలేక కలిగిన తమ సంతానాన్ని చూసి మురిసిపోయిన ఆ తల్లిదండ్రుల మురిపెం మున్నాళ్ల ముచ్చటగానే మిగిలింది. కవిటి మండలం ప్రగడపుట్టుగకు చెందిన యాండ్రాపు చిరంజీవి, అంజలి దంపతుల తొమ్మిది నెలల కుమార్తె ఆద్య హెచ్ఎల్‌హెచ్ అనే అరుదైన వ్యాధితో బాధపడుతోంది. జూలైలో ఆద్యకు జ్వరం రావడంతో సోంపేటలోని ఒక ప్రయివేటు ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ ఫలితం లేకపోవడంతో, శ్రీకాకుళంలోని మరో ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో, ప్రస్తుతం విశాఖపట్నంలోని గాంధీ కేన్సర్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చిన్నారిని పరీక్షించిన వైద్యులు పాప హెచ్ఎల్‌హెచ్ అనే అరుదైన వ్యాధితో బాధపడుతున్నట్లు తేల్చారు. చికిత్సకు రూ.20 లక్షల వరకు ఖర్చవుతుందని, చికిత్స కూడా మూడు వారాల్లో చేయాలని చెప్పారు. దీంతో గ్రామ వాలంటీరుగా పనిచేస్తున్న ఆద్య తండ్రి చిరంజీవి దాతల సాయం కోసం ఎదురుచూస్తున్నాడు. ఇప్పటికే పాప వైద్యం కోసం రూ.మూడు లక్షలకు పైగా ఖర్చు చేశామని, ప్రస్తుతం అంత పెద్ద మొత్తం ఖర్చు చేసే ఆర్థిక స్తోమత తమకు లేదని చిరంజీవి వాపోతున్నాడు. దాతలు ఉదారంగా స్పందించి తమ బిడ్డకు ప్రాణదానం చేయాలని ప్రాధేయపడుతున్నాడు. ఫోన్ పే నంబరు 9515256362, ఎస్‌బిఐ అకౌంట్ నంబరు 11644708533, ఐఎఫ్‌ఎస్‌సి కోడ్ ఎస్‌బిఐఎన్ 0002742కు దాతలు ఆర్థికసాయం అందించాలని కోరుతున్నారు.

కాకి లెక్కలు



- ఆస్పత్రిలో ప్రసవిస్తే పేదరాలు కాదట
- బ్యాంక్ ఖాతా ఉన్నా అంతేనట
- లోపభూయిష్టంగా నీతి ఆయోగ్ అంచనాలు
- ఐరాస నివేదికతో వాస్తవాలు బట్టబయలు

న్యూఢిల్లీ : దేశంలో పేదరికం గణనీయంగా తగ్గిపోయిందని నీతి ఆయోగ్ విడుదల చేసిన ఓ నివేదికలో గొప్పగా ప్రకటించింది. ఆ నివేదిక ప్రకారం గత ఐదేళ్లలో దేశంలోని 13.5 కోట్ల మంది పేదరికం నుండి బయటపడ్డారు. దీనర్థం వారంతా ఇప్పుడు సుఖ సంతోషాలతో జీవిస్తున్నారని. అభివృద్ధి ఫలాలను అందుకుంటున్నారని, వారిప్పుడు దారిద్య్రరేఖకు దిగువన నివసించడం లేదని.

ఐక్యరాజ్యసమితి ఇటీవల విడుదల చేసిన ఓ నివేదిక ప్రకారం దేశంలోని 74% మంది ప్రజలకు ఇప్పటికీ ఆరోగ్యకరమైన ఆహారం అందుబాటులో ఉండడం లేదు. సరైన ఆహారమే లభించనప్పుడు పేదరికం నుంచి ఎలా బయటపడ్డట్టు? అసలు పేదరికాన్ని నిర్ణయించే పద్ధతి ఏమిటి? పేదరిక సూచికలు వాస్తవ పరిస్థితికి అద్దం పడుతున్నాయా? అనే విషయాలను పరిశీలిస్తే వాస్తవాలు అవగతమవుతాయి. దేశంలో వినియోగ పేదరిక రేఖకు దిగువన ఎంత మంది ఉన్నారో? జనాభాలో వారి వాటా ఎంత? అనే ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానం ఇవ్వడం లేదు. ప్రపంచ దేశాలలో పేదరికాన్ని అంచనా వేయడానికి దశాబ్దాలుగా వినియోగ పేదరిక రేఖనే పరిగణనలోకి తీసుకుంటున్నారు. గత నాలుగు దశాబ్దాలుగా మన దేశంలో కూడా ఈ పద్ధతినే అనుసరిస్తున్నారు. 2017-18లో జాతీయ సర్వే సంస్థ (ఎన్ఎస్ఓ) వినియోగ వ్యయ సర్వేను నిర్వహించింది. దానిని ప్రభుత్వం ఇప్పటి వరకూ విడుదల చేయలేదు. 2022-23, 2023-24 సంవత్సరాల్లో కూడా ఇలాంటి సర్వేలే నిర్వహిస్తున్నట్లు ఎన్ఎస్ఓ ప్రకటించింది. గత పది సంవత్సరాలలో వినియోగ పేదరికం ఎలా ఉన్నదో ఈ సర్వేలలో తేలవచ్చు. నీతి ఆయోగ్ మాత్రం హడావిడిగా మల్టీడైమెన్షనల్ పావర్టీ ఇండెక్స్ (ఎంపిఐ)ని విడుదల చేసింది. దానికి కొద్ది రోజుల ముందు ప్రపంచ ఎంపిఐ అంచనాలు విడుదలయ్యాయి.

12 సూచికలతో...

ప్రపంచ ఎంపిఐ అంచనాల కోసం పది వేర్వేరు సూచికలను పరిగణనలోకి తీసుకున్నారు. వీటిలో విద్య, ఆరోగ్యం, విద్యుత్, తాగునీరు, పారిశుధ్యం, వంటగ్యాస్, ఇంటి గచ్చు, వినియోగ వస్తువుల వంటి సూచికలు ఉన్నాయి. వేర్వేరు సూచికలను కలగలిపి, ఓ సూచికను నిర్ణయించడం లోపభూయిష్ట విధానమేనని చెప్పాలి. ఇక దేశంలో ఎంపిఐని అంచనా వేయడానికి 12 సూచికలను పరిగణనలోకి తీసుకున్నారు. ప్రపంచ ఎంపిఐ కోసం తీసుకున్న పది సూచికలతో పాటు గర్భిణుల ఆరోగ్యం, బ్యాంక్ ఖాతాలను కూడా చేర్చారు. అంతర్జాతీయ ఎంపిఐ నివేదిక ప్రకారం 2005-06లో మన దేశంలో పేదరికం జనాభాలో 54% ఉంటే 2015-16 నాటికి 27.9%కి తగ్గిపోయింది. అది 2019-20 నాటికి మరింత తగ్గి 16%గా నమోదైంది.

6-14 ఏళ్ల పిల్లలకు చోటు లేకుండా...

మన దేశంలో ఎంపిఐ అంచనాలు ఎంత లోపభూయిష్టంగా ఉన్నాయో పరిశీలిద్దాం. పౌష్టికాహార సూచికలో 6-14 సంవత్సరాల మధ్య వయసున్న వారిని పరిగణనలోకి తీసుకోలేదు. దేశ జనాభాలో వీరు 18% పైగానే ఉన్నారు. ఈ వయసు వారిలో మూడింట రెండు వంతుల మంది రక్తహీనతతో బాధపడుతున్నారు. దీనిని బట్టి చూస్తే సూచికలో అనేక మంది పేదలను లెక్కలోకే తీసుకోలేదని అర్థమవుతుంది. పైగా మన దేశంలో వయసుకు తగిన బరువు ఉండాలని అంటుంటే అనేక దేశాలలో వయసుకు తగిన ఎత్తు ఉండాలని చెబుతున్నారు. ఇటీవల ఐక్యరాజ్యసమితి విడుదల చేసిన నివేదిక ప్రకారం మన దేశంలో 104.3 కోట్ల మంది (74.1%) ఆరోగ్యవంతమైన ఆహారాన్ని పొందలేక పోతున్నారు.

వీరు పేదలు కారంటే ఎలా?

గర్భిణుల ఆరోగ్యాన్ని సూచికగా తీసుకోవడం కూడా సరి కాదు. ఉదాహరణకు వృత్తి నైపుణ్యం లేని ఆరోగ్య సిబ్బంది గర్భిణికి ప్రసవం చేసినా లేదా ప్రసవానికి ముందు ఆమెకు అవసరమైన నాలుగు ఆరోగ్య సంరక్షణ సేవలు అందకపోయినా ఆమెను పేదరాలిగా పరిగణించారు. మన దేశంలో 80%కి పైగా ప్రసవాలు ఆస్పత్రులలోనే జరుగుతున్నాయి. అంత మాత్రాన వారిని పేదవారు కారంటే ఎలా? ఈ విధంగా తప్పుడు సూచికలతో సర్వేలు నిర్వహిస్తే వాస్తవ చిత్రం ఎలా తెలుస్తుంది?. ఇంకో ఆశ్చర్యకరమైన సూచిక కూడా ఉంది. బ్యాంక్ లేదా పోస్టాఫీసులో ఖాతా లేని వారినే పేదవారిగా పరిగణించారు. ఓ సర్వే ప్రకారం దేశంలోని ప్రతి పది మందిలో తొమ్మిది మందికి ఆ తరహా ఖాతాలు ఉన్నాయి. బ్యాంక్ లేదా పోస్టాఫీసులో అకౌంట్ ఉన్నంత మాత్రాన వారిలో పేదలు ఉండరా?

అసలు దేశంలో ఎంతమంది జనాభా ఉన్నారో కచ్చితమైన సమాచారం లేదు. 2011లో జరిగిన జనగణనలో వచ్చిన సమాచారాన్ని ఆధారంగా చేసుకొని ఇప్పుడు జనాభాను అంచనా వేస్తున్నారు. దీనిని బట్టి సహజంగానే 2015-16లో కంటే 2021లో జనాభా అధికంగా ఉంటుంది. మరి 2021లో ఎంతమంది పేదలు ఉన్నారో నిర్ధారించాలంటే ఆ సంవత్సరంలో దేశ జనాభా ఎంతో కచ్చితంగా తెలియాలి కదా? జనాభా సంఖ్య ఎంతో తెలియకుండా దేశంలో పేదరికం తగ్గిపోయిందని ఎలా చెబుతారు? పైగా నీతి ఆయోగ్ నివేదిక చూస్తుంటే 2015-16లోనూ, 2021లోనూ దేశ జనాభా ఒకేలా ఉన్నదని చెబుతోంది. దాని ఫలితంగానే 13.5 కోట్ల మంది పేదరికం నుండి బయటపడ్డారని అంచనా వేసింది. ఒకవేళ 2021 జనాభా (అంచనా) ఆధారంగా 2019-21 కాలానికి ఎంపీఐ అంచనాలు వేశారని అనుకున్నా 41 కోట్ల మంది ప్రజలకు ఇప్పటికీ సరైన పారిశుధ్య సౌకర్యాలు అందుబాటులో లేవు. అయినప్పటికీ మోడీ ప్రభుత్వం భారత్‌ను ఒడిఎఫ్ దేశంగా ప్రకటించేసింది.

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దిగజారడానికి కారకులెవరు? : యనమల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దిగజారడానికి కారకులెవరని శాసనమండలి ప్రతిపక్ష నేత, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు ప్రశ్నించారు. ఆర్థిక పరిస్థితి ఏడాదికేడాదికి దిగజారుతోందని చెబుతున్నా సిఎం జగన్ పెడచెవిన పెట్టారని సోమవారం ఒక ప్రకటనలో విమర్శించారు. రాష్ట్ర ఫ్రాంక్ డెట్‌ట్రాప్‌లోకి వెళ్లిందని నాలుగేళ్లుగా ఎవరు చెప్తున్నా ప్రతిపక్షాలపై విరుచుకుపడటం తప్ప ఏమాత్రం దిద్దుబాటు చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు. ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అవాస్తవ ఆర్థిక పరిస్థితిని విశ్లేషించకుండా పదేపదే అబద్ధాలను వల్లెవేస్తున్నారని విమర్శించారు. డాయిష్ బ్యాంకు ముఖ్య ఆర్థిక వేత్త కౌశిక్ దాస్ చేసిన సర్వేకు వైసిపి నేతలు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. ఆర్థిక పరిస్థితి విషయంలో దేశంలో 11వ స్థానానికి పడిపోవడానికి జగన్ అసమర్థత కారణం కాదా అని ప్రశ్నించారు. విద్యుత్ వినియోగదారులపై రూ.57వేల కోట్ల భారాలు వేసి ఇష్టానుసారం దోచుకున్న జగన్ నేడు విద్యుత్ ఉద్యోగుల నిధులపై పడ్డారని విమర్శించారు. మద్యం బాండ్ల విధంగా ఇప్పుడే విద్యుత్ ఉద్యోగుల పిఎఫ్, పెన్షన్ నిధులను అటాచ్ చేస్తున్నారని, ఈ హక్కు ఎవరిచ్చారని ప్రశ్నించారు. పర్చూరు నియోజకవర్గంలో అక్రమంగా ఓట్లు తొలగింపు జరుగుతోందని ఆ నియోజక వర్గ ఎమ్మెల్యే ఏలూరు సాంబశివరావు కేంద్ర ఎన్నికల సంఘానికి సోమవారం లేఖ రాశారు. టిడిపి సానుభూతి పరుల ఓట్లను తొలగించడానికి అధికార పార్టీ నాయకులు అధికారం దుర్వినియోగానికి పాల్పడుతున్నారని, అధికారులపై ఒత్తిడి చేస్తూ నిబంధనలను ఉల్లంఘిస్తున్నారని తెలిపారు.

నుహ్‌లో ఇంటర్నెట్ సేవలను పునరుద్ధరించిన అధికారులు

చండీగఢ్ : హర్యానాలోని నుహ్ జిల్లాలో ఇంటర్నెట్ సేవలను పునరుద్ధరించారు. ఆదివారం అర్ధరాత్రి నుండి ఇంటర్నెట్‌ను పునరుద్ధరించినట్లు పోలీసులు తెలిపారు. జులై 31న నుహ్ జిల్లాలో విశ్వ హిందూ పరిషత్ (విహెచ్‌పి) చేపట్టిన ఊరేగింపు మత ఘర్షణలకు దారితీసిన సంగతి తెలిసిందే. దీంతో నుహ్ జిల్లాతో పాటు గురుగ్రామ్‌లో కూడా హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనలో ఇద్దరు హోంగార్డులు, ఇమామ్ సహా ఆరుగురు మరణించారు. దీంతో జులై 31 నుండి ఆగస్టు 8 వరకు ఇంటర్నెట్ సేవలను నిలిపివేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. అనంతరం ఈ నిలిపివేతను ఆగస్టు 13 వరకు పొడిగించారు.

కోడి గుడ్డుపై గాంధీ చిత్రం



ప్రజాశక్తి- కవిటి (శ్రీకాకుళం జిల్లా)

జాతిపిత మహాత్మా గాంధీజీ, భారతదేశ చిత్రపటాలను కోడిగుడ్డుపై చిత్రించిన కవిటి మండలం కుసుంపురం పంచాయతీ కార్యదర్శి కొప్పల్ల రవి ఔరా అనిపించారు. మొదటి నుంచి చిత్రలేఖనంపై ఆసక్తి ఉన్న రవి తనలోని దేశ భక్తిని ఇలా కోడిగుడ్డుపై ప్రతిబింబించి ఆకట్టుకున్నారు.

(మొదటి పేజీ తరువాయి)

అభివృద్ధే లక్ష్యం

సాగుతోందన్నారు జి-20 దేశాల్లో భారతదేశ పాత్రను ఆమె ఈ సందర్భంగా పేర్కొన్నారు. విద్యా, శాస్త్ర రంగాల్లో ముందంజ వేస్తున్నామని అన్నారు. జాతీయ విద్యా విధానం, 2020ని, చంద్రయాన్-3 విజయవంతంగా ప్రయోగించడాన్ని ఆమె ప్రస్తావించారు. చంద్రయాన్‌ను విజయవంతంగా ప్రయోగించడంలో ఇస్రో శాస్త్రవేత్తల కృషిని ఆమె కొనియాడారు. మహిళా సాధికారతకు ప్రాధాన్యతనివ్వాల్సిందిగా కోరారు. ఇందుకోసం స్థానిక, జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో కృషి జరగడం చాలా అవసరమని అన్నారు. మన రాజ్యాంగమే మనకు మార్గదర్శి పత్రమని వ్యాఖ్యానించారు. మన జాతి నిర్మాతలు కన్న కలలను సాకారం చేసేందుకు సామరస్యత, సోదర భావంతో కలిసిమెలిసి మనందరం ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. వాతావరణ మార్పులపై అత్యవసరంగా శాస్త్రవేత్తలు, విధానకర్తలు దృష్టి పెట్టాలని ఆమె కోరారు.

పర్యావరణ ప్రయోజనాల కోసం స్థానిక, జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో కృషి జరగడం చాలా అవసరమని అన్నారు. ఆదివాసీలు తమ ఆచార సాంప్రదాయాలను మరింత పరిపుష్టం చేసుకుంటూనే మరోవైపు ఆధునిక భావజాలాన్ని అలవరుచుకోవాలని ముర్ము పిలుపునిచ్చారు. సమాజంలో అణచివేతకు గురైన వారికి ప్రాధాన్యతనివ్వడమనేది మనం అనుసరించే విధానాల ఏకైక మూల సూత్రమని అన్నారు. ఫలితంగానే గత దశాబ్ద కాలంలో పెద్ద సంఖ్యలో ప్రజలు దారిద్ర్యం నుండి బయటపడ్డారని అన్నారు. అన్నదాతలకు దేశం రుణపడి వుందన్నారు. అభివృద్ధి లక్ష్యాలను, మానవతా సహకారాన్ని మరింత పెంపొందించడంలో భారత్ కీలకమైన పాత్ర పోషిస్తోందన్నారు.

అంతర్జాతీయ వేదికలపై కూడా తన సత్తా చాటుతోందన్నారు. మొత్తంగా ప్రపంచ జనాభాలో మూడింట రెండు వంతులు జి 20దేశాల్లోనే వున్నారని, అంతర్జాతీయ ప్రాధాన్యతలను, సరైన దిశలో పెట్టగలిగేందుకు ఇదొక విశిష్టమైన అవకాశమని, భారత్ దాన్ని సంపూర్ణంగా వినియోగించుకోవాలని అన్నారు. దేశ ప్రజలకు కులం,మతం, ప్రాంతాలుగా రకరకాల గుర్తింపులున్నప్పటికీ భారత పౌరులన్నది అన్నింటికి మించిన గుర్తింపని చెప్పారు.

(మొదటి పేజీ తరువాయి)

ఎపిలో 29 మందికి పోలీస్ మెడల్స్

(పోలీసు మెడల్ ఫర్ మెరిటోరియస్ సర్వీస్) పతకాలను ప్రకటించింది. అత్యున్నత రాష్ట్రపతి గ్యాలంట్రీ పోలీసు పతకం (పిపిఎంజి) సిఆర్‌పిఎఫ్ అధికారి లౌక్రకామ్ ఇబోంచా సింగ్‌కు ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్ నుంచి అదనపు డిజి శంకబ్రత బాగ్చికి రాష్ట్రపతి పోలీసు విశిష్ట సేవా పతకం (పిపిఎం) లభించింది. 18 మందికి పిఎంజి, 10 మందికి పోలీస్ విశిష్ట సేవా పతకాలు లభించాయి. విశిష్ట సేవా పతకాలు లభించిన వారిలో దాదిరెడ్డి మురళీధర్‌రెడ్డి (సిఐ, కర్నూల్ టౌన్), సింగులూరి వెంకటేశ్వరరావు (డిఎస్‌పి ఏలూరు), కొండపు ఆనంద రెడ్డి (డిసిపి విశాఖపట్నం సిటీ), సుంకర మునిస్వామి (రిజర్వ్ ఇన్‌స్పెక్టర్, మంగళగిరి), బెండి కాశీపతి (అసిస్టెంట్ రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్, విశాఖపట్నం), జమ్మలమడుగు నిసార్ అహ్మద్ బాషా (ఎఎస్‌ఐ), బెహరా నాగభూషణరావు (ఎస్ఐ), కన్నుజు వాసు (ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్, గుంటూరు), మదా సత్యనారాయణ (ఎఎస్‌ఐ), తోట బ్రహ్మయ్య, (డిఎస్‌పి) ఉన్నారు.

విద్యా బోధనలో అంతర్జాతీయ ప్రమాణాలు

పరిశీలించాలని తెలిపారు. పాఠశాల విద్యలోనూ అంతర్జాతీయ ప్రమాణాలతో మెరుగైన విద్యావిధానాలు ఉండాలన్నారు. దీనికోసం పరిశీలన, అధ్యయనం చేయాలని వివరించారు. విద్యార్థుల ప్రయోజనాలు నెరవేర్చేలా ఉండాలని, టెన్త్ అయినా, ఇంటర్మీడియట్ అయినా సర్టిఫికెట్ తీసుకుంటే వాటికి ప్రపంచంలో ఎక్కడైనా విలువైనదిగా ఉండాలన్నదే లక్ష్యమని తెలిపారు. సాధారణ ఆలోచనలతో కాకుండా మెరుగైన ఆలోచనలతోనే విద్యార్థులకు ఉజ్వల బవిష్యత్ అందించే ప్రక్రియ కొనసాగాలని సిఎం సూచించారు. విద్యార్థులు నేర్చుకున్నది జీవితంలో ప్రాక్టికల్‌గా ఉపయోగపడాలని, దానిని నిర్ధారించేలా ప్రశ్నాపత్రాలు ఉండాలని చెప్పారు. ఈ సందర్భంగా ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌పై అధికారులు సిఎంకు వివరించారు. ఈ సమావేశంలో విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ఉన్నతాధికారులు ప్రవీణ్‌ప్రకాష్, శ్యామలరావు, ఎస్.సురేష్‌కుమార్, కే.హేమచంద్రారెడ్డి, ఆర్థికశాఖ కార్యదర్శి వివి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వర్ష బీభత్సం

చిక్కుకుని ఐదుగురు మరణించారు. రెండు చోట్ల పెద్ద ఎత్తున సహాయ చర్యలు చేపట్టారు. ఎస్‌డిఆర్‌ఎఫ్, ఎన్‌డిఆర్‌ఎఫ్,ఐటిబిపిలతో పాటు రాష్ట్ర పోలీసులు ఈ కార్యక్రమాల్లో నిమగ్నమైనారు. శనివారం రాత్రి నుండి ఇక్కడ వర్షాలు ప్రారంభం కాగా, 18వతేది వరకు తీవ్ర స్థాయిలో కురిసే అవకాశం ఉందని ఐఎండి హెచ్చరించింది. హిమాచల్ ప్రదేశ్‌లోని 12 జిల్లాలకు గానే 9 జిల్లాల్లో భారీ నుండి అతిభారీ వర్షాలు కురిసే


అవకాశం ఉందని ఈ హెచ్చరికల్లో ఐఎండి పేర్కొంది. ఐదు జిల్లాలకు మంగళవారం నాటికి ఎల్లో వార్నింగ్‌ను జారీ చేసింది. భారీ వర్షాల కారణంగా కొండచరియలు విరిగిపడటంతో రాజధానికి దారితీసే ప్రధాన రహదారితో పాటు 621 రోడ్లు దెబ్బతిన్నాయి. కొండ రాళ్లను తొలగించడం సాధ్యంకాకపోవడంతో ఈ అన్ని రోడ్ల మీద రాకపోకలు నిలిచిపోయాయి. రాష్ట్ర వ్యాప్తంగా 752 రోడ్లను మూసివేసినట్లు అధికారులు తెలిపారు.ముఖ్యమంత్రి సుఖ్‌విదుర్ సింగ్ ఉన్నతాధికారులతో పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, కొద్దిరోజుల పాటు ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం సూచించింది. ఆదివారం సాయంత్రం నుంచి సోమవారం సాయంత్రం వరకూ కాంగ్రా ప్రాంతంలో 273 మీమీ వర్షపాతం నమోదయింది. ధర్మశాలలో 250 మీమీ వర్షపాతం, సుందర్‌నగర్‌లో 168 మీమీ, మండిలో 140 మీమీ, జుబర్హత్తిలో 132 మీమీ, షిమ్లాలో 126 మీమీ, బెర్తిన్‌లో 120 మీమీ, ధౌలకౌంలో 111 మీమీ, నహన్‌లో 107 మీమీ వర్షాపాతం నమోదయింది.

7వేల కోట్ల ఆస్తి నష్టం

ప్రస్తుత వర్షా కాలం ప్రారంభమైన తరువాత ఇప్పటివరకు తమ రాష్ట్రంలో 7,171 కోట్ల రూపాయల ఆస్తి నష్టం సంభవించినట్లు హిమాచల్ ప్రదేశ్ ప్రభుత్వం ప్రకటించింది. జూన్ 24 నుంచి ఇప్పటి వరకూ ఈ మేరకు నష్టం జరిగినట్లు అధికారులు తెలిపారు. 170 వరకూ కొండచరియలు విరిగిపడిన, పిడుగులు పడిన సంఘటనలు జరిగినట్లు చెప్పారు. ఈ వర్ష కాలంలో 9,600 ఇళ్లు పాక్షికంగా లేదా పూర్తిగా ధ్వంసమయ్యాయని తెలిపారు.

ఉపాధ్యాయుల సర్దుబాటు 18లోపు పూర్తికావాలి

జిల్లాల్లో పాత జిల్లాల ప్రాతిపదికన కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. కమిటీ ఛైర్మన్‌గా జిల్లా కలెక్టర్, కో ఛైర్మన్‌గా కొత్త జిల్లా కలెక్టర్లు, ఉమ్మడి జిల్లా విద్యాశాఖ అధికారి కన్వీనర్‌గా, కొత్త జిల్లా విద్యాశాఖ అధికారులు సభ్యులుగా ఉండాలని పేర్కొన్నారు. ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ పోస్టు అదనంగా ఉంటే హైస్కూల్ ప్లస్‌కు సర్దుబాటు చేయాలని తెలిపారు. అర్హత కలిగిన ఎస్‌జిటిలు ఉంటే ప్రీ హైస్కూల్, హైస్కూల్‌లో సర్దుబాటు చేయాలని పేర్కొన్నారు.



డి51లో రష్మిక మందన్నా హీరోయిన్

ధనుష్, శేఖర్ కమ్ముల, శ్రీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్ఎల్పీ, అమిగోస్ క్రియేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ రూపొందిస్తున్న చిత్రం డి51లో హీరోయిన్‌గా రష్మిక మందన్నను ఎంపిక చేశారు. శ్రీ నారాయణ్ దాస్ కె నారంగ్ సారథ్యంలో సునీల్ నారంగ్, పుస్కుర్ రామ్ మోహన్ రావు డి51ని నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా రష్మిక మందన్న తన ఆనందాన్ని పంచుకున్నారు. 'చాలా సంతోషంగా ఉంది. ఈ ఆనందాన్ని మీ అందరితో పంచుకోవాలని అనుకుంటున్నాను" అని సోషల్ మీడియాలో పోస్టు చేశారు.

'పిజ్జా3'కి భారీ విజయం ఖాయం



మోస్ట్ పాపులర్, సక్సెస్ ఫుల్ హారర్ థ్రిల్లర్ ఫ్రాంచైజీ 'పిజ్జా' అనీ, ఈ ఫ్రాంచైజీలో వచ్చిన రెండు చిత్రాలు తెలుగు ప్రేక్షకులని విశేషంగా ఆకట్టుకొని, భారీ విజయాలు సాధించాయని హీరో అశ్విన్ కాకుమణి అన్నారు. ఇటీవలే తమిళంలో విడుదలైన 'పిజ్జా3' బ్లాక్ బస్టర్ విజయాన్ని అందుకుంది. ఇప్పుడు తెలుగు ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. అశ్విన్ కాకుమణి, పవిత్ర మరిముత్తు ప్రధాన పాత్రలలో మోహన్ గోవింద్ దర్శకత్వం వహించారు. ఈ చిత్రం తెలుగు రైట్స్‌ని సొంతం చేసుకున్న కనెక్ట్ మూవీస్ ఎల్ఎల్పీ ఈనెల 18న గ్రాండ్‌గా విడుదల చేస్తుంది. ఈ సందర్భంగా హీరో అశ్విన్ కాకుమణి మీడియాతో మాట్లాడుతూ.. 'పిజ్జా3' స్క్రిప్ట్ చాలా వైవిధ్యంగా ఉంటుంది. ఫ్యామిలీతో కలిసి థియేటర్లో చూడండి. తప్పకుండా వినోదాన్ని పొందుతారు.' అని అన్నారు.



7న 'మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి'


హీరో నవీన్ పొలిశెట్టి, హీరోయిన్ అనుష్క శెట్టి జంటగా నటిస్తున్న 'మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి' సెప్టెంబర్ 7న విడుదల కానుందని దర్శక నిర్మాతలు సోమవారం ప్రకటించారు. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ యువీ క్రియేషన్స్ బ్యానర్‌పై మహేష్ బాబు.పి దర్శకత్వంలో వంశీ, ప్రమోద్ నిర్మించారు. ఇప్పటికే టీజర్, పాటలకు మంచి స్పందన వచ్చింది. హీరో ధనుష్ పాడిన హతవిధీ ఏందిది పాటతో ఇప్పటికే మరింత క్రేజ్ తీసుకొచ్చాయి. ఈ చిత్రంలో అన్విత రవళి శెట్టి పాత్రలో అనుష్క, కమెడియన్ సిద్ధు పోలిశెట్టి పాత్రలో నవీన్ పోలిశెట్టిని చూపించనున్నారు.



ఆకట్టుకునేలా 'మదిలో మది'

జయ కుమార్, శ్రీను, స్వీటీ, సిరి రావుల చారి, సునీత ప్రధాన పాత్రల్లో నటించిన అందమైన ప్రేమ కథ చిత్రం 'మదిలో మది'. ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటుందని నటుడు తాగుబోతు రమేష్ చెప్పారు. ప్రకాష్ పల్ల దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం ఈ 18న విడుదల కానుంది. చిత్రబృందం సోమవారం నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో రమేష్ మాట్లాడారు. 'మదిలో మది' సినిమాలో అనేక ట్విస్టులు ఉన్నాయి. ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి. ఎస్.కె.ఎల్.ఎం.క్రియేషన్స్ ద్వారా నేముకూరి జయకుమార్ ఈ చిత్రాన్ని నిర్మించారు. 'జై అసిస్టెంట్‌గా పని చేశాడు. జై నాకు డ్రైవర్‌గా ఉండేవాడు. అప్పటి నుంచి ఫైర్ ఉండేది. డైరెక్టర్ ప్రకాష్ ఈ సినిమాను బాగా తీశాడు.అందరూ ఆదరించాలి' అని కోరారు.

నటుడు ఉపేంద్రపై కేసు నమోదు



కన్నడ నటుడు ఉపేంద్రపై కేసు నమోదైంది. తన రాజకీయ పార్టీ వార్షికోత్సవం సందర్భంగా సోషల్ మీడియాలో ఆయన చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. దళితులను అవమానించేలా ఆయన వ్యాఖ్యలు చేశారంటూ బెంగళూరులో కేసు నమోదైంది. 'ప్రజాకీయా' వార్షికోత్సవంలో భాగంగా ఉపేంద్ర శనివారం ఫేస్‌బుక్, ఇన్‌స్టా లైవ్ నిర్వహించారు. విమర్శకులను ఓ గ్రూపుతో పోలుస్తూ ఆయన సామెతలు చెప్పారు. ఈ వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో తీవ్ర చర్చకు దారి తీశాయి. ఈ క్రమంలో ఉపేంద్ర వ్యాఖ్యలు తమని ఆవేదనకు గురి చేశాయంటూ ఆదివారం బెంగళూరులోని చెన్నమన్నకెరే అచ్చుకట్టు పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు అందింది. దీంతో పోలీసులు ఉపేంద్రపై కేసు నమోదు చేశారు. తన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపడంతో ఉపేంద్ర క్షమాపణలు చెప్పారు.



మార్కెటింగ్‌కే ప్రాధాన్యం

విభిన్నమైన పాత్రలతో తరచూ ప్రేక్షకులను అలరిస్తున్నారు నటి యామీ గౌతమ్. తాజాగా ఆమె సినీ పరిశ్రమ గురించి ఆసక్తికర కామెంట్ చేశారు. 'ఓ మైగాడ్ 2'లో యామీ న్యాయవాదిగా కనిపించి, తన నటనతో ప్రేక్షకుల మెప్పు పొందారు. ఈ నేపథ్యంలో 'ఫిల్మ్‌మేకర్స్ యామీ టాలెంట్‌ను సరిగ్గా ఉపయోగించుకోవడం లేదు' అంటూ ఓ నెటిజన్ ట్వీట్ చేశాడు. దీనిపై యామీ స్పందిస్తూ... 'ప్రస్తుతం టాలెంట్ కంటే మార్కెటింగ్‌కే ఇండస్ట్రీ ఎక్కువ ప్రాధాన్యత ఇస్తుంది, అది దురదృష్టకరం' అని పేర్కొంది.

వలంటీర్లకు పేపర్ బిల్లుపై విచారణ వాయిదా

- కౌంటర్ దాఖలుకు ఎపి ప్రభుత్వానికి ఆదేశం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఆంధ్రప్రదేశ్‌లో వలంటీర్లకు పేపర్ కొనుగోలు నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం రూ.200 మంజూరు చేస్తూ జిఓ జారీ చేయడంపై ఉషోదయ పబ్లికేషన్ (ఈనాడు ప్రచురణ సంస్థ) దాఖలు చేసిన పిటిషన్‌ను సోమవారం ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సతీష్ చంద్ర, జస్టిస్ సంజీవ్‌తో కూడిన ధర్మాసనం విచారించింది. సుప్రీంకోర్టు బదిలీ చేసిన పిటిషన్ అని న్యాయవాదులు ధర్మాసనానికి తెలిపారు. నోటీసులు సర్వ్ అవడంపై సిజె ఆరా తీశారు. వలంటీర్లకు అలవెన్సు చెల్లించే ప్రక్రియను వివరిస్తూ కౌంటరు దాఖలు చేయాలని ఎపి ప్రభుత్వాన్ని ఆదేశించింది. నూతన జిఓ విడుదలపై దాఖలైన ఇంటర్‌లొకేటరీ అప్లికేషన్‌కు సంబంధించి నోటీసులు జారీ చేస్తున్నట్లు పేర్కొంది. తదుపరి విచారణ సెప్టెంబరు 22కు వాయిదా వేసింది.

తుడా ఛైర్మన్‌గా చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

తిరుపతి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మన్‌గా చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కుమారుడు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు సోమవారం జిఓ ఆర్‌టి నెంబరు 509ని విడుదల చేసింది. బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి ఆయన మూడేళ్లపాటు ఈ పదవిలో కొనసాగుతారని పేర్కొంది.

ఎంవిఎ ఐక్యంగా ఉంది : శరద్ పవార్

ముంబయి : మహారాష్ట్రలోని ప్రతిపక్ష కూటమి మహా వికాస్ అఘాడి (ఎంవిఎ)లో ఎలాంటి గందోరగోళం లేదని, ఐక్యంగా ఉందని ఎన్‌సిపి అధ్యక్షులు శరద్ పవార్ సోమవారం స్పష్టం చేశారు. ఈ నెల 31, సెప్టెంబరు 1 తేదీల్లో ముంబయిలో జరిగే ఇండియా కూటమి సమావేశాన్ని విజయవంతంగా నిర్వహిస్తామని తెలిపారు. సమావేశం నిర్వహించే బాధ్యతలను తను, ఉద్ధవ్ ఠాక్రే, మహారాష్ట్ర పిసిసి అధ్యక్షులు నానా పటోలే తీసుకున్నట్లు చెప్పారు. ఇటీవల శరద్ పవార్‌తో ఎన్‌సిపి చీలక నేత, మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ భేటీ తరువాత నుంచి వస్తున్న అనేక ప్రశ్నలకు శరద్ పవార్ పై విధంగా సమాధానం ఇచ్చారు.

అభివృద్ధే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

అవసరమని అన్నారు. ఆదివాసీలు తమ ఆచార సాంప్రదాయాలను మరింత పరిపుష్టం చేసుకుంటూనే మరోవైపు ఆధునిక భావజాలాన్ని అలవరుచుకోవాలని ముర్ము పిలుపునిచ్చారు. సమాజంలో అణచివేతకు గురైన వారికి ప్రాధాన్యతనివ్వడమనేది మనం అనుసరించే విధానాల ఏకైక మూల సూత్రమని అన్నారు. ఫలితంగానే గత దశాబ్ద కాలంలో పెద్ద సంఖ్యలో ప్రజలు దారిద్ర్యం నుండి బయటపడ్డారని అన్నారు. అన్నదాతలకు దేశం రుణపడి వుందన్నారు. అభివృద్ధి లక్ష్యాలను, మానవతా సహకారాన్ని మరింత పెంపొందించడంలో భారత్ కీలకమైన పాత్ర పోషిస్తోందన్నారు. అంతర్జాతీయ వేదికలపై కూడా తన సత్తా చాటుతోందన్నారు. మొత్తంగా ప్రపంచ జనాభాలో మూడింట రెండు వంతులు జి 20దేశాల్లోనే వున్నారని, అంతర్జాతీయ ప్రాధాన్యతలను, సరైన దిశలో పెట్టగలిగేందుకు ఇదొక విశిష్టమైన అవకాశమని, భారత్ దాన్ని సంపూర్ణంగా వినియోగించుకోవాలని అన్నారు. దేశ ప్రజలకు కులం,మతం, ప్రాంతాలుగా రకరకాల గుర్తింపులున్నప్పటికీ భారత పౌరులన్నది అన్నింటికి మించిన గుర్తింపని చెప్పారు.

వర్ష బీభత్సం

(మొదటి పేజీ తరువాయి)

అవకాశం ఉందని ఈ హెచ్చరికల్లో ఐఎండి పేర్కొంది. ఐదు జిల్లాలకు మంగళవారం నాటికి ఎల్లో వార్నింగ్‌ను జారీ చేసింది. భారీ వర్షాల కారణంగా కొండచరియలు విరిగిపడటంతో రాజధానికి దారితీసే ప్రధాన రహదారితో పాటు 621 రోడ్లు దెబ్బతిన్నాయి. కొండ రాళ్లను తొలగించడం సాధ్యంకాకపోవడంతో ఈ అన్ని రోడ్ల మీద రాకపోకలు నిలిచిపోయాయి. రాష్ట్ర వ్యాప్తంగా 752 రోడ్లను మూసివేసినట్లు అధికారులు తెలిపారు.ముఖ్యమంత్రి సుఖ్‌విదుర్ సింగ్ ఉన్నతాధికారులతో పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, కొద్దిరోజుల పాటు ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం సూచించింది. ఆదివారం సాయంత్రం నుంచి సోమవారం సాయంత్రం వరకూ కాంగ్రా ప్రాంతంలో 273 మీమీ వర్షపాతం నమోదయింది. ధర్మశాలలో 250 మీమీ వర్షపాతం, సుందర్‌నగర్‌లో 168 మీమీ, మండిలో 140 మీమీ, జుబర్హత్తిలో 132 మీమీ, షిమ్లాలో 126 మీమీ, బెర్తిన్‌లో 120 మీమీ, ధౌలకౌంలో 111 మీమీ, నహన్‌లో 107 మీమీ వర్షాపాతం నమోదయింది.

7వేల కోట్ల ఆస్తి నష్టం

ప్రస్తుత వర్షా కాలం ప్రారంభమైన తరువాత ఇప్పటివరకు తమ రాష్ట్రంలో 7,171 కోట్ల రూపాయల ఆస్తి నష్టం సంభవించినట్లు హిమాచల్ ప్రదేశ్ ప్రభుత్వం ప్రకటించింది. జూన్ 24 నుంచి ఇప్పటి వరకూ ఈ మేరకు నష్టం జరిగినట్లు అధికారులు తెలిపారు. 170 వరకూ కొండచరియలు విరిగిపడిన, పిడుగులు పడిన సంఘటనలు జరిగినట్లు చెప్పారు. ఈ వర్ష కాలంలో 9,600 ఇళ్లు పాక్షికంగా లేదా పూర్తిగా ధ్వంసమయ్యాయని తెలిపారు.

జాతీయ జెండా తయారీకి ఇళ్లు అమ్ముకున్నారు

- అతుకులు, కుట్లు లేని త్రివర్ణ పతాకాన్ని రూపొందించిన ఎపికి చెందిన రుద్రాక్షాల సత్యనారాయణ
- అభినందించిన రాష్ట్రపతి ముర్ము
- ఎర్రకోటపై ఎగిరేలా చూస్తానని హామీ


అతుకులు, కుట్లు లేని త్రివర్ణ పతాకాన్ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు చూపుతున్న ఎపికి చెందిన రుద్రాక్షాల సత్యనారాయణ, రామచంద్రు తెజావత్, పూనం కౌర్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

జాతీయ జెండా అంటేనే అందరికీ ఎనలేని గౌరవం. మువ్వన్నెల జెండాను చూస్తేనే ఒళ్ళంతా పులకరిస్తుంది. అలాంటి ప్రపంచంలోనే తొలి అతుకులు, కుట్లు లేని అశోకచక్రంతో సహా చేనేత జాతీయ జెండాను ఆంధ్రప్రదేశ్‌కు చెందిన రుద్రాక్షల సత్యనారాయణ తయారు చేశారు. ఈ జెండా కోసం ఏకంగా తన ఇంటిని సైతం అమ్మకున్నట్లు సత్యనారాయణ తెలిపారు. సోమవారం నాడిక్కడ రిటైర్డు ఐఎఎస్ రామచంద్రు తెజావత్, సినీ నటి పూనం కౌర్‌తో కలిసి సత్యనారాయణ రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ ప్రతిభ, అంకుటిత దీక్షను ముర్ము అభినందించారు. అనంతరం ఎపి, తెలంగాణ భవన్‌లో సత్యనారాయణ మీడియాతో మాట్లాడారు. జాతీయ జెండాను రూపొందించిన పింగళి వెంకయ్య స్ఫూర్తితో ఈ అతుకులు లేని 8×12 సైజ్‌లో జెండాను తయారుచేసినట్లు చెప్పారు. అలాగే ఎర్రకోటపై ఈ జెండాను ఎగరాలనేది తన కల అని అన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని ఎర్రకోటపై ఎగిరే జెండా నిబంధనలు, సైజులను పాటించానన్నారు. ఈ విషయాన్ని రాష్ట్రపతి ముర్ముకు వివరించగా... ఆమె సానుకూలంగా స్పందించారన్నారు. ఎర్రకోటపై ఈ జెండాను ఎగురవేసే అంశంతో పాటూ, ఆర్థికంగా ఆదుకునే విషయంలో అధికారులకు ఆదేశాలిచ్చినట్లు చెప్పారు. కాగా, ఈ జెండా తయారీ కోసం గడిచిన నాలుగేళ్లలో రూ.6.50 లక్షలు ఖర్చు చేసినట్లు వెల్లడించారు. పూర్తిస్థాయి జెండా ప్రయత్నంలో 24 జెండాలు పాడయ్యాయన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వాలు ఎగురవేసే 4×6 సైజు జెండాలు రూపొందించినట్లు చెప్పారు. ప్రస్తుతం ఎర్రకోటపై ఎగురవేస్తోన్న జెండా కర్ణాటకలో తయారవుతోందని రామచంద్రు తెజావత్ తెలిపారు. ఆ జెండాకు ఐఎస్ఐ ముద్ర, ఇతర నిబంధనలు ఉంటాయన్నారు.

దేశం గర్వించే జెండా : పూనం కౌర్

ఇంటిని తాకట్టుపెట్టి వచ్చిన డబ్బుతో ఏకవస్త్ర జాతీయ జెండాను సత్యనారాయణ రూపకల్పన చేయడం గర్వకారణమని నటి, ఎపి చేనేత అంబాసిడర్ పూనం కౌర్ అన్నారు. ఈ జెండా దేశం గర్వించే జెండా అని అభిప్రాయపడ్డారు. ఈ జెండా తయారీకి అయ్యే ఖర్చులను తానే భరిస్తానని చెబితే సత్యనారాయణ నిరాకరించారన్నారు. చేనేత మగ్గంపై దేశభక్తిని, జాతీయ స్ఫూర్తిని చాటిన సత్యనారాయణను అందరూ అభినందించాలని, ప్రోత్సహించాలని అన్నారు. చేనేతపై ఉన్న మక్కువతో దేశంలో అనేక ప్రాంతాలను సందర్శించానని, చేనేత రంగం అభ్యున్నతి కోసం కృషి చేస్తున్నానని చెప్పారు.

మొక్కుబడిగా పసుపు కొనుగోలు

- పసుపు రైతుల సమన్వయ కమిటీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రభుత్వం రాష్ట్రంలో మొక్కుబడిగా పసుపు కొనుగోళ్లు చేసిందని ఆంధ్రప్రదేశ్ పసుపు రైతుల సమన్వయ కమిటీ కన్వీనరు జొన్నా శివశంకరరావు విమర్శించారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో 84 వేల ఎకరాల్లో పసుపు పండించగా, నాలుగు లక్షల టన్నుల దిగుబడి వచ్చిందని తెలిపారు. ప్రభుత్వం మద్దతు ధరకు 50 వేల టన్నులు మాత్రమే కొనుగోలు చేసిందని అన్నారు. దిగుబడి వచ్చిన సమయంలో వ్యాపారులు ధర తగ్గించారని విమర్శించారు. అంతా తక్కువ ధరకు కొనుగోలు చేసి బినామీ పేర్లతో కోల్డ్ స్టోరేజీల్లో దాచారని తెలిపారు. ఇప్పుడు ధర పెంచారని, వాస్తవంగా మార్కెట్లో ధర లేనప్పుడు మద్దతు ధరకు కొనుగోలు చేయాల్సిన ప్రభుత్వం ఆ పనిచేయలేదని అన్నారు. దీనివల్ల రైతులు నష్టపోయారని, వారివద్ద కొనుగోలు చేసిన వ్యాపారులు లాభపడ్డారని పేర్కొన్నారు. ఏటా రైతులు ఇదే పద్ధతిలో నష్టపోతున్నారని వివరించారు. రైతులను ఆదుకోవాలని, పసుపు బోర్డును ఏర్పాటు చేయాలని, పసుపు క్వింటా మద్దతు ధర రూ.10 వేలు ప్రకటించాలని, ఏప్రిల్ నెలలోనే కొనుగోలు కేంద్రాలు తెరవాలని కోరారు. కుర్కిమెన్ శాతం ఎక్కువగా ఉండే నాణ్యమైన పసుపు విత్తనాలను సరఫరా చేయాలని శివశంకరరావు డిమాండ్ చేశారు.

మతోన్మాద ధోరణులు రెచ్చగొట్టడమే బిజెపి ప్రాధాన్యత

- హర్యానాలో మరో హిందూ మహా పంచాయత్! • తీవ్రంగా ఖండించిన సిపిఎం

రోహతక్ : హర్యానాలో ఇప్పటికీ ఉద్రిక్త పరిస్థితులు నెలకొని వున్నా తిరిగి పల్వాల్ జిల్లాలోని పాండ్రి గ్రామంలో 'సర్వ జాతీయ హిందూ మహా పంచాయత్'ను నిర్వహించడానికి అనుమతించడం పట్ల సిపిఎం హర్యానా రాష్ట్ర కార్యదర్శివర్గం తీవ్రంగా నిరసన వ్యక్తం చేసింది. దీన్ని బట్టి చూస్తుంటే శాంతి సామరస్యతలు నెలకొనేలా చూడడం కన్నా మతోన్మాద ధోరణులు రెచ్చగొట్టేలా చేయడానికే బిజెపి ప్రభుత్వ ప్రాధాన్యతనిస్తోందని స్పష్టమైందని పార్టీ పేర్కొంది. ఈ మేరకు ఒక ప్రకటన జారీ చేసింది. అల్లర్లు జరిగిన నుహ్ జిల్లాకు పక్కనే గల గ్రామంలో ఈ మతపరమైన సమావేశం నిర్వహించడానికి ప్రేరేపించబడిన కారణాలు ఏమిటని సిపిఎం ప్రశ్నించింది. ఆ పంచాయత్‌ను స్థానిక ప్రజలు బహిష్కరించడాన్ని పార్టీ స్వాగతించింది. హర్యానాలో గానీ, ఈ బ్రజ్ ప్రాంతంలో గానీ, గతంలో ఇలా ఏ ఒక్క మతం పేరుతో పంచాయితీలు నిర్వహించిన దాఖలాలు లేవని పార్టీ పేర్కొంది. యుపి, రాజస్థాన్, ఢిల్లీలకు చెందిన విశ్వ హిందూ పరిషత్, బజరంగ్ దళ్, గో రక్షా దళ్ వంటి మతోన్మాద సంస్థలు ఇలా పంచాయితీలు నిర్వహిస్తున్నాయి. పంచాయితీలో మాట్లాడిన వారందరూ ముస్లింలపై అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేశారు. హిందువులు వారిపై తిరగబడాలని పిలుపునిచ్చారు. ప్రతి హిందూ గ్రామలో కనీసం వంద మందికి ఆయుధాలు ఇవ్వాలంటూ గోరక్షా దళ్‌కి చెందిన అజాద్ శాస్త్రి చెప్పడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ నెల 28న నుహ్‌లోని నల్హాడ్ నుండి బ్రజ్ మండల్ జలాభిషేక్ యాత్రను చేపట్టాలని ఈ పంచాయితీ నిర్ణయించింది. నిర్వాహకులు బహిరంగంగానే విద్వేష ప్రచారాన్ని వ్యాప్తి చేస్తూ నేరపూరిత కార్యకలాపాలకు పాల్పడుతున్నారని, వారిపై ఏం చర్యలు తీసుకుంటారని జిల్లా యంత్రాంగాన్ని సిపిఎం ప్రశ్నించింది.

కృష్ణా నదీ జలాల కేటాయింపుపై సుప్రీం విచారణ నవంబరు 29కి వాయిదా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కృష్ణా నదీ జలాల కేటాయింపుపై ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్రల మధ్య తలెత్తిన వివాదానికి సంబంధించి దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు సోమవారం అనుమతించింది. తుది విచారణను నవంబరు 29కి వాయిదా వేసింది. నదీపరివాహక రాష్ట్రాల మధ్య నీటి పంపిణీపై రెండో కృష్ణా జలవివాదాల ట్రిబ్యునల్ (కెడబ్ల్యుడిటి-2) ఆమోదించిన 2010 తుది అవార్డును ప్రచురించడం కోసం కర్ణాటక ప్రభుత్వం దాఖలు చేసిన మధ్యంతర దరఖాస్తును సోమవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ దీపాంకర్ దత్తాతో కూడిన ధర్మాసనం ముందు ఆ రాష్ట్రం తరపున హాజరైన సీనియర్ న్యాయవాది శ్యామ్ దివాన్ ప్రస్తావించారు. దేశంలోని అనేక ప్రాంతాలు ఈ ఏడాది కరువు పరిస్థితులను ఎదుర్కొన్నాయని శ్యామ్ దివాన్ పేర్కొన్నారు. 'కృష్ణా నదికి సంబంధించినంత వరకు మా పనులను పూర్తి చేయాల్సిన అవసరం చాలా ఉంది. ఇవి కరువు పీడిత ప్రాంతాలు. దీనికి తగిన ప్రాధాన్యత ఇవ్వబడేలా చూసుకోవడం మనలో ప్రతి ఒక్కరిపై బాధ్యత ఉంది' అని అన్నారు.

జనవరిలో జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని మరొక ధర్మాసనం ముందు సీనియర్ న్యాయవాది శ్యామ్ దివాన్ వాదనలు వినిపిస్తూ కృష్ణా నది నుండి తన వాటాను ఉపయోగించుకోవడానికి మౌలిక సదుపాయాలను నిర్మించడానికి కర్ణాటక ప్రభుత్వం ఇప్పటికే అనేక వేలకోట్ల ప్రజాధనాన్ని ఖర్చు పెట్టిందని, దీని అవసరాన్ని నొక్కి చెప్పే ప్రయత్నం చేశారు. కెడబ్ల్యుడిటి-2 తుది ఉత్తర్వును తెలియజేయకుండా కేంద్ర ప్రభుత్వాన్ని నిరోధించే ఉన్నత న్యాయస్థానం మధ్యంతర ఉత్తర్వులను సవరించాలని కోరారు. 'కర్ణాటక రూ.13,321 కోట్లతో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేసింది. కృష్ణా నదీ జలాల వివాదాల ట్రిబ్యునల్, ఎల్ఎల్ ఎగువ కృష్ణా ప్రాజెక్టుకు కేటాయించిన 130 టిఎంసిల నీటిలో 75 టిఎంసిల నీటిని 60 శాతం సాగునీటి కోసం వినియోగించుకునే స్థితిలో ఉంది. ప్రణాళికాబద్ధమైన 5.94 లక్షల హెక్టార్లలో నీటిని ఉపయోగించకపోతే, సిల్టేషన్, కలుపు మొక్కల పెరుగుదలతో సహా వివిధ కారణాల వల్ల మౌలిక సదుపాయాలు క్షీణించవచ్చు' అని అన్నారు.

శ్యామ్ దివాన్ సోమవారం కూడా కోర్టులో ఈ విషయాన్ని పునరుద్ఘాటించారు. 'మా మౌలిక సదుపాయాలు పూర్తయ్యాయి. ట్రిబ్యునల్ అవార్డు కింద మాకు కేటాయించిన నీటిని విడుదల చేయవచ్చు. ఈ ఉత్తర్వుతో కోర్టు ఒక పాయింట్‌కు మించి, గందరగోళానికి గురిచేసే అవకాశం లేదు. భారీ మొత్తంలో పన్ను చెల్లింపుదారుల డబ్బును కలిగి ఉంది. దీనిని త్వరితగతిన వినడానికి పెద్ద ప్రజా ఆసక్తి ఉంది. నీటిని బంగాళాఖాతంలోకి వృథాగా పోయేందుకు అనుమతించకూడదు' అని అన్నారు. నవంబరు 21న దీన్ని ఆపేందుకు ప్రయత్నిస్తామని జస్టిస్ సూర్యకాంత్ బదులిచ్చారు. అయితే, శ్యామ్ దివాన్ బుధవారం, గురువారాల్లో జాబితా చేయాలని కోరారు. 'సమస్య ఏమిటంటే ఇది స్పెషల్ లీవ్ పిటిషన్ దశలో ఉంది. సెలవు మంజూరు చేయబడలేదు' అని న్యాయమూర్తి దివాన్‌తో అన్నారు. 'బుధవారం, గురువారం జాబితా చేయడానికి మేము సెలవు మంజూరు చేయాలి' అని పేర్కొన్నారు.'దయచేసి సెలవు మంజూరు చేయండి' అని సీనియర్ న్యాయవాది శ్యామ్ దివాన్ అభ్యర్థించారు. 'సంబంధిత రాష్ట్రాలు దాఖలు చేసిన క్రాస్ ఎస్ఎల్‌పిలు ఉన్నాయి. దీనికి తుది విచారణ అవసరం. సెలవు మంజూరు చేయడం లాంఛనప్రాయం. దానిని మంజూరు చేసి, విషయం బయటపడనివ్వండి' అని అన్నారు. పక్షాలలో ఎవరికైనా అభ్యంతరం ఉందా? అని అడగడంతో, ఏ విషయాన్ని కనుగొనలేకపోవడంతో ధర్మాసనం, సెలవు మంజూరు చేసి, కేసును తుది విచారణను నవంబరు 29కు వాయిదా వేసింది.

టిడిపి నేతలకు ఊరట

ప్రజాశక్తి-అమరావతి

టిడిపి అధినేత చంద్రబాబు పర్యటన నేపథ్యంలో అంగళ్లులో వైసిపి నేతలు నిరసన వ్యక్తం చేస్తూ చేపట్టిన దీక్షకు పోలీసుల అనుమతి ఉందో లేదో చెప్పాలని హైకోర్టు కోరింది. అధికార పార్టీకి చెందినవాళ్లు విపక్ష నేతలకు వినతిపత్రం ఇవ్వడానికి ప్రయత్నించారని చెప్పడంపై హైకోర్టు విస్మయం వ్యక్తం చేసింది. అంగళ్లులో ఘటనల నేపథ్యంలో పోలీసులు నమోదు చేసిన కేసుల్లో తమకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలంటూ దేవినేని ఉమామహేశ్వరరావు, నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి, పులివర్తి నాని దాఖలు చేసిన వ్యాజ్యాల విచారణ సమయంలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె సురేష్‌రెడ్డి పైవిధంగా పోలీసుల్ని ప్రశ్నించారు. విచారణ బుధవారం కొనసాగిస్తామని, అప్పటి వరకు పిటిషనర్లపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోరాదని హైకోర్టు మౌఖిక ఆదేశాలు జారీ చేసింది.

విచారణ వాయిదా

టిడిపి అధినేత చంద్రబాబు పుంగనూరు పర్యటన సందర్భంగా అంగళ్లులో ఘటన తర్వాత ముదివేడు పోలీసులు పెట్టిన కేసును కొట్టేయాలంటూ టిడిపి ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు షాజహాన్ బాషా డి రమేష్, తెలుగు యువత అధ్యక్షులు శ్రీరామ్ చినబాబు, టిడిపి నేత గంటా నరహరి వేర్వేరుగా వేసిన వ్యాజ్యాల విచారణ సోమవారం జరిగింది. గడువు కావాలని ప్రభుత్వ ప్లీడర్ కోరడంతో విచారణ బుధవారానికి వాయిదా పడింది.

బీహార్ కులసర్వేపై 18న సుప్రీం విచారణ

న్యూఢిల్లీ : బీహార్‌లో కులాల ప్రాతిపదికన సర్వే చేపట్టడానికి అనుమతిస్తూ ఆగస్టు 1వ తేదీన పాట్నా హైకోర్టు జారీ చేసిన ఆదేశాలపై విచారణను సుప్రీం కోర్టు ఆగస్టు 18కి వాయిదా వేసింది. ఈ ఆదేశాలను సవాలు చేస్తూ దాఖలైన అన్ని పిటిషన్లను ఒకే రోజు అంటే 18న విచారిస్తామని జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ ఎస్‌విఎన్ భట్టిలతో కూడిన బెంచ్ పేర్కొంది. ఎన్‌జిఒ 'ఏక్ సోచ్ ఏక్ పార్యాస్' సంస్థ ఈ పిటిషన్‌ను దాఖలు చేసింది. మూడు రోజుల్లోగా కులాల ప్రాతిపదిక సర్వేను పూర్తి చేయాల్సిందిగా ఆగస్టు 1వ తేదీ అర్ధరాత్రి ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిందని పిటిషనర్ తరపు న్యాయవాది పేర్కొన్నారు. అన్ని అంశాలను అదే రోజు విచారిస్తామని, అప్పటికల్లా న్యాయమూర్తులు కూడా హైకోర్టు తీర్పును కూలంకషంగా పరిశీలించాలని బెంచ్ కోరింది.



సిఆర్‌డిఎ పారిశుధ్య కార్మికుల పిఎఫ్ విడుదల చేయాలి

- సిఐటియు డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సిఆర్‌డిఎ పారిశుధ్య కార్మికులకు పెండింగ్‌లో ఉన్న 18 నెలల పిఎఫ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి డి రమాదేవి డిమాండ్ చేశారు. సోమవారం సిఆర్‌డిఎ కార్యాలయం వద్ద రాజధాని ప్రాంత పారిశుధ్య కార్మికులు చేస్తున్న ఆందోళనకు ఆమె మద్దతు తెలిపారు. కార్మికులు సంఘటితంగా పోరాడితేనే సమస్యలు పరిష్కారం అవుతాయని, వారికి సిఐటి యు అండగా ఉంటుందని అన్నారు. రాజధాని ప్రాంత పారిశుధ్య కార్మిక సంఘం అధ్యక్షులు రవి మాట్లాడుతూ.. గతంలో రాజధాని గ్రామాల్లో శానిటేషన్ విధుల బాధ్యతను తీసుకున్న మూడు ఏజెన్సీల నిర్లక్ష్యం వల్ల కార్మికుల ఖాతాల్లో పిఎఫ్ జమకాలేదని తెలిపారు. వారి జీతాల నుండి ప్రతినెలా పిఎఫ్ పేరుతో ఏజెన్సీ వారు జీతాలు తగ్గించి కార్మికుల ఖాతాల్లో జమ చేయలేదని పేర్కొన్నారు. సిఆర్‌డిఎ అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు. సిఐటియు గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి నేతాజీ మాట్లాడుతూ.. కార్మికులకు ప్రతినెలా పిఎఫ్ సక్రమంగా ఖాతాల్లో జమకాకపోవడంతో పొందాల్సిన ప్రయోజనాలు పొందలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

అనంతరం సిఆర్‌డిఎ అడిషనల్ కమిషనర్ కట్టా సింహాచలానికి సిఐటియు నాయకులు, పారిశుధ్య కార్మికులతో కలిసి రమాదేవి వినతిపత్రం సమర్పించారు. దీనికి స్పందించిన ఆయన మాట్లాడుతూ.. సక్రమంగా పనిచేయని ఏజెన్సీలను బ్లాక్ లిస్టులో ఉంచడం వల్ల పిఎఫ్‌లు చెల్లించడం ఆలస్యమైందని తెలిపారు. త్వరలోనే పిఎఫ్ బకాయిలను కార్మికుల ఖాతాల్లో జమచేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రాజధాని డివిజన్ కార్యదర్శి భాగ్యరాజ్, నాయకులు రాచూరి వేణు, రాజధాని ఏరియా పారిశుధ్య కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు చెరుకూరి సుశీల, వీరాంజనేయులు, జ్యోతి, రత్నకుమారి, సిహెచ్ సుజాత, ఆదిలక్ష్మి, వెంకటేష్ పాల్గొన్నారు.

బలవంతపు చర్యలు చేపట్టవద్దు !

- హైదరాబాద్ వర్శిటీ ప్రొఫెసర్‌కు సుప్రీం రక్షణ

న్యూఢిల్లీ : హైదరాబాద్ యూనివర్శిటీ ప్రొఫెసర్, విద్యావేత్త ఖామ్ ఖాన్ సువాన్ హసింగ్‌పై ఎలాంటి బలవంతపు చర్యలు చేపట్టకుండా సుప్రీం కోర్టు సోమవారం ఆయనకు రెండు వారాలు రక్షణ కల్పించింది. మణిపూర్‌లో చోటుచేసుకుంటున్న పరిణామాలపై ఆన్‌లైన్ వార్తా పోర్టల్‌కు ఇంటర్వ్యూ ఇచ్చిన నేపథ్యంలో ఆయనపై నేరపూరితమైన చర్యలు తీసుకోకుండా సుప్రీం ఈ ఆదేశాలు జారీ చేసింది. మణిపూర్‌లోని సంబంధిత కోర్టు నుంచి తగు రీతిలో ఉపశమనం పొందడానికి హసింగ్‌కు ఊపిరి పీల్చుకోవడానికి కొంత సమయం దొరుకుతుందని ప్రధాన న్యాయమూర్తి డి.వై.చంద్రచూడ్ నేతృత్వంలోని బెంచ్ పేర్కొంది. శతృత్వాన్ని పెంపొందించడం, తప్పుడు ప్రకటనలు చేయడం, మతపరమైన మనోభావాలను రెచ్చగొట్టడంతో సహ ఐపిసి కింద పలు అభియోగాలను ఆయనపై మోపారు. మీడియ ఇంటర్వ్యూ ప్రాతిపదికగా తనపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారని జులై 6న సోషల్‌మీడియా ద్వారా తెలుసుకుని దిగ్భ్రాంతికి లోనయ్యానని హసింగ్ చెప్పారు. ఆ తర్వాత ఇంఫాల్ ఈస్ట్ చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ (సిజెఎం) ప్రొఫెసర్ హసింగ్‌కు సమన్లు జారీ చేసింది. తాను భారత పౌరుడిని కానని అంటూ తనపై వచ్చిన నిరాధార ఆరోపణల నుంచి రక్షణ కల్పించాల్సిందిగా ప్రొఫెసర్, న్యాయ స్థానాన్ని కోరారు.

ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలపై పోరు బలోపేతం

- బెఫీ జాతీయ సదస్సు పిలుపు

చెన్నై : ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటాన్ని బలోపేతం చేయాలని, మతతత్వానికి వ్యతిరేకంగా రాజీలేని వైఖరి తీసుకోవాలని బ్యాంక్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (బెఫీ) జాతీయ సదస్సు పిలుపునిచ్చింది. సిఐటియు జాతీయ కార్యదర్శి ఆర్ కరుమలైయన్, ఆశిష్ సేన్ సోమవారం ప్రసంగించారు. నయా ఉదారవాదం పౌరులకు ఎటువంటి హక్కులను ఇవ్వదని, ప్రతిదీ మార్కెట్ నిర్ణయిస్తుందని విమర్శించారు. నివేదికపై మూడు రోజులపాటు జరిగిన చర్చల్లో దాదాపు వంద మంది ప్రతినిధులు మాట్లాడారు. మహిళా బ్యాంకు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని, తాత్కాలిక సిబ్బందిని స్థిరీకరించాలని, రిజర్వ్ బ్యాంక్ స్వయంప్రతిపత్తిని పరిరక్షించాలని, సహకార రంగంపై దాడులను అరికట్టాలని సదస్సు తీర్మానించింది. బ్యాంకులను కాపాడాలని, ఎన్‌పిఎస్ రద్దు చేయాలని, అందరికీ పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, మాజీ సైనికోద్యోగుల జీతాల నిర్ణయాల్లోని క్రమరాహిత్యాలను సరిదిద్దాలని, బిజినెస్ కరస్పాండెంట్ల సర్వీస్ పే షరతులను అమలులోకి తీసుకురావాలని, మతతత్వానికి వ్యతిరేకంగా పోరాడాలని, మతతత్వాన్ని పెంచే ధోరణులను ఒంటరి చేయాలని, లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకోవాలని తదితర తీర్మానాలను సదస్సు ఆమోదించింది.

స్వాతంత్ర్య వేడుకలకు సర్వం సిద్ధం

- విజయవాడలో జెండాను ఆవిష్కరించనున్న సిఎం జగన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో 77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. విజయవాడలోని ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియాన్ని రాష్ట్ర స్థాయి స్వాతంత్ర్య వేడుకలకు సిద్ధం చేశారు. రాష్ట్ర సచివాలయం, శాసనసభ, శాసనమండలి, రాష్ట్ర హైకోర్టుల ముందు మువ్వన్నెల జెండాలతో ఆకర్షణీయంగా అలంకరించారు. రాష్ట్రస్థాయి వేడుకలు అయిన ఇందిరా గాంధీ స్టేడియంలో మంగళవారం ఉదయం 9 గంటలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జాతీయ జెండాను ఎగురవేసిన అనంతరం సాయుధ దళాల నుండి గౌరవ వందనం స్వీకరిస్తారు. అనంతరం రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతారు. అంతకముందు వెలగపూడిలోని సచివాలయంలోని మొదటి బ్లాక్ వద్ద 7:30 గంటలకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డి, ఉదయం 7:45 గంటలకు శాసనసభ ఆవరణలో శాసనమండలి ముందు మండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, 8:15 గంటలకు శాసనసభ ముందు శాసనసభ స్పీకరు తమ్మినేని సీతారాం జాతీయ జెండాను ఎగురవేస్తారు. అలాగే నేలపాడులోని హైకోర్టు ఆవరణలో ఉదయం పది గంటలకు రాష్ట్ర హైకోర్టు చీఫ్ జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు.

అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

- ఎపిఎస్‌ఆర్‌టిసి అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎపిఎస్‌ఆర్‌టిసిలో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికుల సమస్యల్ని తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఎపిఎస్‌ఆర్‌టిసి అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ కోరింది. ఈ మేరకు ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ నూర్ మహ్మద్, నాయకులు ఎం బాబూరావు, ఎజి రాయుడు సోమవారం తాడేపల్లిలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆర్‌టిసిలోని వేలాది మంది అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులు చాలీచాలని వేతనాలతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. అవుట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఏళ్ల తరబడి పనిచేస్తున్నా ఎవరికీ ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు లేవన్నారు. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని కోరారు. సుప్రీంకోర్టు అదేశాల మేరకు సమాన పనికి సమానవేతనం ఆదేశాలను అమలు చేయాలన్నారు. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు పెంచిన జీతాలను తక్షణమే అమల్లోకి తీసుకురావాలని, కాంట్రాక్టు వ్యవస్థ రద్దుచేసి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన ఆప్కాస్‌లో విలీనం చేయాలని కోరారు. గతంలో తొలగించిన అవుట్‌సోర్సింగ్ కార్మికులను తక్షణం విధుల్లోకి తీసుకోవాలన్నారు. అలాగే అవుట్‌సోర్సింగ్ సిబ్బందిపై అధికారులు, కాంట్రాక్టర్ల వేధింపులను నిలిపేయాలని విజ్ఞప్తి చేశారు. ఎపిఎస్‌ఆర్‌టిసి అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకుల విజ్ఞప్తులను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని సజ్జల హామీ ఇచ్చారు. త్వరలో ఆర్‌టిసి ఎమ్‌డితో ఈ అంశాలన్నీ చర్చించి సమస్యలకు పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు.

21న మణిపూర్ అసెంబ్లీలో తీర్మానం?

ఇంఫాల్ : ఈ నెల 21న జరిగే మణిపూర్ అసెంబ్లీ ప్రత్యేక సమావేశానికి ముందు ఎనిమిదిమంది నాగా ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రి ఎన్ బీరేన్ సింగ్‌కు మద్దతును ప్రకటించారు. కుకీలకు ప్రత్యేక పరిపాలన అనే డిమాండ్‌కు వ్యతిరేకంగా ఈ అసెంబ్లీ సమావేశంలో తీర్మానం ప్రవేశపెట్టనున్నట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో సిఎంకు నాగా ఎమ్మెల్యేలు మద్దతు ప్రకటించారు. కుకీల డిమాండ్‌కు వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానం పెట్టాలని మెయితే గ్రూపునకు చెందిన ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ భావిస్తున్నారు. కుకీలకు ప్రత్యేక పరిపాలన వద్దని పేర్కొంటూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి వినతిపత్రం అందజేశారు. అసెంబ్లీలో వివిధ పార్టీల నుంచి మొత్తం 10 మంది నాగా ఎమ్మెల్యేలు ఉన్నారు. నాగా ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రికి మద్దతు తెలపడంపై నాగాల సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఎమ్మెల్యేల చర్య 'నాగా ప్రజల సామూహిక మనోభావాలను తిరస్కరించింది' అని యునైటెడ్ నాగా కౌన్సిల్ (యుఎన్‌సి) విమర్శించింది. ఎమ్మెల్యేల చర్య బాధ, దిగ్భ్రాంతి కలిగించిందని వర్కింగ్ గ్రూప్ ఆఫ్ నాగా రైట్స్ సంస్థ తెలిపింది.

మయన్మార్‌లో విరిగిపడిన కొండచరియలు

- 30 మంది గల్లంతు • కొనసాగుతున్న సహాయ చర్యలు


యాంగాన్ : ఉత్తర మయన్మార్‌లోని పచ్చల గనిలో కొండచరియలు విరిగిపడడంతో 30మంది గల్లంతయ్యారని అధికారులు తెలిపారు. ప్రస్తుతం అక్కడ సహాయక చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. మయన్మార్‌లో అతిపెద్ద నగరమైన యాంగాన్‌కు 950 కిలోమీటర్ల దూరంలో పర్వత ప్రాంతమైన హప్‌కంత్‌లో ఈ సంఘటన చోటు చేసుకుంది. ఈ ఏరియాలో అతి పెద్దవైన, ఆకర్షణీయంగా వుండే పచ్చల గనులు వున్నాయి. పచ్చలు తవ్వేందుకు మొత్తంగా 30మంది గనుల్లోకి వెళ్లారు. ఆదివారం తెల్లవారు జామున 3.30గంటలకు ఈ ప్రమాదం సంభవించింది. ఆదివారం రాత్రి ఆ పక్కనే గల మన్నా గ్రామంలో కొండచరియలు విరిగిపడడంతో కూలీలందరూ ఆ ధాటికి సరస్సులోకి కొట్టుకుపోయారు. గ్రామానికి సమీపంలో మట్టి పెళ్లలు, శిథిలాలు, పెద్ద మొత్తంగా పడ్డాయని, వాటితో కలిసి దాదాపు వెయ్యి అడుగుల లోతు వున్న ఆ సరస్సులోకి కార్మికులు కొట్టుకుపోయారని చెప్పారు. 34 మంది గల్లంతైనట్లు నిర్ధారించినట్లు సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్న అధికారి తెలిపారు. సోమవారం చెరువు దగ్గర స్థానిక సహాయ బృందాలు పనిచేస్తున్నాయి. ఎనిమిది మంది కార్మికులు గాయపడ్డారు. వారిని ఆదివారం స్థానిక ఆస్పత్రికి తరలించారు. గల్లంతైన వారిలో ఎక్కువమంది పురుషులే. ఇలాంటి సంఘటనలు ఏడాది పొడవునా ఇక్కడ జరుగుతునే వుంటాయి. మైనింగ్ కంపెనీలు భారీ యంత్రాలతో తవ్వి వదిలివేసిన ప్రాంతాల్లో ఈ కార్మికులు సొంతంగా తవ్వుకుంటూ వుంటారు. పచ్చల ముక్కలు ఏరుకోవడమే వారి జీవనాధారం.





JEEVANA జీవన the family

ముువ్వన్నెల జెండా



ఎగిరింది ఎగిరింది మన జెండా
నింపింది మోదమే మది నిండా
ఎందరో త్యాగధనుల సాక్షిగా
నింగిలో విహరించే హాయిగా ...

మదిని సమరయోధులను
స్మరిస్తూ
ఆత్మ బలిదానాలు వివరిస్తూ
ఎత్తండి పైపైకి ఘన జెండా
మన జాతి గౌరవం ఈ జెండా

ముువ్వన్నెల ముచ్చటైన జెండా
ముసిముసి నవ్వుల వెలుగుల
జెండా
శాంతి,స్వేచ్ఛ, క్షేమములకు ప్రతీక
పింగళి వెంకయ్య చేసిన జ్ఞాపిక

కొలవాలి కొలవాలి గుండెల్లో
జాతీయ జెండాను మనమంతా
చాటాలి చాటాలి దేశకీర్తి
చేయిచేయి కల్పి జగమంతా!

- గద్వాల సోమన్న

స్వతంత్ర సంబరాలు

కదలండి ముందుకు
స్వతంత్ర వేడుకలకు

భారతావనిని కీర్తిస్తూ
'జైహింద్' అని నినదిస్తూ
'వందేమాతరం' పాడేస్తూ
స్వతంత్ర వీరులను
స్తుతిస్తూ ...

పదండి ముందుకు
స్వేచ్ఛా సంబరాలకు

అల్లూరి అడుగులతో
భగత్ సింగ్ పిడుగులతో
ఆజాద్ మెరుపులతో
సర్దార్ ఉరుములతో

సాగండి ముందుకు
జెండా పండుగకు

గాంధీజీ సిద్ధాంతాలతో
నెహ్రూజీ ఆచరణలతో
అంబేద్కర్ ఆశయాలతో
సుభాష్‌ని సంకల్పంతో

ఎగురవేయండి వినువీధిలో
త్రివర్ణ పతాక రెప రెపలను


-కయ్యూరు బాలసుబ్రమణ్యం
7780277240

నేను గీసిన బొమ్మ





బి. చైతన్య,
6వ తరగతి,
కేంద్రీయ విద్యాలయ నెం1,
విశాఖపట్నం.





పవని కృష్ణ ప్రణయిని
5వ తరగతి
చైతన్య స్కూల్,
చీరాల.





గుండెల్లి రామ్ చరణ్,
8వ తరగతి, జక్కాపూర్, సిద్దిపేట జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

విద్వేష విష సమయంలోనూ పరిమళించిన మనిషితనం!

దేశమంటే భిన్న జాతులు, మతముల సమ్మేళనం. దేశమంటే విభిన్న భాషల, సంస్కృతుల సంగమం. అంతకంటే ముందు దేశమంటే.. మనుషుల సందోహం. కలిసి మెలిసి బతకటం, కలిసి మెలిసి కదలటం మన స్వాతంత్య్ర పోరాటం మనకిచ్చిన వారసత్వం! కొంతమంది చరిత్రను వక్రీకరించి, మనుషుల మెదళ్లలో మతాల పేరిట విషం, విద్వేషం నింపుతున్నప్పటికీ; ఉన్మాదం, ఉన్మత్తత రాజ్యమేలుతున్నప్పటికీ; రక్తం ఏరులై పారుతున్నప్పటికీ ... అలాంటి ఘోర దురంతాల మధ్య కూడా కొందరు మనుషులు మనుషుల వలె ప్రవర్తిస్తారు. సామరస్యాన్ని, సౌభ్రాతృత్వాన్ని ప్రదర్శిస్తారు. మణిపూర్ మారణహోమంలోనూ అలాంటి మనుషులు కొందరు కనిపించారు. అసలు సిసలు భారతీయులుగా నిలిచారు.



మే 3.. మణిపూర్ మారణహోమం మొదలైన రోజు.. ఒకపక్క కట్టుకున్న గూడు మంటల్లో ఆహుతైపోతోంది.. తుపాకీ గుండ్లకు ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. మరోపక్క తన వారెవరో.. పరాయివారెవరో తెలియని అయోమయంలో కుకీలు, మెయితీలు ఒకరిపై మరొకరు విరుచుకుపడుతున్నారు. అటువంటి భీకర పరిస్థితిలో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పరుగులు పెడుతున్న బాధితులను అక్కున చేర్చుకున్నారు ముస్లిం నివాసితులు. బాధితుల్లో కుకీలు, మెయితీలు ఇద్దరూ ఉన్నారు. ఇద్దరికీ ఆశ్రయం ఇచ్చిన మానవత్వ హృదయులు వారు. దేశంలో ఎంతోమంది వారిపై విద్వేషాలు చిమ్ముతారు. వారి ఆహార నియమాలపై ఆంక్షలు పెడతారు. ఏదొక నెపం వేసి హత్యలు, అత్యాచారాలు చేస్తారు. దేశం వదిలిపొమ్మంటారు. ఇంతటి వివక్షకు గురవుతున్నా, తమపై దాడికి తెగబడిన మనుషులని తెలిసినా, సాటి మానవులుగా బాధితులను అక్కున చేర్చుకున్నారు.

ఈశాన్య భారతానికి చిహ్నంగా ఎత్తైన కొండలు ప్రారంభమైన ప్రాంతంలో క్వాక్తా ఒకటి. ముస్లింలు ఎక్కువగా ఉండే ఆ ప్రాంతానికి దగ్గరగా మెయితీలకు చెందిన 'టర్బంగ్ బంగ్లా', 'వెయిక్ హోరక్', కుకీల ఆవాసం 'కంగ్వీ' కూడా ఉన్నాయి. మే 3 మధ్యాహ్నం ఆ ప్రాంతాలలో అల్లరిమూకలు విరుచుకుపడ్డాయి. ఒక్కసారిగా చెలరేగిన సంఘర్షణలో చెల్లాచెదురుగా పరుగులు పెడుతున్న వాళ్లకి అండగా నిలిచారు స్థానికంగా ఉన్న ముస్లింలు. భద్రతా బలగాలు వచ్చేవరకు వారికి కావాల్సిన అన్ని సదుపాయాలు కల్పించారు.



ఆ రోజు నుండి ఈ వంద రోజుల్లో కుకీలు, మెయితీల్లో ఎంతోమంది నిరాశ్రయులయ్యారు. ఊళ్లకు ఊళ్లు తుడిచిపెట్టుకుపోయాయి. ఇప్పుడు ఆ కొండల్లో ఊళ్లు లేవు. సహాయక శిబిరాలతో, నిరాశ్రయులతో ఆ ప్రాంతమంతా నిండిపోయింది. శిబిరాల్లో తలదాచుకుంటున్న కుకీ, మెయితీలకు అండగా ముస్లిం గ్రామాలు, పట్టణాలు స్వచ్ఛందంగా ముందుకువచ్చాయి. నిధులు సేకరించి శిబిరాలకు అందజేశారు. వంటనూనె, ఆహార పదార్థాలు, దుప్పట్లు, బట్టలు, నిత్యావసరాలు సమకూర్చారు. ఇంకో విషయమేమంటే మణిపూర్‌లో ముస్లిం జనాభా అధికంగా ఉన్న ప్రాంతాల్లో హింస కనిపించలేదు. ఇరు వర్గాల మధ్య సయోధ్య కూర్చి తటస్థంగా ఉండేందుకు స్థానిక ముస్లిం పెద్దలు ఎనలేని కృషి చేశారు.

సరిగ్గా 30 ఏళ్ల క్రితం, మణిపూర్ జనాభాలో 53 శాతం ఉన్న మెయితీలలో మైనార్టీ వర్గంగా ఉన్న 8 శాతం మంది ముస్లిములు తీవ్ర వివక్షకు గురయ్యారు. మైనార్టీ వర్గం వల్ల మెజారిటీ వర్గానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని అప్పట్లో పుకార్లు లేవనెత్తారు. ఫలితంగా అప్పుడు హింస పెచ్చరిల్లింది. వందమందికి పైగా ముస్లిములు ప్రాణాలు కోల్పోయారు. మనుషులను విభజించే ఉన్మాదం ఎంత ప్రమాదమో వాళ్లకు తెలుసు. అందుకే ఇప్పుడు జరుగుతున్న ఈ ఘోరాలను చూస్తూ.. మౌనంగా ఉండలేకపోయారు. తమవంతుగా జాతుల భేదం లేకుండా రెండు వర్గాల బాధితులకు అండగా నిలిచాయి.

మణిపూర్ ముస్లింలని 'మెయితీ పంగల్' పేరుతో పిలుస్తారు. 'దాడులు జరుగుతున్నప్పుడు చుట్టుపక్కల ప్రాంతాల నుండి వందలమంది మా గ్రామాలవైపు వచ్చారు. నా ఇంట్లో వందమందికి ఆశ్రయం ఇచ్చాను. వారంతా మెయితీ వర్గానికి చెందిన మా కోడలు బంధువులు. వారిలో 20 మంది చిన్న పిల్లలు కూడా ఉన్నారు. ఆ రోజు వారినే కాదు, కుకీలు వచ్చినా నేను రక్షించే దాన్ని' అని చెప్పింది 65 ఏళ్ల పిత్రుబీబీ. ఆమె కొడుకుపై జూన్ 1న మెయితీ వర్గం విరుచుకుపడింది. దారుణంగా కొట్టింది. 'ఈ ముస్లిం కుకీలను రక్షించాడు..' అంటూ వారంతా నా మీద తెగబడ్డారు. కానీ మేం రక్షించింది మెయితీలను..



అంతకంటే ముందు బాధితులను..' అని చెప్పాడు అతడు.


మరొక సంఘటనలో అత్యంత పాశవికంగా మూకదాడికి గురైన ఓ బాధితురాలు కొండపై నుంచి దొర్లుకుంటూ వచ్చి, సాయం కోసం వేచి చూస్తున్నప్పుడు అటుగా వస్తున్న ఓ ముస్లిం ఆటోడ్రైవరు ఆమె ప్రాణాలను కాపాడి.. బంధువుల ఇంటికి చేర్చాడు. ఇంకా అనేకమంది బాధితులు ఆ కల్లోల ప్రాంతం నుంచి ఇంఫాల్‌కి, అక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు తరలివెళ్లటానికి ఎంతోమంది ట్రక్కు డ్రైవర్లు సహకరించారు. డబ్బు తీసుకోకుండా ఉచితంగానే తమ వాహనాల్లో వారికి చోటిచ్చారు.

మానవత్వం మనిషి లక్షణం.

సమైక్యత, సౌభ్రాతృత్వం మనకు స్వాతంత్ర్యోద్యమం ఇచ్చిన వారసత్వం. పాలకులు తాము చేసే తప్పులు బయటపడకుండా ప్రజలను కుల, మత, ప్రాంతీయ ఉద్వేగాలు, ఉద్రేకాలు వైపు నడిపిస్తారు. విష బీజాలు నాటుతారు. ప్రజలు ఆ ప్రమాదాన్ని పసిగట్టాలి. సమైక్య, సామరస్యాలతో పరిమళించాలి.

యువ క్రికెటర్ల సత్తాకు పరీక్ష..

- బుమ్రా ఫిట్
- రింకూ సింగ్ అరంగేట్రం పక్కా
- 18న ఐర్లాండ్‌తో తొలి టి20



జస్ప్రీత్ బుమ్రా



రింకూ సింగ్

ముంబయి: వెస్టిండీస్‌తో టి20 సిరీస్‌ను చేజార్చుకున్న టీమిండియా జట్టు ఇక ఐర్లాండ్‌తో సిరీస్‌కు సిద్ధమైంది. ఈ పర్యటనకు సీనియర్ ఆటగాళ్లు, హార్దిక్ పాండ్యాను దూరంగా ఉంచి మేనేజ్‌మెంట్ యువ క్రికెటర్లకు పెద్దపీట వేసింది. వెన్నునొప్పితో దాదాపు ఏడాదిగా టీమిండియాకు దూరంగా ఉన్న పేసర్ జస్ప్రీత్ బుమ్రా ఈ సిరీస్‌తో రీఎంట్రీ ఇవ్వనున్నాడు. ఈ పర్యటనలో భారతజట్టు పగ్గాలను అందుకున్న బుమ్రాతో పాటు ప్రసిధ్ కృష్ణ కూడా ఈ సిరీస్‌తోనే పునరాగమనం చేయనున్నా డు. ఆసియాకప్, వన్డే ప్రపంచకప్ ముందు మ్యాచ్ ప్రాక్టీస్ కోసం బుమ్రాను ఈ సిరీస్ ఆడిస్తున్నారు. అలాగే వెస్టిండీస్ పర్యటనతో అంతర్జాతీయ క్రికెట్ టి20ల్లో అరంగేట్రం చేసిన తిలక్ వర్మ, యశస్వి జైస్వాల్ ఈ సిరీస్‌కు కూడా ఎంపికయ్యారు. ఇక ఐపిఎల్ 2023 సీజన్‌లో ఒకే ఓవర్లో ఐదు సిక్సర్లు కొట్టి మ్యాచ్‌ను మలుపుతిప్పిన రింకూ సింగ్‌తోపాటు శివమ్ దూబే చాలాకాలం తర్వాత భారత జట్టులోకి రీఎంట్రీ ఇవ్వనున్నాడు. ఈ పర్యటన నుంచి హెడ్‌కోచ్ రాహుల్ ద్రావిడ్‌తో పాటు సహాయ సిబ్బంది విశ్రాంతి నిచ్చిన బిసిసిఐ.. సితాన్షు కోటక్, సాయిరాజ్ బహుతులేలను కోచ్‌లుగా ఎంపిక చేసింది.


ఓటమి మంచే చేసింది: హార్దిక్ పాండ్యా

టి20 సిరీస్ చేజారడం తమకు మంచే చేసిందని టీమిండియా కెప్టెన్ హార్దిక్ పాండ్యా సమర్థించుకున్నాడు. వెస్టిండీస్‌తో ఐదో, చివరి టి20 ఓడిన అనంతరం మీడియాతో మాట్లాడు తూ.. "నేను బ్యాటింగ్‌కు వచ్చే సమయంలో ఫామ్‌ను కొనసాగించే బ్యాటర్ కరువయ్యాడని, దీంతో వేగంగా పరుగులు చేయలేకపోయా మన్నా డు. ఓటమిపై ఎక్కువగా మాట్లాడుకోవాల్సిన అవస రం లేదని, గెలుపు, ఓటములు అనేవి ఆటలో ఒక భాగమని పేర్కొన్నాడు. త్వరలో వన్డే ప్రపంచకప్ జరగనుందని, కొన్నిసార్లు ఓడిపోవడం కూడా మంచి చేస్తుందని నమ్ముతానని అన్నాడు. ఎందుకం టే ఓటమిలో చాలా విషయాలను నేర్చుకునేందుకు అవకాశం కల్పిస్తుందని, ముఖ్యంగా యువ ఆటగాళ్లు తమకొచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకొన్నారని పేర్కొన్నాడు. అమెరికాలో క్రికెట్‌ను వీక్షించడానికి వచ్చిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలని, వచ్చే ఏడాది టి20 ప్రపంచకప్ అమెరికాలోనే జరగనుందని, ఇక్కడి పిచ్‌లకు బ్యాటింగ్‌కు అనుకూలమని చెప్పుకొచ్చాడు. ఆదివారం ఫ్లోరిడా వేదికగా జరిగిన ఐదో, చివరి టి20లో వెస్టిండీస్ జట్టు 8వికెట్ల తేడాతో టీమిండియాను చిత్తుచేసి సిరీస్‌ను 3-2తో చేజిక్కించుకున్న సంగతి తెలిసిందే. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ షెపర్డ్‌కు, సిరీస్ పూరన్‌కు లభించాయి. ఈ సిరీస్‌కు ముందు జరిగిన టెస్టు సిరీస్‌ను 1-0తో, వన్డే సిరీస్‌ను 2-1తో టీమిండియా చేజిక్కించుకుంది.

టి20 సిరీస్..

18(శుక్ర) : తొలి టి20
20(ఆది) : రెండో టి20
23(బుధ) : మూడో టి20
(రాత్రి 7.30గం॥ల నుంచి)

ఇంగ్లండ్ పేసర్ స్టీవెన్ ఫిన్ క్రికెట్‌కు గుడ్‌బై




లండన్ : ఇంగ్లండ్ జట్టు ఫాస్ట్ బౌలర్ స్టీవెన్ ఫిన్ అంతర్జాతీయ క్రికెట్‌కు గుడ్‌బై చెప్పాడు. ఏడాదిగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఫిన్.. మళ్లీ బంతిని పట్టి మైదానంలోకి దిగడం కష్టమని భావించి ఈ ప్రకటన చేసినట్లు సమాచారం. 'గత 12 నెలలుగా నా శరీరంతో పోరాడుతున్నా. చివరకు అలసిపోయానని ఒప్పుకుంటున్నా. ఇన్నిరోజులు క్రికెట్ ఆడినందుకు చాలా అదృష్టంగా భావిస్తున్నా.. అని సోమవారం ట్విటర్‌వేదికగా తెలిపాడు. కుడిచేతి వాటం పేసర్ అయిన ఇంగ్లండ్ తరఫున 36టెస్టులు, 69వన్డేలు, 21 టి20 మ్యాచ్‌లు ఆడాడు. టెస్టుల్లో 30.40 సగటుతో 125 వికెట్లు తీశాడు. అతడి అత్యుత్తమ ప్రదర్శన 6/125. వన్డేల్లోనూ ఫిన్ 102 వికెట్లు తీశాడు.

బ్యాటింగ్‌లో మార్పులే ఓటమికి కారణం
కోచ్ రాహుల్ ద్రావిడ్



ఫ్లోరిడా: 17 ఏళ్ల తర్వాత భారత్‌పై విండీస్ ఒక సిరీస్ గెలవడం ఇదే తొలిసారి. అంతేకాదు, భారత క్రికెట్ చరిత్రలో ఓ ద్వైపాక్షిక సిరీస్‌లో మూడు మ్యాచులు ఓడిపోవడం కూడా ఇదే తొలిసారి. ఈ ఓటమి గురించి టీమిండియా హెడ్ కోచ్ రాహుల్ ద్రావిడ్ స్పందించాడు. ఈ సిరీసులో భారత జట్టు కొన్ని పొరపాట్లు చేసిందని, ముఖ్యంగా బ్యాటింగ్ విషయంలో చేసిన తప్పులే కొంప ముంచాయని చెప్పాడు. ఆరంభంలో రెండు ఓటముల నుంచి పుంజుకోవడంలో జట్టు సక్సెస్ అయిందని, కానీ సిరీస్‌ను అదే ఊపులో ముగించలేకపోయామని ద్రావిడ్ అభిప్రాయపడ్డాడు. 'సిరీసులో మేం కొన్ని పొరపాట్లు చేశాం. ఓవరాల్‌గా ఐదు మ్యాచులు గమనిస్తే మేం చేసిన తప్పులు కనిపిస్తాయి. మొదటి రెండు మ్యాచులు, ఈ చివరి మ్యాచులో కూడా మా బ్యాటింగ్ విభాగం అంత గొప్పగా రాణించలేదు. కానీ ఇది యంగ్ టీం కాబట్టి అలా జరగడంలో వింతేం లేదు. అందరూ కుర్రాళ్లు, నెమ్మదిగా మెరుగవుతున్నారు' అని ద్రావిడ్ చెప్పుకొచ్చాడు. 'ఇది ఎదుగుతున్న టీం కాబట్టి ఎత్తుపల్లాలు సహజమే. అదే సమయంలో విండీస్ పెట్టిన ఎఫర్ట్‌ని మర్చిపోకూడదు. వాళ్లు అద్భుతంగా ఆడారు. ఈ సిరీసులో మేం చాలా విషయాలు నేర్చుకున్నాం. ఓడిపోయినందుకు బాధగానే ఉంది. రెండు ఓటముల నుంచి కోలుకొని రాణించడం గొప్పే. కానీ ఈ మ్యాచ్ కూడా గెలిస్తే బాగుండేది. విండీస్ చాలా మంచి టీ20 జట్టు' అని ద్రావిడ్ పేర్కొన్నాడు.

టొరండో టైటిల్ విజేత సిన్నర్



టొరంటో: టొరంటో మాస్టర్స్-1000 టైటిల్‌ను జెన్నిక్ సిన్నర్(ఇటలీ) చేజిక్కించుకు న్నాడు. ఆదివారం జరిగిన ఫైనల్లో సిన్నర్ 6-4, 6-1తో అలెక్స్ డి-మినార్(ఆస్ట్రేలియా)పై వరుససెట్లలో నెగ్గాడు. దీంతో 2017లో 20ఏళ్లకు ఈ టైటిల్ నెగ్గిన అలెగ్జాండర్ జ్వెరేవ్ తర్వాత 21ఏళ్లకు ఈ టైటిల్‌ను నెగ్గిన మరో యువ ఆటగాడు సిన్నర్ మాత్రమే.

రూనే, సిన్నర్ ర్యాంకులు మెరుగు

తాజా ఏటిపి ర్యాంకింగ్స్‌లో జెన్నిక్ సిన్నర్, హోల్గర్ రూనే ర్యాంక్ మెరుగైంది. అంతర్జాతీయ టెన్నిస్ ఫెడరేషన్(ఏటిపి) సోమవారం విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో రూనే(డెన్మార్క్) 4790పాయింట్లతో 5వ స్థానానికి ఎగబాకగా.. టొరంటో టైటిల్ విజేత, ఇటలీకి చెందిన జెన్నిక్ సిన్నర్ 4725పాయింట్లతో 6వ స్థానంలో నిలిచాడు. టొరంటో సెమీస్‌కు టాప్ సీడ్ కార్లోస్ అల్కరాజ్‌ను ఓడించిన టామీ పాల్(అమెరికా) 13వ స్థానంలో నిలువగా.. అలెగ్జాండ్రో 123వ స్థానం నుంచి 14వ స్థానానికి ఎగబాకాడు.

ఏటిపి టాప్-10 ర్యాంకింగ్స్..

1. అల్కరాజ్(స్పెయిన్) : 9395పాయింట్లు	2.నొవాక్ జకోవిచ్(సెర్బియా) : 8795
3. డానియేల్ మెద్వదెవ్(రష్యా): 6530	4. స్టెఫానాస్ సిట్సిపాస్(గ్రీక్) : 5090
5. హోల్గర్ రూనే(డెన్మార్క్) : 4790	6. జన్నిక్ సిన్నర్(ఇటలీ) : 4725
7. కాస్పర్ రూడ్(నార్వే) : 4715	8. ఆండీ రుబ్లేవ్(రష్యా) : 4595
9. టేలర్ ఫ్రిట్జ్(అమెరికా) : 3605	10. ఫ్రాన్సెస్ టఫీ(అమెరికా) 3050

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68